ఆదివారం
17-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 56
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

రేపు శ్రీలంక ప్రధాని, కేబినెట్ నియామకం

కొలంబో: శ్రీలంక సార్వత్రిక ఎన్నికల్లో వామపక్ష కూటమి నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) రెండొంతుల మెజారిటీ సాధించింది. 159 సీట్లను గెలుచుకుంది. దీంతో అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకె సోమవారం కొత్త ప్రధానిని,కేబినెట్‌ను నియమిస్తారని ఎన్‌పీపీ అధికార ప్రతినిధి తిల్విన్ సిల్వా వెల్లడించారు. మంత్రివర్గంలో 25 మందికే అవకాశముంది. శాఖలవారీగా నియామకాలు జరిగేందుకు అవకాశం ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 ప్రకారం కేబినెట్ మంత్రుల సంఖ్య 30కి, సహాయ మంత్రుల సంఖ్య 40కి మించరాదు. ఈసారి సహాయ మంత్రుల సంఖ్యను పెంచే అవకాశం ఉందని సిల్వా వెల్లడించారు.

క్యూబా విప్లవకారుడు గోంజాల్వెజ్ పెరెజ్ మృతి

హవానా: క్యూబా విప్లవకారుడు, ప్రముఖ ఫోరెన్సిక్ మెడిసిన్, సైన్స్ నిపుణులు డాక్టర్ జార్జ్ గోంజాల్వెజ్ పెరెజ్ కన్నుమూశారు. ప్రియతమ పోపి (డాక్టర్ పెరేజ్) మనతో లేరన్న బాధాకర సమాచారాన్ని బరువెక్కిన హృదయంతో పంచుకుంటున్నామని క్యూబా ప్రజారోగ్య మంత్రి జోసె ఏంజిల్ పోర్టల్ 'మిరాండ' ప్రకటించింది. ఫోరెన్సిక్స్ సైన్స్‌లో ఆరితేరిన జార్జ్ గోంజాల్వెజ్ పెరెజ్ విప్లవకారుల్లో చెప్పుకోదగ్గవారు. ఆయనను క్యూబన్లు ఆత్మీయంగా పోపీ అంటారు. గోంజాల్వెజ్ పెరెజ్

- మిగతా 2 లో

'వండర్ బుక్'లోకి జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్

న్యూదిల్లీ: త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి అమర్‌నాథ్ గౌడ్ అరుదైన రికార్డు సాధించారు. అత్యధిక కేసులు పరిష్కరించిన జడ్జిగా వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డుల్లోకి ఎక్కారు.జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్ 2017 నుంచి ఇప్పటివరకు 91,157 కేసులు పరిష్కరించారు. రోజుకు 109 కేసులను పరిష్కరించి రికార్డు సృష్టించారు. హైదరాబాద్‌కు చెందిన జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్ 2017లో తెలంగాణ, ఏపీ ఉమ్మడి హైకోర్టు

- మిగతా 2 లో

ఏడాదిన్నర కుమార్తె నరబలి

రాంచీ: జార్ఖండ్‌లో ఒళ్లు గగ్గుర్పొడిచే ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఏడాదిన్నర కుమార్తెను నరబలి ఇచ్చింది. ఛాతీ చీల్చి అడవుల్లోకి తీసుకెళ్లి బలి ఇచ్చింది. ఈ ఘటన జార్ఖండ్, పలాము జిల్లాలోని ఖరద్ గ్రామంలో జరిగింది. స్థానిక అరుణ్ రామ్, గీతాదేవి దంపతులు జప్లా- ఛతర్‌పూర్ ప్రధాన రహదారికి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న ఖరద్ గ్రామంలో ఉంటారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. గీతాదేవి అత్త కౌసల్యా దేవి ఈనెల 12వ తేదీ

- మిగతా 2 లో

మహారాష్ట్రకు మోదీ అన్యాయం

ఒక్క ఓటుతో ఇద్దరు సేవకులను పొందండి

ఐదు గ్యారెంటీలతో పేదల జీవితాల్లో వెలుగులు

ఎన్నికల ప్రచారసభలో రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: "తెలంగాణ ప్రజలకు ఆరాధ్యులైన కొండా లక్ష్మణ్ బాపూజీ గతంలో ఉమ్మడి హైదరాబాద్ రాష్ట్రంలో ఇదే ప్రాంతం నుంచి చట్టసభకు ప్రాతినిధ్యం వహించారని, కాలక్రమంలో రాష్ట్రాలుగా విడిపోయినా విదర్భ-తెలంగాణ ప్రజల మధ్య బంధుత్వాలు కొనసాగుతూనే ఉన్నాయని, ఆ అనుబంధంతోనే మీ అన్నగా తాను ఇక్కడికి వచ్చానని, హైదరాబాద్‌లో మరో సోదరుడిగా మీకు అండగా నిలబడతాను" అని మహారాష్ట్ర ప్రజలను ఆకట్టుకునేలా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రత్యేక ప్రచారకుడిగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. చంద్రపూర్ జిల్లా రాజురా నియోజకవర్గంలో మహా వికాస్ అఘాడీ అభ్యర్థి సుభాశ్ ధోతే తరపున శనివారం ప్రచారం చేశారు. రేవంత్ మాట్లాడుతూ ప్రజలు ఒక్క ఓటు వేసి సుభాశ్ ధోతేని గెలిపిస్తే ఆయనతోపాటు పొరుగు రాష్ట్ర సీఎంగా తానూ రాజురా ప్రజల బాగోగులు చూసుకునే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఒక్క ఓటుతో ఇద్దరు సేవకులను పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రానికి పెద్దమొత్తంలో పన్నులు చెల్లించే మహారాష్ట్రకు మోదీ సర్కారు తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్న ముంబై

- మిగతా 2 లో

గొప్ప మానవతావాది సీఆర్

ఏపీలోనూ సీఆర్ ఫౌండేషన్ సేవల విస్తరణ

- సీఆర్ ఫౌండేషన్ రజతోత్సవ సభలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: దేశ సమైక్యత కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప మానవతావాది చంద్ర రాజేశ్వరరావు అని వక్తలు కొనియాడారు. చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) ఫౌండేషన్ రజతోత్సవ సభ స్థానిక గాంధీనగర్‌లోని శ్రీ రామా ఫంక్షన్ హాల్లో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి ప్రసంగిస్తూ పార్టీలు, సిద్ధాంతాలు వేరైనా అంతా భారతీయులమంటూ దేశ సమైక్యతను తన నడవడిక ద్వారా నిరూపించిన గొప్ప నాయకుడు సీఆర్ అన్నారు. పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో సరిహద్దులో గల మన సైన్యం వద్దకు వెళ్లి వారిలో ఉత్తేజాన్ని నింపారని గుర్తుచేశారు. విలువలు మరువని దేశభక్తుడు సీఆర్ అని కొనియాడారు. తన మరణానికి ముందు వీలునామా పేరుతో సీఆర్ ఓ లేఖ రాశారని, అది వీలునామా కాదు... విలువలనామా అని ప్రశంసించారు. నాడు పార్టీలు, నాయకుల మధ్య చర్చలు మాత్రమే జరిగేవని, ఇప్పటిలా వ్యక్తిత్వ హననం లేదన్నారు. దేశభక్తులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను పాఠ్యాంశాలుగా చేర్చాలని వెంకట శేషసాయి సూచించారు.

సభకు అధ్యక్షత వహించిన సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయ విప్లవ ఉద్యమం గుర్తించిన నేత, వామపక్ష ఉద్యమానికి లెజెండరీ సీఆర్ అని అన్నారు. సీఆర్ కృషితోనే భూమి సమస్యలు జాతీయస్థాయి అజెండాగా మారాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ సేవలను ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కేంద్రంగా విస్తరణ చేయనున్నట్లు నారాయణ వెల్లడించారు. కమ్యూనిస్టు ప్రభావం లేకుండా సీఆర్ ఫౌండషన్ పేరుతో చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా సాధికారత, గ్రంథాలయం, కళా కేంద్రం ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు ధైర్యంగా నిలబడిన వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు అన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో లౌకికవాద పరిరక్షణ కోసం దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారని గుర్తుచేశారు. సీఆర్ ఫౌండేషన్‌కు సీఆర్‌డీఏ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు త్యాగాలు, నిరాడంబరతను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మహాత్మాగాంధీ ఆశయాలను ఆచరించి చూపిన నేత సీఆర్ అన్నారు. దేశం కోసం పాతతరం త్యాగాలు చేసిందని, నేటి తరం దేశాన్ని త్యాగం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్ర రాజేశ్వరరావుతో తనకు, తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని, సీఆర్ జీవిత విశేషాలను వివరించారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కొందరు చరిత్రను మార్చటానికి జన్మిస్తారని, సీఆర్ ఆ కోవకు చెందుతారని చెప్పారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టి... ఉన్నత విద్య అభ్యసించి... వాటన్నింటినీ కాదని దేశ సమైక్యత కోసం పని చేశారని తెలిపారు. మౌలిక అంశాలపై రాజీపడకుండా ఏకాభిప్రాయంతో పనిచేస్తే స్వాతంత్ర్యం నిలుస్తుందన్నారు. నేడు ప్రజాస్వామ్యాన్ని, న్యాయవ్యవస్థను కాలరాస్తూ కార్పొరేట్‌లకు దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. విజయవాడలో చంద్ర రాజేశ్వరరావు పేరుతో స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం మాట్లాడుతూ సాంఘిక విప్లవకారుడు, సమసమాజ నిర్మాణం కోసం పరితపించిన నాయకుడు సీఆర్ అన్నారు. సీఆర్ ఫౌండేషన్‌కు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.

ముందుగా చంద్ర రాజేశ్వరరావు చిత్ర పటానికి నేతలు పుష్పాంజలి ఘటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు

- మిగతా 2 లో

కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులు

ఖడ్గేకు, నడ్డాకు ఈసీ నోటీసులు

న్యూదిల్లీ: మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ఎన్నికలు సమీపిస్తుండగా కాంగ్రెస్, బీజేపీకి ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. పోలింగ్ తేదీకి రెండు రోజుల ముందు అంటే 18న (సోమవారం) రెండు పార్టీల అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, జేపీ నడ్డా వివరణను కోరింది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ ఈ పార్టీల అగ్రనేతలు రాహుల్ గాంధీ, అమిత్‌షా ప్రసంగించడంపై తాజా నోటీసులు జారీ అయ్యాయి. ఈనెల 6న ముంబైలో రాహుల్ ప్రసంగిస్తూ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఫిర్యాదు దాఖలైంది. మహారాష్ట్ర నుంచి అవకాశాలను దోచుకున్నట్లు, లాక్కున్నట్లు ఇతర రాష్ట్రాలపై ఆయన తప్పుడు ఆరోపణలు చేసినట్లు బీజేపీ ఆరోపించింది. రాహుల్ తన వ్యాఖ్యలతో రాష్ట్ర యువతను రెచ్చగొడుతున్నారని, ఇది దేశ ఐక్యత, సమగ్రతకు ముప్పు వాటిల్లజేయగలదని పేర్కొంది. రాహుల్ ప్రసంగం మొత్తం అబద్ధాలేనని, రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య శత్రుత్వాన్ని, అయిష్టతను సృష్టించే దురుద్దేశంతో చేసినదిగా ఆరోపించింది. తప్పుడు ప్రకటనలతో మహారాష్ట్ర, గుజరాత్... ఇతర రాష్ట్రాల ప్రజలను విభజించే

- మిగతా 2 లో

బీఆర్ఎస్ కుట్రలు ప్రజలు నమ్మరు

బీజేపీ నేతల మూసీ నిద్రతో ఒరిగేదీమీలేదు

ప్రజాకాంక్షలకు అనుగుణంగా పాలన: మహేశ్‌కుమార్ గౌడ్

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బీఆర్ఎస్ అనేక కుట్రలు చేస్తోందని, అయినా తెలంగాణ ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అధికారం కోల్పోవడంతో మతితప్పిన బీఆర్ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వరంగల్‌లో శనివారం కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధి, తాము ఏడాదిలో చేసిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మూసీ నిద్ర... ప్రజల ఆలోచనను పక్కదారి పట్టించడానికేనని, బీజేపీ నేతల మూసీ నిద్ర వల్ల ఒరిగేది ఏమీ ఉండదని అన్నారు. మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై విజయోత్సవాలు జరుపుతున్నామని, మహిళలకు, అన్నివర్గాల ప్రజలకు ఏం చేశామో వరంగల్ విజయోత్సవ సభలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇద్దరు మహిళా మంత్రులు వరంగల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తల భాగస్వామ్యం ఉండాలని, వరంగల్ లో జరిగే సమావేశం చరిత్ర సృష్టించాలని సూచించారు. ఏడాది తిరక్కుండానే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని , గత పాలకులు పదేళ్లలో కూడా నియామకాలు చేపట్టలేకపోయారని ధ్వజమెత్తారు. ప్రాజెక్టులు కట్టినా కూలిపోయే పరిస్థితి అని... డబ్బులకోసం కట్టి దోపిడీ చేశారని ఆరోపించారు. ప్రజల నమ్మకాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుందన్నారు. ముఖ్యమంత్రి విద్య, వైద్య, ఉపాధిపై దృష్టి సారించారని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీలు రాబోతున్నాయని చెప్పారు. 10 ఏళ్లలో మీరు విడతల వారీ ఇచ్చిన రుణమాఫీ ఎంత... తాము అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో ఇచ్చిన రుణమాఫీ ఎంత అని హరీశ్‌రావును ప్రశ్నించారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు వస్తుందని, దీనికి సంబంధించిన జీవో, రింగ్ రోడ్డు, గిరిజన వర్సిటీ వస్తుందని వివరించారు.

ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19న వరంగల్‌లో జరిగే కార్యక్రమాలకు నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేయాలన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

మళ్లీ భగ్గుమన్న మణిపూర్

- ఆరుగురు బందీల మృతదేహాలు లభ్యం
- మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపై నిరసనకారుల దాడులు
- ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

ఇంఫాల్/న్యూదిల్లీ: మణిపూర్ మళ్లీ భగ్గుమంది. ఇటీవల కుకీ మిలిటెంట్లు అపహరించిన ఆరుగురు హత్యకు గురవడంతో మైతేయి సామాజిక వర్గానికి చెందిన నిరసనకారులు శనివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు మంత్రులు, ముగ్గురు ఎమ్మెల్యేల నివాసాల ముందు నిరసనకు దిగి, దాడులు చేశారు. దీంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారడంతో భద్రతా బలగాలు, పోలీసులు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని జిరిబామ్ జిల్లాకు చెందిన అనుమానిత కుకీ మిలిటెంట్లచే బందీలుగా ఉన్న మైతేయి వర్గానికి చెందిన ముగ్గురు మహిళలు, ఎనిమిది నెలల చిన్నారి సహా ముగ్గురు పిల్లలు... ఆరుగురి మృతదేహాలను ఐదు రోజుల తర్వాత పోలీసులు కనుగొన్నారని ప్రభుత్వ ఉన్నత వర్గాలు ఎన్‌డీటీవీకి తెలిపాయి. జిరిబామ్ జిల్లాలోని జిరిముఖ్

- మిగతా 2 లో

ఇదీ లోకం!



చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టుల కాల్చివేత

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. కాంకేర్-నారాయణపూర్ సరిహద్దున గల అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య శనివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు నక్సల్స్‌ను బలగాలు మట్టుబెట్టాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు భద్రతా సిబ్బంది కూడా గాయపడ్డారు. శుక్రవారం రాత్రి నుంచి బలగాల గాలింపు చర్యలు జరుపుతుండగా ఉదయం ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. మావోయిస్టులకు గట్టిపట్టున్న దట్టమైన అటవీ ప్రాంతాల్లో సంయుక్త భద్రతా బలగాలు గాలింపు జరుపుతుండగా ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నట్టు రాష్ట్ర పోలీసులు తెలిపారు. ఇది చాలా కీలకమైన ఆపరేషన్ అన్నారు. గాయపడిన జవాన్లను వైద్యచికిత్స కోసం హెలికాప్టర్‌లో తరలించామని, ప్రస్తుతం వారి పరిస్థితి నిలకబడగా ఉందని చెప్పారు. కాగా, ఈవారం మొదట్లో భద్రతా బలగాలు కీలకమైన ఆపరేషన్ జరిపారు. బీజాపూర్

- మిగతా 2 లో

సీపీఐకి పూర్వవైభవం తేవాలి

- వందేళ్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించండి
- 50 కుటుంబాలు కూనంనేని సమక్షంలో పార్టీలో చేరిక

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: సీపీఐకి పూర్వవైభవం రావాలంటే పార్టీ శ్రేణులు సైనికుల్లా అవిశ్రాంతంగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై సమస్యల సాధనకు శ్రమించినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల, మైలారం ఏజెన్సీ గ్రామాల నుంచి 50 కుటుంబాలు శనివారం కూనంనేని సమక్షంలో సీపీఐలో చేరారు. ఎర్ర కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని అందించారు. గట్టుమల్లలో ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీల్లో గిరిజనులకు, గిరిజనేతర పేదలకు సీపీఐ అండగా నిలిచిందన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి వెళ్లే రాజకీయ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ పునరుద్ధరణ, చేర్పుల కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. ప్రతి గ్రామం, బస్తీల్లో సీపీఐ వసంతోత్సవాలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. కల్తీ అర్జున్, మేడ్ హనుమంతు, గులాం అజ్జు, గంగారావు సురేష్, బాండ కృష్ణ, బాడిశ రవి నేతృత్వంలో 50 కుటుంబాలు పార్టీలో చేరారు. జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, దీటి లక్ష్మీపతి, దారా శ్రీనివాస్, కుంజా రాంబాబు, జోగా రాంబాబు, కారం జనార్దన్, దేవరగట్ల రాంబాబు, దేరంగుల సత్యం, చక్రపాణి, శ్రీరాంరెడ్డి, కంటెం రాజశేఖర్, కోడి లింగయ్య, వంక శ్రీను పాల్గొన్నారు.

ట్రంప్‌ను హత్య చేసే ఆలోచన లేదు

అమెరికాకు ఇరాన్ సందేశం

టెహ్రాన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్‌పై వరుస హత్యాయత్నాలు జరగడం వెనుక ఇరాన్ హస్తం ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు రావడంతో అగ్రరాజ్యం గట్టిగా హెచ్చరించింది. దీనిపై టెహ్రాన్ స్పందిస్తూ... తమకు అలాంటి ఉద్దేశం లేదని చెప్పింది. ఈ మేరకు బైడెన్ సర్కారుకు సందేశం పంపినట్లు తాజాగా న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. దీంతో అప్పట్లో ఆయన ప్రచార బృందం ఓ ప్రకటన విడుదల చేసింది. 'అమెరికాలో అస్థిరత, గందరగోళం సృష్టించాలని ఇరాన్ ప్రయత్నిస్తుంది. మాజీ అధ్యక్షుడు ట్రంప్‌నకు కచ్చితమైన ముప్పు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ కార్యాలయం హెచ్చరించింది' అని అందులో పేర్కొంది. ట్రంప్ హయాంలో 2020లో జరిగిన ఇరాన్ మేజర్ జనరల్ ఖాసీం సులేమానీ హత్యకు ప్రతీకారంగానే టెహ్రాన్ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది సెప్టెంబరులో బైడెన్ ప్రభుత్వం టెహ్రాన్‌కు గట్టి హెచ్చరికలు చేసింది. ట్రంప్‌నకు హాని తలపెట్టాలని చూస్తే... దాన్ని యుద్ధాన్ని ప్రేరేపించే చర్యగా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించింది. దీనికి ఇరాన్ స్పందిస్తూ అక్టోబరులో తమ వివరణ పంపించినట్లు తాజా కథనం వెల్లడించింది. 'సులేమానీ హత్య నేరపూరిత చర్యే. అయితే దీనిపై మేం అంతర్జాతీయ న్యాయ మార్గాల్లోనే పోరాటం చేస్తాం. అంతేగానీ, హింసాత్మక ఘటనతో ప్రతీకారం తీర్చుకోవాలనుకోవట్లేదు. ట్రంప్‌ను హత్య చేసే ఉద్దేశం మాకు లేదు' అని ఇరాన్ తమ సందేశంలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ మెసేజ్‌ను ఇరాన్ అధికారులు కూడా ధ్రువీకరించినట్లు ఆ కథనం తెలిపింది. దీనిపై అమెరికా అధికారులు ఇంకా స్పందించనప్పటికీ... టెహ్రాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నుంచే ఈ సందేశం వచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్‌ను హత్య చేయాలన్న కుట్రలో భాగస్వాములైన ఇద్దరు అమెరికా పౌరులను ఇటీవల ఎఫ్‌బీఐ అదుపులోకి తీసుకుంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దళానికి (ఐఆర్‌జీసీ) చెందిన ఓ అధికారి ఈ కుట్రలో కీలక

పాత్ర పోషించాడని ఎఫ్‌బీఐ పేర్కొంది. ఐఆర్‌జీసీ అధికారి సూచనల ప్రకారమే ఇరాన్‌లో ఉంటున్న ఫర్హాద్ షకేరీ... అమెరికాలో తనకు తెలిసిన ఇద్దరు వ్యక్తులను ఈ హత్య ప్రణాళికను అమలు చేసేందుకు ఎంపిక చేసుకున్నాడని పేర్కొంది. ఆ ఇద్దరిని కస్టడీలోకి తీసుకున్నామని ఎఫ్‌బీఐ తెలిపింది. ఎన్నికల ప్రచారం సందర్భంగానే ట్రంప్‌ను హత్య చేయాలని తమకు సూచనలు అందాయని, తర్వాత ప్రణాళిక మారిందని షకేరీ తెలిపినట్లు ఎఫ్‌బీఐ వెల్లడించింది.

అర్షదల్లా అరెస్టుపై చర్చిస్తున్నాం: కెనడా మంత్రి

ఒట్టావా: భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించిన ఖలిస్థానీ వేర్పాటువాది అర్షదీప్ సింగ్ అలియాస్ అర్షదల్లాను కెనడా పోలీసులు అరెస్టు చేశారు. అతడిని తమకు అప్పగించాలని ఇటీవల కెనడాను భారత్ కోరింది. దీనిపై కెనడా విదేశాంగ శాఖ మంత్రి మెలానీ జోలీ స్పందిస్తూ అతడిని అప్పగించే విషయంపై భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌తో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. పెరూలోని లిమాలో జరిగిన ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార వార్షిక మంత్రివర్గ సమావేశంలో మెలానీ జోలీ మాట్లాడుతూ ప్రస్తుతం అర్షదల్లా కేసులో విచారణ జరుగుతోందని, కాబట్టి ఆ విషయంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదని అన్నారు. అతడికి సంబంధించి ఏవైనా విచారణలు చేయాల్సి ఉంటే భారత దౌత్యవేత్తలతో చర్చలు జరుపుతామని తెలిపారు. అక్టోబరు 27, 28న మిల్టన్ పట్టణంలో కాల్పులు జరిపిన ఘటనలో సింగ్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన కెనడా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, పోలీసులు అతడిని అరెస్టు చేశారు. పంజాబ్‌లోని మోగా జిల్లాకు చెందిన దల్లాపై భారత్‌లో హత్య, వేధింపులు, అపహరణ సహా అనేక కేసులు ఉన్నాయి. గతేడాది జనవరిలో భారత ప్రభుత్వం అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. పెద్ద మొత్తంలో డ్రగ్స్, ఆయుధాల స్మగ్లింగ్‌లో ఇతడి పాత్ర ఉందని కేంద్ర హోంమంత్రిత్వశాఖ తెలిపింది. దల్లాకు సంబంధించిన కేసులను జాతీయ విచారణ సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఖలిస్థానీ ఉగ్రవాది, గుర్తు తెలియని వారి కాల్పుల్లో హతమైన నిజ్జర్‌కు దల్లా సన్నిహితుడు.

గిరిజన దురహంకారి రేవంత్

రైతులను మెప్పించడంలో వైఫల్యం: సత్యవతి రాథోడ్

పోలీసుల లైంగిక వేధింపులపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు మహిళల ఫిర్యాదు

విశాలాంధ్ర–హైదరాబాద్: లగచర్లలో రైతులు దాడులు చేశారన్న నెపంతో పోలీసులు అక్కడి మహిళలపై లైంగిక దాడులకు పాల్పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు. బాధిత మహిళలతో కలిసి శనివారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. తమపై పోలీసులు ఏ విధంగా అఘాయిత్యాలకు పాల్పడ్డారో బాధితులు వివరించారు. అర్ధరాత్రి ఇంటికి వచ్చి బూతులు తిట్టారని...లైంగికంగా వేధించారని మహిళలు ఆవేదన చెందారు. తమపై దాడి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచార కేసులు నమోదు చేయాలని కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి పరాకాష్ట పాలనకు లగచర్లలో పోలీసుల అమానుష దాడే నిదర్శనం అన్నారు. ఫార్మా కంపెనీ కోసం గిరిజనులపై దురహంకారంతో వ్యవహరిస్తూ వారి భూములను లాక్కునేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. సొంత నియోజకవర్గంలో రైతులను మెప్పించటంలో వైఫల్యం చెందిన రేవంత్ ... రాష్ట్ర ప్రజలను ఏ విధంగా మెప్పిస్తాడో చెప్పాలన్నారు. రేవంత్ వల్ల తమకు లాభం జరుగుతుందని గిరిజనులు ఆశిస్తే... వారి పొట్టకొడుతున్నాడని ధ్వజమెత్తారు. ఫార్మా కంపెనీ కాలుష్యంతో జీవితాలు ఆగమావుతాయని చిన్న పిల్లలు కూడా చెబుతున్నారని...ఈ విషయంపై సీఎంకు ఎందుకు సోయి లేదో చెప్పాలన్నారు. కడుపుకాలి తిరగబడితే వారిపై నాన్ బెయిల్ కేసులు పెట్టడమేమిటని ప్రశ్నించారు. సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి రాజ్యాంగేతర శక్తిగా మారాడని మండిపడ్డారు. కలెక్టర్ పై దాడులు చేశారంటూ అమాయకులైన రైతులపై అక్రమ కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. వెంటనే కేసులను ఉపసంహరించుకోవాలన్నారు.

అధికారులపై కాదు... గిరిజనులపైనే దాడి: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

వాస్తవానికి లగచర్లలో ఎస్సీ, ఎస్టీలపైనే దాడి జరిగిందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. దాడుల నెపంతో మహిళలపై పోలీసులు అసభ్యకంగా ప్రవర్తించారని మండిపడ్డారు. గిరిజన ప్రజలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉందని చెప్పారు. సమగ్ర దర్యాప్తు జరిపించి న్యాయం చేయాలని కమిషన్‌ను కోరామని ఆయన చెప్పారు.

విచారణ జరుపుతాం: కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మహిళలపై దాడులను నియంత్రించే విషయంలో కమిషన్ కఠినంగా వ్యవహరిస్తుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య చెప్పారు. అత్యాచార ఆరోపణలపై విచారణ జరుపుతామన్నారు. త్వరలోనే లగచర్లలో కమిషన్ పర్యటిస్తుందన్నారు. అన్యాయం జరిగిందని స్పష్టమైతే ఊరుకోబోం అని స్పష్టం చేశారు. ఫార్మా కంపెనీ కారణంగా భూములు కోల్పోతున్న గ్రామస్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కమిషన్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, జాన్సన్ నాయక్, రూప్ సింగ్ ఉన్నారు.

మస్క్-రష్యా బంధంపై దర్యాప్తు

డెమోక్రటిక్ సెనెటర్ల లేఖ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం కోసం స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తీవ్రంగా కృషి చేశారు. దీంతో ఆయనకు ట్రంప్ కీలక బాధ్యతలు అప్పగించారు. మస్క్‌తోపాటు భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) సంయుక్త సారథులుగా నియమించారు.

మరోవైపు మస్క్‌పై డెమోక్రటిక్ నేతలు గుర్రుగా ఉన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఆయన బంధంపై సమీక్ష చేపట్టాలని ఇద్దరు డెమోక్రటిక్ సెనెటర్లు బైడెన్ అడ్మినిస్ట్రేషన్‌ను డిమాండ్ చేశారు. రష్యన్ అధికారులను మస్క్ రెండేళ్లుగా కలుస్తున్నారన్న నివేదికలను ఉటంకిస్తూ... వీటిపై సమీక్ష చేపట్టాలని సెనెటర్లు జీన్ షాహీన్, జాక్ రీడ్ న్యాయశాఖ, పెంటగాన్ సంస్థలకు లేఖ రాశారు. ఈ ఇద్దరు సెనెటర్లు ఆర్మ్‌డ్ సర్వీసెస్ కమిటీకి నేతృత్వం వహిస్తున్నారు. ఈ సంబంధాలు జాతీయ భద్రతకు ముప్పు అని వారు పేర్కొన్నారు. స్పేస్ ఎక్స్‌కు, ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందాలపై దర్యాప్తు చేపట్టాలని కోరారు. బిలియన్ డాలర్ల మేర మస్క్ లబ్ధి పొందారని, ఈ వ్యవహారం ఆయన విశ్వసనీయతపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోందని వారు లేఖలో పేర్కొన్నారు. రష్యా ప్రభుత్వ అధికారులకు, సెక్యూరిటీ క్లియరెన్స్ ఉన్న ఏ వ్యక్తికి మధ్య సంబంధాలైనా అమెరికా భద్రతను ప్రమాదంలో పడేసే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. మాస్కోతో మస్క్ సంబంధాలపై గత నెల వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనాలు ప్రచురించిన అనంతరం చాలామంది డెమోక్రటిక్ నేతలు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని బహిరంగంగా

కోరుతున్నారు. దీనిపై దర్యాప్తు చేపట్టాలని అధికారులకు లేఖ రాయడం ఇదే తొలిసారి. ఈ వ్యవహారంపై ఇటు స్పేస్ ఎక్స్ గానీ, అటు పెంటగాన్ గానీ స్పందించలేదు. అయితే... ఈ ఆరోపణలు ఎవరు చేస్తున్నారో తాను కనిపెడతానని ఎక్స్ వేదికగా మస్క్ స్పందించారు.

ఏడాదిన్నర కుమార్తె నరబలి

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 11 గంటలకు ధాన్యం నిల్వ చేసే ప్రదేశాన్ని శుభ్రం చేయడానికి వెళ్లింది. తనతోపాటు గీతాదేవిని రమ్మని కోరింది. గీతాదేవి తన చిన్న కుమార్తెతో కలిసి జాప్లా (హుస్సేనాబాద్) వెళతానని చెప్పింది. అర్ధరాత్రి గడిచినా గీతాదేవి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన మొదలైంది. గీతాదేవితో పాటు పాప కోసం గాలింపు మొదలు పెట్టారు. మరోవైపు గీతాదేవి గురువారం వేకువజామున 2 గంటలప్పుడు అదే గ్రామానికి చెందిన మనోజ్ రామ్ ఇంటి తలుపు తట్టింది. తలుపు తీయగానే నేరుగా అతడి ఇంట్లోని పెరట్లోకి వెళ్లింది. తన భర్తతో గొడవపడి గీతాదేవి వచ్చిందని మనోజ్ కుటుంబం భావించింది. గీతాదేవి కుటుంబానికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చింది. దీంతో వారు అక్కడకు వచ్చి గీతాదేవిని ఇంటికి తీసుకెళ్లారు. కానీ పాప కనిపించలేదు. మనవరాలి గురించి అత్త ఆరా తీసింది. ఆమె జప్లాలో ఉన్నట్లు గీతాదేవి చెప్పింది. అయితే ఆమె వైఖరితో అనుమానం వచ్చి గ్రామస్థులు హుస్సేనాబాద్ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు గ్రామానికి 3కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో బాలిక మృతదేహాన్ని కనుగొన్నారు. చిన్నారి శరీరం ఛిద్రమైన స్థితిలో ఉంది. ఛాతిపై పెద్ద కత్తిగాట్లు ఉన్నాయి. అలాగే కాలిపోయిన బట్టలు, గాజులు, కుంకుమ కనిపించాయి. గీతాదేవిని పోలీసులు తమదైన శైలిలో విచారించగా నిజం బయటపడింది. తాను తాంత్రిక విద్యను అభ్యసించినట్లు గీతాదేవి తెలిపింది. తన కుమార్తెను హత్యచేశానని, తర్వాతి రోజే మళ్లీ తన మంత్ర శక్తులతో కాపాడేదానినని చెప్పుకొచ్చింది. ఇది జరిగిన రోజు గీతాదేవి భర్త అరుణ రామ్ ఇంట్లో లేడు. ఛాత్ పండగకు వచ్చిన సోదరిని అత్తింటిలో దిగబెట్టేందుకు వెళ్లాడు. తన కుమార్తెను భార్యే చంపిందని తెలిసి తట్టుకోలేకపోయాడు. తన భార్య మానసిక రోగి కాదని, పూర్తి ఆరోగ్యంతో ఉందని , ఎందుకిలా చేసిందో తెలియట్లేదని అన్నాడు. తాను వేరే రాష్ట్రంలో పనిచేస్తున్నానని, ఛాత్ పండుగ సందర్భంగా ఇంటికి వచ్చానన్నాడు. తమకు పెళ్లైన మూడేళ్ల వరకు సంతానం కలగలేదని, ఓ తాంత్రికుడి వద్దకు వెళ్లిన తర్వాత మొదటి బిడ్డ పుట్టినట్లు తెలిపాడు. కాగా, గీతాదేవి అర్ధరాత్రి సమయంలో నిర్మానుష్య ప్రదేశానికి ఒంటరిగా వెళ్లలేదని. ఆమెతో పాటు రోహిత్ అనే తాంత్రికుడు ఉన్నాడని తెలిసిందని, చిన్నారి కాలేయం బయటకు తీసినట్లు మృతదేహాన్ని చూస్తే అర్థమవుతోందని సామాజిక కార్యకర్త మన్‌దీప్ రామ్ చెప్పాడు. ఈ ఘటనపై హుస్సేనాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. గీతాదేవిని జైలుకు పంపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని పోలీసులు చెప్పారు.

దక్షిణాది రాష్ట్రాల్లో

సంతానోత్పత్తి సమస్య

దూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: దక్షిణాది రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు తగ్గుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చైనా, జపాన్ సహా అనేక ప్రపంచ దేశాల్లో వయోధికులు ఎక్కువైపోతున్నారని, మన దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఈ సమస్య ప్రారంభమైందని తెలిపారు. సాధారణంగా ఇది 2.1 కంటే ఎక్కువగా ఉంటే సమస్య ఉండదు. ప్రస్తుతం బోర్డర్ లైన్‌లో జననాల రేటు ఉంది. ఇది కాస్త తగ్గితే జపాన్, చైనా మాదిరి సమస్య మన దేశంలో కూడా మొదలవుతుందని చంద్రబాబు ఆందోళన వెలిబుచ్చారు. భారతదేశంలో 145 కోట్ల జనాభా ఉందని, జనాభా నిర్వహణను సక్రమంగా చేస్తే ప్రపంచంలో మనల్ని కొట్టేవారే ఉండరని, బ్రిటీష్ వాళ్లు భారత్‌కి వచ్చి పరిపాలించిన తరహాలో మనం కూడా ప్రపంచదేశాలకు వెళ్లి ఆ దేశాలను ఏలవచ్చునన్నారు. రెండు రోజుల దిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు శనివారం ఉదయం హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో పాల్గొని వివిధ అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. సంతానోత్పత్తి రేటును ప్రణాళికాబద్ధంగా అమలు చేయగలిగితే 30-40 కోట్ల మంది భారతీయులు ప్రపంచంలో అన్ని మూలలకు విస్తరించి దేశానికి ఆదాయం తీసుకొస్తారన్నారు. దీనివల్ల భారత్ ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు ప్రపంచదేశాల్లోనూ భారతీయులు వివిధ రంగాల్లో రాణిస్తారన్నారు. ఒకప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా నిబంధనలు పెట్టామని, ఇప్పుడు ఆ నిబంధన తొలగించి కనీసం ఇద్దరు పిల్లలు ఉంటే తప్ప పోటీకి అర్హత లేదని పెట్టాలని చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. మానవ వనరులు, నైపుణ్యాల అభివృద్ధి పెరగాలని, దానికి అనుగుణంగా పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ కల్పన కల్పించాల్సి ఉందన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఒకటో తరగతి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. గతంలో టెలికాం రంగంలో సంస్కరణల వల్ల పురోగతి ఉంటుందని తానే నివేదిక ఇచ్చానని, దాన్ని అమలు చేయడం వల్ల టెలికాం రంగం వృద్ధి చెందిందని గుర్తుచేశారు.

'వండర్ బుక్'లోకి జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 అక్టోబరు 28న త్రిపుర హైకోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. 'జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రికార్డు సాధించారు. 2017 నుంచి 2024 వరకు హైదరాబాద్, త్రిపుర హైకోర్టులలో 91,157 కేసులను పరిష్కరించి అసాధారణ విజయాన్ని అందుకున్నారు. రోజుకు సగటున 109 కేసులు పరిష్కరించారు. ఈ రికార్డు మీ అత్యుత్తమ నిబద్ధత న్యాయ సాధనలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది' అని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ పేర్కొంది. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ సంస్థ భారత సమన్వయకర్త బింగి నరేంద్ర గౌడ్, లయన్ విజయలక్ష్మితో కలిసి జస్టిస్ అమర్‌నాథ్‌కు మెడల్, సర్టిఫికేట్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందజేశారు.

గొప్ప మానవతావాది సీఆర్

(మొదటి పేజీ తరువాయి)

పి.చంద్రనాయక్ సీఆర్ వీలునామా గీతాన్ని ఆలపించారు. అతిథులకు సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కంభంపాటి అజయ్, కార్యదర్శి పిడికిటి సంధ్యాకుమారి, పీజే చంద్రశేఖరరావు, కోశాధికారి వి.చెన్నకేశవరావు, కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, మానం ఆంజనేయులు, డాక్టర్ రజనీ, జోస్యుల కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఖడ్గేకు, నడ్డాకు ఈసీ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

యత్నమంటూ 11వ తేదీన బీజేపీ ఫిర్యాదు చేసింది. అటు కాంగ్రెస్ కూడా బీజేపీపై కౌంటర్ ఫిర్యాదు దాఖలు చేసింది. ఈనెల 12న ధన్‌బాద్ ర్యాలీలో ఐఎన్‌సీ, దాని మిత్రపక్షాలను కించపరుస్తూ, అవమానిస్తూ అమిత్‌షా మాట్లాడారని, తప్పుడు ప్రకటనలు చేశారని, విభజించే పద్ధతిలో ప్రసంగించారని కాంగ్రెస్ ఆరోపించింది. 'ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు వ్యతిరేకమని అమిత్‌షా అన్నారు. దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీల రిజర్వేషన్లను హరించి వాటిని ఓ మైనారిటీ వర్గానికి కట్టబెట్టాలని చూస్తున్నట్లు ఆరోపించారు' అని ఈనెల 13న దాఖలు చేసిన ఫిర్యాదులో కాంగ్రెస్ పేర్కొంది. మతం, కులం పేరిట ఓటర్లను రెచ్చగొట్టే ఏకైక ఉద్దేశంతో అమిత్‌షా ఇలాంటి వ్యాఖ్యలు చేశారని దుయ్యబట్టింది. ఎన్నికల్లో లబ్ధి కోసం మత చిచ్చు రగుల్చుతున్నారని కాంగ్రెస్ తన ఫిర్యాదులో ఆరోపించింది.

ఐదుగురు మావోయిస్టుల కాల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో చేపట్టిన గాలింపు చర్యల్లో సీనియర్ ప్లాటూన్ కమాండర్ సహా ముగ్గురు మావోయిస్టులను బలగాలు మట్టుబెట్టాయి. సీనియర్ ప్లాటూన్ కమాండర్ తలపై రూ.8 లక్షల రివార్డు కూడా ఉంది. డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఎలైట్ కోబ్రా యూనిట్ సంయుక్తంగా రేఖాపల్లి-కోమత్ పల్లి అడవుల్లో ఈ ఆపరేషన్ జరిపారు. మూడు మృతదేహాలు, భారీ ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని, ఈ ఆపరేషన్‌తో నక్సల్స్ కార్యకలాపాలకు దెబ్బ తగిలిదని బస్తర్ రేంజ్ ఐజీపీ సుందర్ రాజ్ పి తెలిపారు. బస్తర్ ఏరియాలో నక్సల్స్‌ను పూర్తిగా ఏరివేయాలనే లక్ష్యంతో భద్రతా బలాలు అత్యంత అప్రమత్తంగా గాలింపు చర్యలు చేపడుతుండగా... రాబోయే రోజుల్లో అదనపు బలగాలు కూడా వచ్చిచేరనున్నట్టు అధికారులు తెలిపారు

సినీనటి కస్తూరి అరెస్టు

హైదరాబాద్/చెన్నై: సినీనటి కస్తూరి అరెస్టయ్యారు.హైదరాబాద్ గచ్చిబౌలిలో ఆమెను చెన్నై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హిందూ మక్కల్ కట్చి అధ్వర్యంలో చెన్నైలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న సందర్భంగా తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి వివాదానికి తెరతీశారు కస్తూరి. దీంతో ఆమెపై తెలుగు సంఘాలు, ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. చెన్నై ఎగ్మోర్‌లోని తెలుగు సంస్థ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సమన్లు ఇవ్వడానికి పోలీసులు ఇటీవల పోయెస్ గార్డెన్‌లోని కస్తూరి ఇంటికి వెళ్లారు. ఆమె ఇంట్లో లేకపోవడం, ఫోన్ స్విచాఫ్ రావడంతో పరారీలో ఉన్నట్లు తేల్చారు. గాలించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇదే క్రమంలో హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్నట్టు తెలుసుకున్న చెన్నై పోలీసులు శనివారం సాయంత్రం అక్కడికి చేరుకొని ఆమెను అరెస్టు చేశారు.

క్యూబా విప్లవకారుడు గోంజాల్వెజ్ పెరెజ్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

1952, ఏప్రిల్ 23న జన్మించారు. 1975లో హవాయా యూనివర్సిటీలో వైద్య విద్యలో చేరారు. క్యూబా విప్లవ యోధుడు చె గువెరా అవశేషాలను గుర్తించి, క్యూబాకు తిరిగి తేవడంలో సఫలమయ్యారు. దాదాపు 30 ఏళ్ల పాటు చె గువెరా, ఆయన సహచర యోధుల మృతదేహాల కోసం క్యూబా డిమాండ్ చేసింది. ఐదేళ్లు పరిశోధించిన అనంతరం చె గువేరా అవశేషాలను గోంజాల్వెజ్ పెరెజ్ నేతృత్వ బృందం నిర్ధారించింది. క్యూబాకు తిరిగి తెచ్చింది. క్యూబా విప్లవ సిద్ధాంతాల సమర్థుడికిగా 1988 నుంచి 2018 వరకు నేషనల్ అసెంబ్లీ డిప్యూటీగా ఎన్నికయ్యారు. ఆరోగ్య, క్రీడల కమిషన్ అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. బొలీవియాతో పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూపు అధ్యక్షుడిగానూ వ్యవహరించారు.

అధ్యక్షుడి సంతాపం: క్యూబన్ల పోపీ తుదిశ్వాస విడవడం బాధాకరమని అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కెనల్ 'ఎక్స్'లో సంతాపం ప్రకటించారు. మేధావిని, నిబద్ధతగల శాస్త్రవేత్తను క్యూబా కోల్పోయిందన్నారు. ఆయనను పని వీరుడంటూ శ్లాఘించారు. చె గువెరా అవశేషాల గుర్తింపునకు గోంజాల్వెజ్ పెరెజ్ అందించిన విశేష సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

మహారాష్ట్రకు మోదీ అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

మహానగరంతోపాటు ఇతర పెద్ద నగరాలైన దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కోల్‌కతాలో బీజేపీకి అసలు ప్రాతినిధ్యమే లేదని గుర్తుచేశారు. వెన్నుపోటు రాజకీయాలతో విపక్ష ప్రభుత్వాలపై కుట్రలు చేసే బీజేపీని పాతిపెట్టాలని పిలుపునిచ్చారు. ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ వంటి వెన్నుపోటుదారులతో క్షుద్ర రాజకీయాలు చేసే బీజేపీని తరిమికొట్టాలన్నారు. తెలంగాణలో కూడా కేసీఆర్‌ను తరిమికొట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదని గుర్తుచేశారు. తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మహారాష్ట్రలోనూ మహా వికాస్ అఘాడీ ఇచ్చిన ఐదు గ్యారంటీలు ... ప్రత్యేకించి పేదప్రజల జీవితాల్లో వెలుగులు నింపడం ఖాయమని అన్నారు. మహారాష్ట్ర గడ్డ మహాయోధులను కన్న నేల అని, శివాజీ మహారాజ్, బాబా సాహెబ్ అంబేద్కర్, బాలా సాహెబ్ ఠాక్రే వారసులుగా, రాహుల్ గాంధీ సైనికులుగా కుట్రల పార్టీ బీజేపీతో కలబడి గెలవాలని పిలుపునిచ్చారు. ఓటమి తప్పదని భావించిన బీజేపీ తన బీ టీమ్ వ్యక్తులను ఇండిపెండెంట్లుగా బరిలోకి దింపిదని, అప్రమత్తంగా ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు.

ప్రజాతీర్పు కాలరాశారు...

మహారాష్ట్రలో ప్రజాతీర్పును ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ కాలరాశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. వారిద్దరూ గుజరాత్ గులాంలుగా మారారని ఎద్దేవా చేశారు. రెండు రోజులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు మహారాష్ట్ర వెళ్లిన సీఎం... చంద్రాపూర్ నియోజవర్గం గుగ్గూస్‌లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, ఏడాది కాలంలో తెలంగాణలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చామని చెప్పారు. దేశంలో గుజరాత్ సహా ఏ రాష్ట్రంలోనూ ఏడాది కాలంలో 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. చంద్రాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రవీణ్ పడ్వేకర్‌ను 50 వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ ప్రవీణ్‌ను గెలిపిస్తే మీకు ఇక్కడ ఒక అన్న ఉంటారు, హైదరాబాద్‌లో మరో అన్నగా నేను ఉంటా అని చెప్పారు.

మళ్లీ భగ్గుమన్న మణిపూర్

(మొదటి పేజీ తరువాయి)

వద్ద బరక్ నదిలో పడి ఉన్న ఒక మహిళ, ఇద్దరు చిన్నారుల మృతదేహాలను ఉద్రిక్తత మధ్య శుక్రవారం రాత్రి పొరుగున ఉన్న అసోంలోని సిల్చార్‌లోని శవాగారానికి తీసుకువచ్చారు. గత రాత్రి ముగ్గురు మహిళల మృతదేహాలను ఇక్కడికి తీసుకువచ్చినట్లు సిల్చార్ వైద్య కళాశాల ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మృతదేహాల ప్రాథమిక పరీక్షలో వారు పెద్దవారని తేలిందని వివరించారు. అయితే శనివారం ఉదయం రెండు మృతదేహాలు చిన్నారులవి కాగా, ఒక మృతదేహం మహిళదని నిర్ధారించారు. మృతదేహాలు కొంత కుళ్లిపోవడంతో ఉబ్బిపోయాయని వారు తెలిపారు. మధ్యాహ్నం తర్వాత మరో మూడు మృతదేహాలు లభించాయని, మొత్తం ఆరుకు చేరినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ మూడు మృతదేహాలను ఇంకా ఎస్ఎంఎస్‌హెచ్‌కి తీసుకురాలేదని, గుర్తించాల్సి ఉందని తెలిపాయి. బందీలలో రాష్ట్ర ప్రభుత్వంలో కింది స్థాయి ఉద్యోగి లైషారామ్ హీరోజిత్ ఇద్దరు పిల్లలు, భార్య, అత్త, భార్య సోదరి ఉన్నారు. శనివారం ఉదయం ఆయన ఎన్‌డీటీవీతో మాట్లాడుతూ తాను ఇంకా మృతదేహాలను చూడలేదని చెప్పారు. కాగా, హత్యకు గురైన వారందరూ మైతేయి సమాజానికి చెందినవారు. జిరిబామ్ నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిల్చార్ వైద్య కళాశాల ఆస్పత్రి (ఎస్ఎంఎస్‌హెచ్) లో శవాగారం ఉంది. మొదటి మూడు మృతదేహాలను శుక్రవారం సాయంత్రం 7 గంటలకు శవాగారానికి తీసుకువచ్చారు. పట్టణంలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో జిరిబామ్‌లో లభించిన మృతదేహాల శవపరీక్షలు ఎస్ఎంఎస్‌హెచ్‌లో జరుగుతాయని ఆ వర్గాలు తెలిపాయి.

నిరసనకారుల దాడులు

జిరిబామ్ జిల్లాలో ఆరుగురి హత్యకు సంబంధించి తమ వర్గానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇంఫాల్‌లో ఇద్దరు మణిపూర్ మంత్రులు, ముగ్గురు ఎమ్మెల్యేల ఇళ్లలోకి నిరసనకారులు చొరబడ్డారని పోలీసులు తెలిపారు. శాసనసభ్యుల ఇళ్లపై గుంపు దాడులు చేయడంతో పశ్చిమ ఇంఫాల్ పరిపాలన జిల్లాలో నిరవధిక నిషేధ ఉత్తర్వులు విధించారు. ఇంఫాల్ పశ్చిమ, తూర్పు ప్రాంతాలతో పాటు విష్ణుపూర్, తౌబల్, కక్చింగ్, కాంగ్‌పోక్పి, చురచంద్‌పూర్‌లో రెండు రోజుల పాటు ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలను అధికారులు నిలిపివేశారు. లాంఫెల్ సనకీతెల్ ప్రాంతంలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సపమ్ రంజన్ నివాసంపై ఒక గుంపు దాడి చేసిందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని సగోల్‌బండ్ ప్రాంతంలో ఆందోళనకారులు ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ అల్లుడు కూడా అయిన బీజేపీ శాసనసభ్యుడు ఆర్.కె.ఇమో నివాసం

ముందు గుమిగూడి 'ప్రభుత్వం నుంచి తగిన ప్రతిస్పందన' కోసం డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. 24 గంటల్లోగా దోషులను అరెస్టు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. కైషామ్‌థాంగ్ నియోజకవర్గ స్వతంత్ర శాసనసభ్యుడు సపం నిషికాంత సింగ్‌ను తిడ్డిమ్ రోడ్‌లోని ఆయన నివాసంలో కలవడానికి వచ్చిన నిరసనకారులు, శాసనసభ్యుడు రాష్ట్రంలో లేరని చెప్పడంతో ఆయనకు చెందిన స్థానిక వార్తాపత్రిక కార్యాలయ భవనాన్ని లక్ష్యంగా దాడి చేసినట్లు ఉన్నతాధికారి ఒకరు వివరించారు.

శవాగారం వద్ద కుకీల ఆందోళన

భద్రతా బలగాలతో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో అనుమానిత కుకీ ఉగ్రవాదుల్లో పది మందిని కాల్చి చంపాయి. అయితే కుకీ తెగకు చెందిన కొంతమంది ఎస్ఎంఎస్‌హెచ్‌ను చుట్టుముట్టారు. సోమవారం నుంచి శవాగారంలో ఉంచిన 10 మృతదేహాల రవాణాను అడ్డుకునేందుకు నిరసన ప్రారంభించారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన 10 మంది కుకీ పురుషులు 'గ్రామ వలంటీర్లు' అని వారు పేర్కొన్నారు. మణిపూర్‌లోని కుకీ ఆధిపత్యం ఉన్న చురచంద్‌పూర్‌కు ఆస్పత్రి నుంచి ఆ మృతదేహాలను తీసుకెళ్లడానికి ప్రయత్నించిన పోలీసులను నిరసనకారులు శనివారం అడ్డుకున్నారు. కుకీలు మృతదేహాలను సిల్చార్‌లో తమకు అప్పగించాలని కోరారు. అక్కడి నుంచి మృతదేహాలను పొరుగున ఉన్న మిజోరాం వైపు తీసుకెళ్లాలని వారు యోచిస్తున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు, పోలీసులు వారిని ఒప్పించే ప్రయత్నంలో ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో లాఠీచార్జికి దారితీసింది. దీంతో అసోం పోలీసులు ఆ ప్రాంతంలో అప్రమత్తమయ్యారు.

రింగ్ రోడ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - హుజూర్ నగర్ : భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హుజూర్ నగర్ పట్టణంలోని రింగ్ రోడ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చన రవి అన్నారు. శనివారం చింతల బజారులో జరుగుతున్న రింగ్ రోడ్డు పనులను పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో రింగ్ రోడ్డు వైపు తొంగి కూడా చూడలేదన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న టీఆర్ఎస్ హుజూర్ నగర్ లో అభివృద్ధి ని మరిచారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలంలోనే నియోజకవర్గంలో కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, కస్తాల శ్రావణ్ కుమార్, ఎడ్ల విజయ్, అమర గాని సతీష్, వీర్లపాటి భాస్కర్, తేజావత్ రవి నాయక్, ఎస్ కే సైదా, పోతన బోయిన రామ్మూర్తి, బెల్లంకొండ వెంకటనారాయణ, దగ్గుపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని పుట్టి ట్రయల్ రన్‌లో కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా కిన్నెరసాని ప్రాజెక్ట్ ను శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కిన్నెరసాని ప్రాజెక్ట్ కుడి కాలువలో పుట్టి ద్వారా పర్యాటకులను ఆకర్షించే విధంగా తానే స్వయంగా ప్రయాణించి ట్రైల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిలో ప్రయాణించడం ద్వారా పర్యాటకులకు మంచి అనుభూతి కలుగుతుందన్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు వీక్షిస్తూ పుట్టిలా ప్రయాణం చేయడం ఎంతో ఆహ్లాదకరంగా ఉందన్నారు. కిన్నెరసాని అందాలు కూడా పర్యాటకులకు మరింత చేరువగా కనిపిస్తాయన్నారు. ఈ సందర్భంగా అధికారులకు, పర్యాటకులకు భద్రత పరంగా పలు జాగ్రత్తలపై సూచనలు చేశారు.

రోడ్డుపై ధాన్యం ఆరపోస్తే చర్యలు తప్పవు: ఎస్ఐ

విశాలాంధ్ర - పినపాక: రైతులు వరి ధాన్యాన్ని రోడ్డుపై ఆరపోస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఈ. బయ్యారం ఎస్ ఐ. రాజ్ కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన పినపాక లో ప్రధాన రహదారిపై ఆరబోసిన ధాన్యాన్ని చూసి ఈ పరిణామంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులెవరు రోడ్డుపై ధాన్యం అరోపోయరాదని దీని వల్ల ప్రమాదాలు కూడా జరుగుతాయన్నారు. ధాన్యం రోడ్డు పై ఆరపోయటం వలన వాహనదారులు ఇబ్బంది ఏర్పడుతున్నట్లు చెప్పారు. రాత్రి సమయాల్లో అయితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ధాన్యాన్ని పంట పొలాల్లో కానీ ఇంటి దగ్గర కానీ ఆరపోసుకోవాలని సూచించారు. మండల రైతులందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో అంతర్భాగం

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్గొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున కళాశాలలో తెలంగాణ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన నల్గొండ జిల్లా సర్వస్వం ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన రాష్ట్ర మీడియా అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడాతూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటైన నవంబర్ 16ను జాతీయ పత్రికా దినోత్సవంగా పరిగణిస్తూ దేశవ్యాప్తంగా పత్రిక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులు, సంస్థలు, ప్రజలకు పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పత్రికా స్వేచ్ఛ అనేది ప్రజాస్వామ్యంలో అంతర్భాగమని, దేశంలో ప్రజాస్వామ్యం పొందుతున్న వారందరికీ, కోరుకుంటున్న వారందరికీ ప్రజాస్వామ్యం ఇంకా ఫరిఢవిల్లాలనుకునే వారందరికీ పత్రికా స్వేచ్ఛ అవసరమన్నారు. పత్రికా స్వేచ్ఛపై అనేక ఆటంకాలు వస్తున్నాయని, దీనిని ఎదిరించి కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. గతంలో అనేక మంది వ్యక్తులు, సంస్థలపై కొన్ని జిల్లాలలో సారస్వాలు వచ్చినప్పటికీ తెలంగాణ సారస్వత పరిషత్తు రూపొందించిన నల్గొండ జిల్లా సారస్వం సమగ్రంగా కూడుకొని ఉందని, తెలంగాణ సారస్వత పరిషత్తు తీసుకువచ్చిన ఈ గ్రంథంలో అన్ని అంశాలను పొందుపరిచారని భావిస్తున్నట్లు తెలిపారు.

అయ్యప్ప మాలధారణ స్వాములకు అన్న ప్రసాద వితరణ

విశాలాంధ్ర - నేరేడు చర్ల : నేరేడుచర్ల మండల పరిధిలోని కల్లూరు గ్రామంలోఎంతో నిష్టతో నియమ నిబం నిబంధనలతో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాలదరించిన స్వాములకు కార్తీక మాసం శనివారం సందర్భంగా హుజూర్నగర్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ సరికొప్పుల నాగేశ్వరరావు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సరికొప్పుల నాగేశ్వరావు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా కార్తీక మాస సమయంలో చతుర్మాస దీక్షలో ఉంటారు. అంజి, కల్లూరు గ్రామంలోని అయ్యప్ప స్వాములు గుడుగుంట్ల బిక్షం, అనంతు నాగరాజు బుడిగే మట్టయ్య, మేకపోతుల గోపి, రమేష్, వీరాస్వామి, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టివేత

ఇల్లందు - విశాలాంధ్ర : ప్రభుత్వం నిషేదించిన గుట్కా ప్యాకెట్లను శనివారం ఇల్లందు పోలీసులు పట్టుకు న్నారు. సీఐ బత్తుల సత్య నారాయణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పట్టణంలోని శ్రీ లక్ష్మీ గణపతి కిరాణం షాపులో గుట్కా అమ్ముతు న్నారని విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేసారు. దింతో సుమారు రూ. 30వేల విలువ చేసే ఆర్.ఆర్ 42 టొబాకో ప్యాకెట్లు,14 హాయ్ టొబాకో ప్యాకెట్లు, 5 అంబర్ ప్యాకెట్లు, 10 విమల్ పాన్ మసాలా ప్యాకెట్లు,110 జెకే టొబాకో ప్యాకెట్లు,10 వీఐపి టొబాకో ప్యాకెట్లు, 9 పాన్ బహార్ గుట్కా బాక్సులు దొరికాయి. వీటిని స్వాధీనం చేసుకొని షాపు యజమాని గుగులోత్ శంకర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచామని సి ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఇల్లందు ఎస్ఐ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్ -3 పరిక్షలకు సర్వం సిద్ధం: కలెక్టర్

విశాలాంధ్ర-జిల్లా బ్యూరో మహబూబాబాద్: జిల్లాలో ఆదివారం జరగబోయే గ్రూప్-3 పరీక్ష మీరు వాహనకు సర్వం సిద్ధంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం ఈ 17,18 న జరిగే గ్రూప్-3, పరిక్ష కేంద్రాల ప్రత్యేక అధికారులు, చీఫ్ సూపెరెండెంట్లు, రూట్ ఆఫీసర్స్, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ సంబంధిత అధికారులతో కలెక్టర్ కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం కేటాయించిన అన్ని పరీక్షా కేంద్రాలను అధికారులు ముందు రోజే చేరుకొని అన్ని సదుపాయాలు ఉన్నాయి లేనిది గమనించి, లేనట్లయితే సంబంధిత అధికారులతో ప్రతిది సమకూర్చుకోవాలని కోరారు. పరిక్ష కేంద్రంలో నిరంతర విద్యుత్, మంచి నీరు, టాయిలెట్స్ సౌకరులు కల్పించాలని, ముఖ్యంగా అంగవైకల్యం ఉన్న అభ్యర్థులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో పరిక్ష రాసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో (21) పరీక్ష కేంద్రాలని, జిల్లావ్యాప్తంగా పరీక్షలకు హాజరుకానున్న (7592) మంది అభ్యర్థులు పాల్గొంటారని తెలిపారు. చీఫ్ సూపర్డెంట్లు (21) రూట్ ఆఫీసర్స్ (6) జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు (24) మంది, ఫ్లయింగ్ స్క్వాడ్స్ (10) ఐడెంటిఫికేషన్ అధికారులు (86) మంది ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి, రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.బలరాం నాయక్, ఆర్డిఓ కృష్ణవేణి, గ్రూప్ 3, ప్రత్యేక అధికారులు, జిల్లా కలెక్టరేట్ సూపర్డెంట్స్ భద్రకాళి, బాలకృష్ణ, టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత చీఫ్ సూపరెండెంట్లు, లోకల్ రూట్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటికల్ అధికారులు పాల్గొననున్నారన్నారు.

గ్రూప్-3 పరీక్షకు భద్రతా ఏర్పాట్లు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : గ్రూప్-3 పరీక్షల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 13,478 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారధ్యంలో ప్రతిష్టమైన బందోబస్తుకు ఏర్పాటు చేసారు. శనివారం పరీక్షా కేంద్రాల వద్ద విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ సమావేశం ఏర్పాటు చేసి బ్రీఫింగ్ చేయడం జరిగింది. ఈనెల 17, 18 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టి జి పి ఎస్ సి) ఆధ్వర్యంలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. కొత్తగూడెంలోని 26, పాల్వంచలోని 13 పరీక్షా కేంద్రాల వద్ద సుమారుగా 350 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భద్రతా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. 17న ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుండి 5.30 గంటలకు పరీక్ష జరగనుంది. సోమవారం 18న కూడా అదే సమయంలో పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు ఉదయం 9.30 గంటలు లోపు, మధ్యాహ్నం అయితే 2.30 గంటల లోపు హాజరుకావాలని ఎస్పీ కోరారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. మాల్ ప్రాక్టీస్ నకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రూప్ -3 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : జిల్లాలో ఈ నెల 17, 18 తేదీలలో జరగనున్న గ్రూప్ 3 పరీక్ష కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో ఫాతిమా కాన్వెంట్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా లతో కలిసి సందర్శించి పరీక్షా కేంద్రంలో గదులు, పరిసరాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్ష కొరకు జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, కాగజ్‌నగర్ పట్టణంలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

గ్రామాలపై దాడులు ఆపాలి

విశాలాంధ్ర - ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం తాను ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా తాత్సారం చేయడం సరికాదని, వెంటనే యిచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేయాలని సీపీఐ (ఎం.ఎల్) మాస్లైన్ (ప్రజాపంథా) డిమాండ్ చేసింది. సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఖమ్మంలో నవంబర్ 14,15,16 తేదీలలో జరిగింది. ఈ సమావేశంలో పలు రాజకీయ అంశాలను పలు సమస్యలను చర్చించింది. భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించారు. పార్టీ తీసుకున్న నిర్ణయాలు చేసిన తీర్మానాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా లగచర్ల తదితర గ్రామాలపై పోలీసుల దాడులు ఆపాలన్నారు. అక్రమ అరెస్టులు ఆపాలి. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. రైతులు తమ భూముల రక్షణ కోసం చేసిన పోరాటాన్ని సీపీఐ (ఎం.ఎల్) మాస్లైన్ బలపరుస్తున్నదన్నారు. సీపీఐ (ఎంఎల్) మాస్లైన్, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఎఐపికెఎస్) ప్రతినిధి బృందాలు మార్కెట్లను సందర్శించి అక్కడి సమస్యలపై ఆందోళనలు నిర్వహిస్తారన్నారు. ఉచిత గ్యాస్, కరెంట్ వినియోగాదారులకు అందరికి అందించాలన్నారు. డిసెంబర్ 4వ తేదీనప డిపోలముందు, హైదరాబాద్లో ధర్నాలు చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కె.జి. రామచందర్, కె.రమ, కెచ్చెల రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, చిన్నచంద్రన్న, గుమ్మడి నర్సయ్య, వి. కృష్ణ వి.ప్రభాకర్, సదానందం, కె.సూర్యం, కృష్ణ, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న వైద్య అధికారులు, సూపర్వైజర్స్, ఆరోగ్య కార్యకర్తలను, జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు ఆదేశించారు. శనివారం జిల్లా వైద్య కార్యాలయం మీటింగ్ హాల్లో, డాక్టర్లకు, సూపర్వైజర్స్, ఆరోగ్య కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోపాల్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించటంలో పర్యవేక్షకుల పాత్ర అతిముఖ్యమైనదని తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనలో పర్యవేక్షకులు సరైన పనితీరును అవలంభించకపోతే శాకాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. అసంక్రమిక వ్యాధుల నియంత్రణ కార్యక్రమం మూడవ ఫేస్ వచ్చే ఫిబ్రవరి మాసం వరకు పూర్తి చేయాలని తెలిపారు. పోగ్రాం ఆఫిసర్స్ పవన్ కుమార్, శ్రీకాంత్, రణధీర్, ఇంచార్జ్ మాస్ మీడియా ఆఫీసర్ సంపత్ ఏ ఎం ఓ దుర్గారావు డిపి హెచ్ఎంఓ శకుంతల డిపిఎం సాంబయ్య సంజీవరావు సత్యనారాయణ సబ్ యూనిట్ ఆఫీసర్స్ వెంకట్ రెడ్డి భూపాల్ రెడ్డి సాంబయ్య నాగేశ్వరరావు, డిస్టిక్ మెడిసిన్ స్టోర్ ఇంచార్జ్ వినోదర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పబ్లిక్ హెల్త్ నర్సులు, మల్టీపర్పస్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్లు, పర్యవేక్షకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

విశాలాంధ్ర - కారేపల్లి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను శనివారం గ్రామాలలో అధికారులు ముమ్మరంగా నిర్వహించారు. ఒక్కొక్క ఎన్యూమునేటర్ 10 కుటుంబాల చొప్పున ఇంటింటికి వెళ్లి వివరాలను నమోదు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా 150 మంది ఉద్యోగ సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు. మండల తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్‌లు సర్వే ప్రక్రియను పర్యవేక్షించారు.

సింగరేణి జీఎంకు సమస్యలపై వినతి

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి ఆస్పత్రితోపాటు కార్మికవాడలకు సంబందించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రతినిధి బృందం ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజుకు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శనివారం జియంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి వంగ వెంకట్, ఏరియా కార్యదర్శి వట్టికొండ మల్లికార్జున్ మాట్లాడారు. కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మెమొరాండం రూపంలో జీఎంకు అందించామన్నారు. ప్రధానంగా రుద్రంపూర్ సింగరేణి ఆస్పత్రిలో వారానికి కనీసం మూడు రోజులు మహిళా నర్సుకు విధులు కేటాయించాలని, రెండో షిఫ్టు, మూడు షిఫ్టులో వైద్యులను, వార్డుబాయిని నియమించాలని కోరారు. కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. రుద్రంపూర్ జయశంకర్ గ్రౌండు, రామవరం సాధన గ్రౌండులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం తోపాటు రామవరం కమ్యూనిటీ హాల్లో ఏసీ సౌకర్యం కల్పించాలని జియం ను కోరినట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి జియం సానుకూలంగా స్పందించారని తెలిపారు. యూనియన్ బృందంలో నాయకులు జె. గట్టయ్య, హుమాయూన్, మల్లయ్య, సౌజన్య, కమల్ తదితరులు వున్నారు.

మిల్లులను వేలం వేయాలి

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబుబాబాద్ : ప్రభుత్వానికి చెందిన వేలాది టన్నుల బియ్యాన్ని కాజేసిన రైస్ మిల్లర్ల యజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టి, ఆస్తులు వేలం వేసి రికవరీ చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లాలోని మండల కేంద్రంలో జరిగిన సిపిఐ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో లేవీ పెట్టడానికి ప్రభుత్వం దాన్యం కొనుగోలు చేసే, రైసు మిల్లులకు అందజేయగా బియ్యాన్ని ప్రభుత్వానికి అందివ్వకుండా మన జిల్లాలో 55 కోట్ల రూపాయల విలువ చేసే వేలాది టన్నుల ధాన్యాన్ని అమ్ముకొని, కోట్లాది రూపాయలు దండుకున్న మిల్లర్లపై తూతూ మంత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా దృష్టి సారించి దోచుకున్న మిల్లర్లపై రెవిన్యూ రికవరీ యాక్ట్ నమోదు చేసి ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, దంతాలపల్లి మండల కార్యదర్శి పోలేపాక వెంకన్న, మరిపెడ మండల బాధ్యులు ఎండి రషీద్, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, కలగూర నాగరాజు, అప్పల వెంకన్న పాల్గొన్నారు.

ఈనెల 18న ప్రజావాణి రద్దు : కలెక్టర్

వనపర్తి : నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్ 3 పరీక్షలు నిర్వహించనున్నందున 18వ తేదీన సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని వనపర్తి జిల్లాలో రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు. అధికారులు అందరూ గ్రూప్ 3 పరీక్షల నిర్వహణలో ఉంటారని అందువల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ రద్దు విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులు తీసుకొని దూర ప్రాంతాలను నుండి వ్యయ ప్రయాసలకు ఓర్చి ఎవరు కలక్టరేట్‌కు రావద్దని సూచించారు.

17న జీ తెలుగులో ఆయ్

విశాలాంధ్ర - ఆదిలాబాద్: టాలీవుడ్ యంగ్ హీరో నార్నె నితిన్ ప్రధాన పాత్రలో నటించిన ఆయ్ సినిమాని ఈ వారం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందించేందుకు సిద్ధమైందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. థియేటర్లో సూపర్‌హిట్‌గా నిలిచిన ఈ సినిమా బుల్లితెర ప్రేక్షకులను అలరించేందకు వచ్చేస్తోందన్నారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఆయ్ నవంబర్ 17న మధ్యాహ్నం 3 గంటలకు జీ తెలుగులో మాత్రమే ప్రసారమవుతుందన్నారు. ఈ సినిమా కథ గోదావరి నదిలోని పసలపుడిలంక నేపథ్యంలో సాగుతుందన్నారు. కార్తీక్ (నార్నే నితిన్), సుబ్బు (కసిరెడ్డి రాజ్‌కుమార్), హరి (అంకిత్ కొయ్య) చిన్నపటి నుంచి మంచి స్నేహితులు. వర్క్ ఫ్రమ్ హోం కోసం ఊరికి వచ్చిన కార్తీక్ పల్లవి(నయని సారిక) అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. ఆమె కూడా అతడిని ఇష్ట పడుతుంది. అదే అమ్మాయిని సుబ్బు కూడా ప్రేమిస్తాడు. మరి పల్లవి ఎవరిని ప్రేమిస్తుంది? వారికి ఎదురైన అడ్డంకులను ఎలా పరిష్కరించారు? అనేది తెలియాలంటే జీ తెలుగులో ఈ ఆదివారం ప్రసారమయ్యే ఆయ్ సినిమా చూడాల్సిందే అన్నారు. అంజి కె మణిపుత్ర దర్శకత్వంలో రూపొందిన ఆయ్ సినిమా రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రిలీజై ప్రేక్షకులను బాగా ఆకట్టుకుందన్నారు.

నవజాత శిశువుకు విజయవంతంగా చికిత్స

హైదరాబాద్: ఇది అత్యంత కష్టమైన పని. ఎందుకంటే, నెలలు నిండకుండానే బిడ్డ జన్మించింది. ఆ బిడ్డకు వైద్యం చేయాలంటే ఎంతో నైపుణ్యం కావాలి. అందుకే, టెన్షన్ కు ఫుల్‌స్టాప్ పడింది. వైద్యుల కృషి ఫలించింది. కేవలం 28 వారాలలో జన్మించిన, 760 గ్రాముల బరువు గల శిశువుకు కొత్త జీవితాన్ని ఇచ్చారు. ప్రాణాపాయ పరిస్థితులను అధిగమించేలా చేశారు. ఆరోగ్యంగా బిడ్డను డిశ్చార్జ్ కూడా చేశారు. ఇది అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ అధునాతన సాంకేతికత, నియోనాటల్ ఐసీయూ కేర్ నైపుణ్యం, వైద్యుల కృషికి నిలువుటద్దంగా నిలిచింది. 2024, ఆగస్టు 31వ తేదీన యూసుఫ్ గూడకు చెందిన రాజమోహన్ రెడ్డి, కవిత దంపతుల బిడ్డను అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్, జూబ్లీహిల్స్‌కు 24×7 అత్యవసర సర్వీస్ ద్వారా తరలించారు. ఈ చికిత్సకు రెండు నెలలు పట్టింది. నియోనాటల్ ఐసీయూ (ఎన్ఐసీయూ)లో సంరక్షణ పొందిన శిశువును 1.56 కిలోల బరువుతో ఆరోగ్యవంతమైన స్థితిలో డిశ్చార్జ్ చేశారు. ఈ విజయానికి అపోలో క్రెడిల్ పీడియాట్రిక్ సర్జరీ టీమ్, డాక్టర్ లలతేందు కుమార్ ఆధ్వర్యంలో పని చేసిన వైద్య బృందం, అనస్థటిస్ట్ డాక్టర్ విశ్వనాథ్, ఎన్ఐసీయూ నిపుణుడు డాక్టర్ కృష్ణ స్వరూప్ రెడ్డి, డాక్టర్ కే రాజ సుబ్బారెడ్డి, డాక్టర్ పీ శివకుమార్ రెడ్డి, నర్సింగ్, పారామెడికల్ బృందం సమన్వయంతోనే ఇది సాధ్యమైంది.

శంషాబాద్‌లో వైష్ణోయ్ సౌత్‌వుడ్స్ ఆవిష్కరణ

హైదరాబాద్: శంషాబాద్‌లోని మామిడిపల్లిలో ప్రత్యేక విల్లా కమ్యూనిటీ వైష్ణోయ్ సౌత్‌వుడ్స్‌ను ప్రారంభించినట్లు వైష్ణోయ్ గ్రూప్ సగర్వంగా ప్రకటించింది. ఈ గ్రాండ్ ఈవెంట్ 1,000 మందికి పైగా సందర్శకులను ఆకర్షించింది. మొదటి రోజులోనే 50 కంటే ఎక్కువ బుకింగ్‌లు వచ్చాయి. ఇది ప్రాజెక్ట్ ఆకర్షణకు, వైష్ణోయ్ గ్రూప్ తిరుగులేని వారసత్వానికి బలమైన సాక్ష్యంగా నిలిచింది. వైష్ణోయ్ సౌత్‌వుడ్స్ ప్రారంభించిన సందర్భంగా, వైష్ణోయ్ గ్రూప్ వ్యవస్థాపకులు, సీఎండీ యెలిశాల రవి ప్రసాద్ మాట్లాడుతూ, మా విజన్ ఆఫ్ 'స్పెక్టాక్యులర్' లివింగ్-విశాలమైన ప్రదేశాలతో ఉత్కంఠభరిత సౌందర్యాన్ని మిళితం చేయడం-అనేది దక్షిణ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ల్యాండ్‌స్కేప్‌ను మార్చడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. మార్గదర్శక స్ఫూర్తితో ఇళ్లను సృష్టించడం, కమ్యూనిటీలను పెంపొందించడంలో తిరుగులేని నిబద్ధతతోమేం నాణ్యత, విశ్వాసం కోసం కొత్త ప్రమాణాలను ఏర్పరుస్తూనే ఉన్నాం" అని అన్నారు.

టాటా మోటార్స్, మెజెంటా మొబిలిటీ నేతృత్వంలో ఏస్ ఈవీ

హైదరాబాద్: సమర్థవంతమైన, సరసమైన, సుస్థిరమైన పరిష్కారాల కోసం పెరుగుతున్న డిమాండ్‌తో భారత చివరి-మైలు లాజిస్టిక్స్ రంగం వేగవంతమైన పరివర్తనను ఎదుర్కొంటోంది. ఈ పరిణామానికి నాయకత్వం వహిస్తున్నది మెజెంటా మొబిలిటీ, ఒక ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఏస్ ఈవీని ఉపయోగించడం ద్వారా లాజిస్టిక్స్ పరిశ్రమలో ప్రధాన శక్తిగా మారింది, ఇది భారతదేశపు అత్యంత అత్యాధునిక, నాలుగు-చక్రాల, జీరో-ఎమిషన్ కాంపాక్ట్ వాణిజ్య వాహనం, ఇది తక్కువ మొత్తం యాజమాన్యం (టీసీఓ), బలమైన సంపాదన సామర్థ్యాన్ని కలిగి ఉంది. వారి విమానాలకు ఏస్ ఈవీని జోడించడంతో, మెజెంటా మొబిలిటీ చివరి-మైలు డెలివరీలలో విప్లవాత్మక మార్పులను సృష్టిస్తోంది. గతంలో ఎన్నడూ లేని స్థిరత్వం, కార్యాచరణ సామర్థ్యాన్ని పొందుతోంది. టాటా ఏస్ ఈవీ అధిక పనితీరు, విశ్వసనీయతను కొనసాగిస్తూ, తక్కువ కార్బన్ విస్తరణతో దాని కార్యకలాపాలను అమలు చేయడానికి మెజెంటా మొబిలిటీకి తోడ్పడుతుంది. వివిధ మార్గాల్లో స్థిరమైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న, సకాలంలో డెలివరీలను అందించే చివరి-మైలు లాజిస్టిక్స్ సెక్టార్ డిమాండ్‌లను నిర్వహించడానికి ఏస్ ఈవీ అనువైనదని మెజెంటా మొబిలిటీ వ్యవస్థాపకుడు, సీఈవో మాక్సన్ లూయిస్ తెలిపారు.

హిందూస్థాన్ టైమ్స్ శతాబ్ది ఉత్సవ స్మారక పోస్టల్ స్టాంప్ విడుదల

న్యూఢిల్లీ: హిందూస్థాన్ టైమ్స్ శతవార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం న్యూఢిల్లీలో స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేయడం ఒక చారిత్రాత్మక విజయం. ఈ సంస్థలో భాగమైన ప్రతి ఒక్కరినీ నేను అభినందిస్తున్నాను, కష్టాలను ఎదుర్కొని పోరాడారు, కానీ స్థిరంగా ఉన్నారని అన్నారు. మీడియా లిమిటెడ్ చైర్‌పర్సన్ మరియు హిందుస్థాన్ టైమ్స్ ఎడిటోరియల్ డైరెక్టర్ శోభనా భారతియా మాట్లాడుతూ, "స్మారక తపాలా స్టాంపును విడుదల చేసినందుకు నేను ప్రధానమంత్రికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది మా సుదీర్ఘ ప్రయాణంలో ఒక మైలురాయి, మా లక్ష్యం ముగిసిపోలేదని మాకు తెలుసు." అని అన్నారు. హెచ్‌టీని 1924 సెప్టెంబర్ 15న మహాత్మా గాంధీ ప్రారంభించారు. దినపత్రిక స్వాతంత్ర్య ఉద్యమానికి గొంతుకగా పనిచేసింది.

ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్

ముంబయి: ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన ఉద్యోగులలో అప్రమత్తంగా ఉండటం, నైతిక బ్యాంకింగ్ పద్ధతులను పెంపొందించడం ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి నవంబర్ 11 నుండి నవంబర్ 16, 2024 వరకు 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్'ని పాటిస్తుంది. ఈ సంవత్సరం బ్యాంక్ ఉద్యోగుల ప్రచారం 'ఒకరికొకరు జాగ్రత్తగా ఉండండి' అనే నినాదంతో పరస్పర అప్రమత్తత ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది, ఇది భారత ప్రభుత్వ థీమ్: 'దేశ శ్రేయస్సు కోసం సమగ్రత సంస్కృతి'కి అనుగుణంగా ఉంది. ముఖ్య అతిథి - డా. సలీమ్ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్-సీఐడీ), కర్నాటక ప్రభుత్వం లాంఛనప్రాయమైన ఉత్సవ దీప ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన కీలకోపన్యాసం చేశారు. వ్యక్తిగత సమగ్రత, సంస్థాగత సమగ్రత మధ్య ఉన్న క్లిష్టమైన సంబంధాన్ని డాక్టర్ సలీమ్ హైలైట్ చేశారు, కస్టమర్ ఫండ్‌లను నిర్వహించడంలో బ్యాంకు సిబ్బంది చాలా శ్రద్ధ వహించాలని, మోసపూరిత కార్యకలాపాలలో సిబ్బంది ప్రమేయం ఉన్నట్లయితే బ్యాంకుకు ఆర్థిక బాధ్యతలు విపరీతంగా పెరుగుతాయని హెచ్చరించారు.

నిజామాబాద్‌లో యూటీఐ మ్యుచువల్ ఫండ్ కొత్త ఫైనాన్షియల్ సెంటర్

హైదరాబాద్: భారతదేశంలోని అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజాల్లో ఒకటైన యూటీఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (యూటీఐ ఏఎంసీ) తెలంగాణలోని నిజామాబాద్‌లో తమ కొత్త యూఎఫ్‌సీని ప్రారంభించినట్లు తెలిపింది. దీని చిరునామా, డోర్‌నెం. 5-6-430, వార్డ్ 5, బ్లాక్ 6, షాప్ ఏ, గింజా వ్యూ, మొదటి అంతస్తు, బ్యాంక్ ఆఫ్ బరోడా బిల్డింగ్, ఎల్లమ్మగుట్ట, హైదరాబాద్ రోడ్, నిజామాబాద్, తెలంగాణ-503 003. నవంబర్ 18న తూర్పు, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో 19 కొత్త యూటీఐ ఫైనాన్షియల్ సెంటర్లను (యూఎఫ్‌సీ) ఏర్పాటు చేసినట్లు కంపెనీ ప్రకటించింది. ఆర్థిక సమ్మిళితత్వాన్ని పెంపొందింప చేసేందుకు, బీ30 నగరాలు, అలాగే వాటికన్నా చిన్న ప్రాంతాల్లోని ఇన్వెస్టర్లను కూడా మ్యుచువల్ ఫండ్ పెట్టుబడుల ద్వారా ఆర్థిక వ్యవస్థ ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చే దిశగా, దేశవ్యాప్తంగా తన కార్యకలాపాలను విస్తరించాలని యూటీఐ లక్ష్యంగా నిర్దేశించుకుంది. మ్యుచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై అవగాహన పెంచడం, వాటిని అందరికీ అందుబాటులోకి తేవడమనే దీర్ఘకాలిక లక్ష్యానికి అనుగుణంగా కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు సంస్థ ఎండీ, సీఈవో ఇంతయాజుర్ రెహ్మాన్ తెలిపారు.

సూపర్ ఫుడ్ 'సబల' మిల్లెట్స్ కొత్త ఆవిష్కరణ

హైదరాబాద్: రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు 88వ జయంతి సందర్భంగా, రామోజీ గ్రూపు భారతదేశపు 'సూపర్ ఫుడ్' అయిన సబల మిల్లెట్స్ (తృణధాన్యాలు) ఆహార ఉత్పత్తులను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా సబల మిల్లెట్స్ డైరెక్టర్ సహరి చెరుకూరి మాట్లాడుతూ, తృణ ధాన్యాల్లోని సంపూర్ణతను, ఆరోగ్యకరమైన జీవనానికి హామీ ఇస్తుంది. సంప్రదాయ భారతీయ ఆహార పదార్థాలు, ఆధునిక వంటల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించటానికి విస్తృతమైన పరిశోధనల ద్వారా రూపొందించిన సమతుల్య ఆహారం ఇది. మంచి రుచితో నాణ్యమైన పోషక పదార్థాలను ఆవిష్కరించాలనే మా దృఢ సంకల్పాన్ని ఇది నిదర్శనం. రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు రామోజీ రావు 88వ జయంతి సందర్భంగా ఈ మిల్లెట్ శ్రేణి ఆహార ఉత్పత్తులను తీసుకురావడాన్ని ఎంతో గౌరవప్రదమైన విషయంగా భావిస్తున్నామని తెలిపారు.

టీచ్ ఫర్ ఇండియా ఆర్ట్స్ ఫెలోషిప్ ప్రారంభం

హైదరాబాద్: లాభాపేక్ష లేని ఛాంపియన్ ఎడ్యుకేషనల్ ఈక్విటీ టీచ్ ఫర్ ఇండియా నేడు తన 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, మ్యూజికల్ 'విత్ లవ్' పేరిట నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలో భారతదేశంలో ఆర్ట్స్ ఫెలోషిప్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. టీచ్ ఫర్ ఇండియా ఇప్పటికే అందిస్తున్న రెండేళ్ల ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు ఇది రెండవ అదనం. ఈ కొత్త ప్రోగ్రామ్‌తో టీచ్ ఫర్ ఇండియా ఇప్పుడు విద్యార్థులు అద్భుతమైన విద్యను పొందేందుకు మరింత సహాయం చేస్తూ, సభ్యులకు నాయకత్వ అభివృద్ధి అవకాశాలను అందిస్తుంది. కోర్సులో చేరాలని కోరుకునే వారు ఫుల్-టైమ్ పెయిడ్ ఆర్ట్స్ ఫెలోషిప్‌కు 6 జనవరి 2025 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ వినూత్న కార్యక్రమం భారతదేశంలోని వెనుకబడిన పాఠశాలల్లో విద్యార్థుల గళాన్ని, భావవ్యక్తీకరణ, అనుసంధానాన్ని పెంపొందించే అధిక-నాణ్యతతో కూడిన కళల బోధనను అందించడం ద్వారా విద్యా అసమానత అంతరాన్ని తగ్గించడానికి సభ్యులకు శక్తినిస్తుంది.

సంపాదకీయం

మహాయుతిలో యోగీ కుంపటి

మహారాష్ట్ర శాసనసభకు పోలింగ్ వచ్చే బుధవారం జరగనుంది. ఎన్నికల విశ్లేషకుల జోస్యాలు ఎలా ఉన్నప్పటికీ మహారాష్ట్రలో గాలి మార్పు కనిపిస్తున్నప్పటికీ కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన, శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీతో కూడిన మహావికాస్ అగాఢీ కచ్చితంగా విజయం సాధిస్తుందని చెప్పడం తొందరపాటు కావొచ్చు. ఇటీవలి హర్యానా ఎన్నికల ఫలితాలను చూసిన తరవాత పరిస్థితి ఎప్పుడు ఎలా మారుతోందో చెప్పడం కేవలం అంచనాలకే పరిమితమైపోతోంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మీద అనుమానాలు ఇప్పటి దాకా సంపూర్ణంగా నివృతి కానే లేదు. బీజేపీ, షిండే నాయకత్వంలోని శివసేన చీలిక వర్గం, అజిత్ పవార్ నేతృత్వంలోని చీలిన ఎన్.సి.పి. వర్గం అధ్వర్యంలో నడుస్తున్న మహాయుతి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అపజయం తప్పకపోవచ్చునన్న మాట వినిపిస్తూనే ఉంది. దీనికి కారణం ప్రతిపక్షాల మహావికాస్ అగాఢీ పుంజుకోవడం ఒక్కటే కారణం కాకపోవచ్చు. ఆరేడు నెలల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికలలో మహావికాస్ అగాఢీ మంచి ఫలితాలు సాధించినప్పటికీ శాసనసభ ఎన్నికలలోనూ అదే పరిస్థితి ఉంటుందని ఖాయంగా చెప్పలేం. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలను కాస్త ఆలస్యంగా నిర్వహించడానికి కారణాలు గత రెండు మూడు నెలల్లో మోదీ పనుపున మహాయుతి ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాల వల్ల వెల్లడైనాయి. రూ. 90 వేల కోట్లు ఖర్చయ్యే సంక్షేమ పథకాలు ప్రకటించారు. కానీ అవన్నీ ముఖ్యమంత్రి షిండే చలవేనని జనాభిప్రాయం. అందువల్ల ఆయన పార్టీకి కొంత మేలు జరుగుతుందేమో! హడావుడిగా జనం బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రాక ముందే మోదీ ప్రోద్బలంతో ఇలాంటి పథకాలు ప్రకటించేశారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరిపించడానికి తాత్సారం చేయడానికి అసలు కారణం ఇదే, ఇలాంటి కట్టుదిట్టాలు ఎన్ని చేసినప్పటికీ శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్.సి.పి.ని చీల్చి దాదాపు 40 మంది శాసన సభ్యులని తీసుకెళ్లి బీజేపీతో కత్తు కలిపిన ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ కే గెలుస్తామన్న నమ్మకం ఉన్నట్లు కనిపించడం లేదు. 2019లో బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా, తాను ఉపముఖ్యమంత్రిగా తెల్లవారుఝాముననే హడావుడిగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం అంతే వేగంగా కుప్పకూలి పోయింది. తెల్లవారుఝామున ప్రమాణస్వీకారం జరగడానికి ముందు జరిగిన అగ్ర నేతల సమావేశానికి మోదీ మిత్రుడు, ప్రసిద్ధ వ్యాపారవేత్త గౌతం అదానీ కూడా హాజరయ్యారని అజిత్ పవార్ స్వయంగా చెప్పడం చూస్తే ఆయనకే మహాయుతి ప్రభుత్వం విజయంపై విశ్వాసం లేదని రుజువైంది. రైతుల సమస్యలు, సోయాబీన్ ధరల అంశం, రైతుల ఆత్మహత్యల విషయం, అధికధరలు లాంటివి ఓటర్ల మదిలో ప్రధాన అంశాలు అవుతాయో కావో చూడాల్సిందే. లేదా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్య నాథ్ "బటేంగేతో కటేంగే" (విడిపోతే పడిపోతాం" అన్న నినాదం జన సమీకరణకు ఏమేరకు తోడ్పడుతుందో లేదో తెలియదు. ఈ నినాదం సృష్టించనున్న కల్లోలాన్ని గ్రహించినందువల్లే మోదీ "సాథ్ హైతో సేఫ్ హై" "కలిసి ఉంటే పదిలంగా ఉంటాం" లాంటి సానుకూలమైన మాటల్లో మరో నినాదం ఇచ్చారు. మతప్రాతిపదికన జనసమీకరణ ఎలాంటి ఫలితాలిస్తుందో కూడా తెలియదు. మహాయుతి కూటమిలో ఎన్నికల సమయంలో ఉండవలసిన ఐక్యతకు బదులు విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వీటిని ఓటర్లు ఎలా అర్థం చేసుకుంటారు అన్నది కూడా పెద్ద ప్రశ్నే. అదానీ తమ సమావేశంలో పాల్గొన్నాడని అజిత్ పవార్ చెప్పిన మాటలను ఎవరి మానాన వారు ఖండిస్తున్నారు. శరద్ పవార్ ఒక వేపు, దేవేంద్ర ఫడ్నవీస్ మరో వేపు సంజాయిషీ ఇచ్చుకున్నారు. అజిత్ పవార్ చెప్తున్న మాటలు బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్‌కు మింగుడు పడ్తున్నట్టు లేదు. అజిత్ పవార్ దశాబ్దాలుగా హిందువులకు విరోధిగా ఉన్నారని, ఆయన సెక్యులర్ వాది అని, తాము సెక్యులర్ వాదులమని చెప్పుకునే వారు నిజానికి సెక్యులర్ వాదులు కారనీ వారంతా హిందూ విరోధులేనని ఫడ్నవీస్ అన్న మాటల అంతరార్థాన్నిబట్టి మహాయుతిలో చీలికల తీరు బయట పడ్తోంది. ఒకప్పుడు బీజేపీ అగ్ర నాయకుడు లాల్ కృష్ణ అద్వాణీ సెక్యులర్ వాదులను "సిక్యులర్" (రుజాగ్రస్థ) వాదులు అన్నట్టుగానే ఫడ్నవీస్ కూడా మాట్లాడుతున్నారు. పంకజా ముండే, అశోక్ చౌహాన్ మాత్రం యోగీ ఆదిత్యనాథ్ "బటేంగేతో కటేంగే" నినాదాన్ని తీవ్రంగా విమర్శించారు. వీరూ బీజేపీ తానులోని వారేనని గుర్తు పెట్టుకుంటే విభేదాలు బహిరంగమే అని రుజువు అంతోంది. మహారాష్ట్రలో తాము ఆదిత్యనాథ్ నినాదాన్ని సహించబోమని పంకజా ముండే స్పష్టంగానే చెప్పేశారు. ఆదిత్యనాథ్ రాజకీయాలు వేరు అని కూడా అన్నారు. గతంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండి బీజేపీ తీర్థం పుచ్చుకున్న అశోక్ చౌహాన్ సైతం యోగీ నినాదాన్ని జనం సమర్థించరని తేల్చేశారు. ఈ సారి మహారాష్ట్ర ఎన్నికలలో స్థానిక సమస్యలే ప్రధానం అయిపోయినట్టు కనిపిస్తోంది. ఇది ప్రతిపక్ష మహావికాస్ అగాఢీకి, అధికార పక్ష మహాయుతికి కూడా సమస్యగా మారుతున్నట్టుంది. మహాయుతి రాజకీయాలను సమర్థించే వారు అజిత్ పవార్ ఓటు బ్యాంకు వేరు, దేవేంద్ర ఫడ్నవీస్ ఓటు బ్యాంకు వేరు అంటున్నారు. గమనించవలసిన మరో అంశం ఏమిటంటే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రచార బాధ్యతను దేవేంద్ర ఫడ్నవీస్ మీద వదిలేయకుండా సొంతంగా రంగంలోకి దిగారంటేనే బీజేపీని ఏమూలో ఓటమి భయం ఆవహించిందనుకోవాలి. అజిత్ పవార్‌ను మహాయుతిలోకి తీసుకొచ్చిందే ఫడ్నవీస్ కనక ఆయన అజిత్‌ను ఎలా వ్యతిరేకిస్తారు అనే వారూ ఉన్నారు. నిజానికి ఏకనాథ్ షిండే బీజేపీ కూర్చిన కూటమిలో ఉంటారని కూడా అజిత్ పవార్‌కు తెలియదనే వారూ ఉన్నారు. ఏమైతేనేం మహారాష్ట్రలోని రెండు ప్రధాన పార్టీలను చీల్చాలన్న బీజేపీ లక్ష్యం మాత్రం సఫలమైంది. అయితే బీజేపీ నేతలు ఎప్పుడూ భిన్న శ్రుతిలోనే మాట్లాడుతారు. వాజపేయి, అద్వాణీ నాయకత్వంలోనూ ఒకరు మృదువుగా మాట్లాడితే మరొకరు ఘాటుగా మాట్లాడేవారు. ఇంకో ముఖ్యమైన అంశం ఏమిటంటే అధికార, ప్రతిపక్ష కూటముల తరఫున అనేకమంది తిరుగుబాటు అభ్యర్థులు రంగంలో ఉన్నారు. వీరి ప్రభావం ఎలా ఉంటుందో ఊహాతీతం. ఇది రెండు పక్షాల నేతలకూ అంతుపడ్తున్నట్టు లేదు. మహారాష్ట్ర ఎన్నికలలో ఆర్.ఎస్.ఎస్. కూడా చురుకుగా పని చేస్తోంది. సంఘ్‌ను సంతృప్తి పరచడానికి కూడా ఫడ్నవీస్ ఘాటుగా మాట్లాడుతూ ఉండవచ్చు. సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనం ఏక్ నాథ్ షిండేకు మాత్రమే దక్కుతుందనే వారూ కనిపిస్తున్నారు. బీజేపీకి ఉండవలసిన పునాది ఎటూ ఉంది. ఈ నేపథ్యంలో అజిత్ పవార్ పరిస్థితే గందరగోళంగా ఉంది. అజిత్ పవార్ అదానీ ప్రస్తావన తీసుకురావడం ఆయన భవిష్యత్ రాజకీయ వ్యూహాల్లో మార్పుకూ సంకేతం కావచ్చు.

రాజకీయ నాయకత్వంలో తగ్గిన మహిళలు

ప్రపంచంలో కేవలం 27 దేశాల్లో మాత్రమే మహిళలు రాజకీయాల్లో నాయకత్వం వహిస్తున్నారనేది కీలకం. రాజకీయాల్లో మహిళల అభ్యున్నతి 18 దేశాల్లో స్వల్పంగా మెరుగుపడింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ మంత్రిత్వ శాఖలకు నాయకత్వం వహిస్తున్న కేబినెట్ సభ్యులలో మహిళలు 23.3 శాతం మాత్రమే ఉన్నారు. ఇది 2023లో నమోదైన సంఖ్య కంటే 0.5 శాతం కంటే తక్కువ పెరుగుదలను నమోదుచేసింది. కేవలం 15 దేశాల్లో మహిళలు, పురుషులు సమానమైన కేబినెట్ హోదాను కలిగి ఉన్నాయి. 141 దేశాలలో, కేబినెట్ మంత్రి పదవులలో మూడింట ఒక వంతు కంటే తక్కువ సంఖ్యలో మహిళలు ఉన్నారు.

ఏడు దేశాల కేబినెట్‌లో మహిళలకు అసలు ప్రాతినిధ్యం లేదు. ప్రపంచవ్యాప్తంగా, ఆయా దేశాల పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం 27 శాతం కాగా దీన్నిబట్టి చూస్తే మరో 39

సంవత్సరాల వరకు మహిళలు రాజకీయాల్లో సమానత్వం సాధించలేరనేది సుస్పష్టం. ఈ సంవత్సరం జరిగిన స్థానిక సంస్థల్లో ఎన్నికైన సభ్యులలో 35.5 శాతం మంది మహిళలు తమ ఉనికిని చాటుకున్నారు. ఇది ఎన్నికల సంవత్సరం. ఈ ఏడాది ప్రపంచంలోని కొన్ని ప్రముఖ దేశాలు - భారతదేశం, అమెరికా, ఇండోనేషియా, బ్రిటన్., దక్షిణాఫ్రికా, రష్యా, ఇరాన్ వంటి దేశాలతో సహా ఎక్కువ దేశాల్లో ఎన్నికలు జరిగాయి.

ప్రపంచంలో 107 దేశాల్లో మహిళలకు రాజకీయాల్లో ప్రమేయంలేదు. ఈ ఏడాది జరిగిన ఎన్నికలలో మహిళలు జాతీయ పార్లమెంటులలో 27శాతం సీట్లు, స్థానిక ప్రభుత్వాలలో 35.5 శాతం సీట్లు సంపాదించగలిగారు. శాంతి, భద్రత, అభివృద్ధి, మానవ హక్కులు, ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులు ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా మహిళలు తీవ్ర వివక్షతకు లోనవుతున్నారు. ఈ సంవత్సరం కనీసం 63 దేశాలు అధ్యక్ష, పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహిస్తున్నాయి. 2024లో 1.6 బిలియన్ల మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలకు వెళ్లే దేశాలు పార్లమెంట్‌లో మహిళల భాగస్వామ్య పరంగా అత్యల్పంగా ఉన్నాయి. మెక్సికో, రువాండా మాత్రమే మహిళలు, పురుషులకు 50/50 ప్రాతినిధ్యం ఉన్న రెండు దేశాలు. జనవరి 2024 నాటికి - ఆస్ట్రియా, బెలారస్, బెల్జియం, మొజాంబిక్, నమీబియా, ఉత్తర మాసిడోనియా, దక్షిణాఫ్రికా ఏడు దేశాలు మాత్రమే 40 నుండి 49.9 శాతం మహిళలు రాజకీయ భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇరాన్, కిరిబాటి, మాల్దీవులు, పలావ్, సోలమన్ దీవులు, తువాలు ఈ ఆరు దేశాల్లో మహిళల ప్రాతినిధ్యం 5 నుంచి 8శాతం ఉంది. రాజకీయ భాగస్వామ్యానికి మహిళల హక్కులు దశాబ్దాలుగా అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా పునరుద్ఘాటిస్తున్నప్పటికీ అమలు చేయడంలో మహిళల రాజకీయ నాయకత్వానికి అడ్డంకులు ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్నాయి.

మహిళలపై హానికరమైన నిబంధనలు, లింగ-ఆధారిత హింస మహిళల రాజకీయ హక్కులకు ఆటంకం కలిగిస్తున్నాయి. ప్రజా జీవితంలో మహిళలపై హత్య, అత్యాచారం, శారీరక హింస వంటి సంఘటనలు మహిళలను రాజకీయాల్లో రాణించేందుకు అవరోధంగా మారాయి. ప్రజాస్వామ్య విధానాలకు మహిళల రాజకీయ భాగస్వామ్యం అత్యంత కీలకం. సమర్థవంతమైన పాలనను రూపొందించడంలో మహిళల పాత్ర కీలకమైనదే. విధాన రూపకల్పనలో ఎక్కువ మంది మహిళలు ఉండటం, కుటుంబ ఆరోగ్యం, విద్య, పిల్లల సంరక్షణ, మౌలిక సదుపాయాలు, మహిళలపై హింసను అరికట్టడం వంటి కీలకమైన అంశాలపై చట్టాల్ని ముందుకు తీసుకురావడానికి మహిళలు ప్రాతినిధ్యం వహించవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా బాలబాలికలు, యువతకు ఉన్నత విద్య, వృత్తి అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యానికి అనువైన పరిస్థితులు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలదే.

ఎడిట్ పేజి డెస్క్

సామాన్యులపై రూపాయి పతనం ప్రభావం

ఎం మురళీకృష్ణ

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజు రోజుకు అగాథంలోకి పడిపోతున్నది. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోల్చితే రూ.84 దాటేసి రూ.84.48కి చేరువలో పతనమవుతున్నది. కాలం ప్రతి 24 గంటలు దాటి 25వ గంటలోకి ప్రవేశించే సరికి... రూపాయి విలువ కొత్త అంకెల్లో కనిపిస్తోంది. రూపాయి విలువ ఈ సంవత్సరం ఇప్పటివరకు దాదాపు 1.4 శాతం క్షీణించింది. శుక్రవారం గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 84.48 వద్ద మరో రికార్డు కనిష్టాన్ని తాకింది. రూపాయి విలువ పడిపోయిన ప్రతిసారి మన జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ విషయాన్ని దేశ ప్రజల్లో చాలా మంది ముఖ్యంగా సామాన్య ప్రజలు పెద్దగా పట్టించుకోరు. కానీ, రూపాయి విలువ పతనం ప్రభావం వారిపై కచ్చితంగా ఉంటుందనేది తెలుసుకోవాలి. రూపాయి విలువ పడిపోతే ఏ విధంగా ప్రభావం చూపుతుందో ప్రతి ఒక్కరూ కచ్చితంగా తెలుసుకోవాలి.

1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు డాలర్‌తో రూపాయి మారకపు విలువ మూడు రూపాయల 30 పైసలు. 1948లో మూడున్నర రూపాయలుగా ఉన్న మారకపు విలువ ప్రస్తుతం దాదాపు 85 రూపాయలకు చేరింది. ముఖ్యంగా, ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత భారత రూపాయి విలువ పడుతూ లేస్తూ అన్నట్లుగానే సాగుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి ఇప్పటి వరకూ అంటే ఈ 77 ఏళ్లలో రూపాయి విలువ 81.18 రూపాయలు పడిపోయింది. రూపాయి విలువ పడిపోవడం అంటే మన జేబులో, బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదు విలువ తగ్గిపోవడం లాంటిదే. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు పదేళ్ల కిందట డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.65 వద్ద ఉంది. అప్పుడు అమెరికా నుంచి భారత్‌కు లక్ష డాలర్లు పంపిస్తే అది రూ.65 లక్షలు అయ్యేది. కానీ, ఇప్పుడు రూ.84.48 లక్షలు అవుతోంది. అంటే పదేళ్లలో రూ.19.48 లక్షలు పెరిగింది. రూపాయి పతనం భారతీయుల జీవితాలపై పెద్ద ప్రభావమే చూపిస్తుంది. నిత్యావసరాల రేట్లు పెరిగిపోతున్నాయి. పెట్రోల్, డీజిల్, ఔషధాలు, బంగారం, ప్లాస్టిక్, కెమికల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు ఇలా అన్నింటి రేట్లు పెరిగేందుకు రూపాయి బలహీనతతో ప్రత్యక్ష సంబంధమే ఉంది. రూపాయితో పోలిస్తే అమెరికా డాలర్ విలువ గణనీయంగా పెరగడంతో మన దేశ విద్యార్థులకు విదేశీ చదువు కూడా తీవ్ర భారంగా మారింది.

ఉన్నత విద్య కోసం మన దేశం నుంచి అత్యధికులు అమెరికాకే వెళతారు. డాలర్ విలువ విపరీతంగా పెరగడంతో కాలేజీ ఖర్చుల కోసం రూపాయలలో చాలా ఎక్కువగా చెల్లించాల్సివస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వేగంగా వృద్ధి నమోదు చేస్తున్న దేశాల సరసన భారత్ నిలుస్తున్నప్పటికీ రూపాయి విలువ ఎందుకు పడిపోతోందన్నది ఎవరికీ అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోతోంది. 2014లో బీజేపీ అధికారంలోకి రాకముందు డాలర్‌తో రూపాయి విలువ 68కి పడిపోతే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. రూపాయి ఐసీయూలో పడిపోయిందనీ, తాము అధికారంలోకి వస్తే దేశీయ కరెన్సీని ప్రపంచ మార్కెట్‌లో నిలదొక్కుకునేలా చేస్తామని అనేక డాంబికాలు పలికారు. అయితే, అధికారంలోకి వచ్చాక అందుకు అనుగుణంగా తీసుకున్న చర్యలు మృగ్యం. ప్రస్తుతం అంతకంటే దారుణమైన స్థితిలోకి రూపాయి విలువ పడిపోతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కట్టడి చర్యలు శూన్యం. దేశీయ గణంకాలు బలహీనంగా చోటు చేసుకోవడానికి తోడు అంతర్జాతీయంగా డాలర్ విలువ పెరగడం రూపాయిని ఒత్తిడికి గురి చేస్తోంది.

పెద్ద నోట్ల రద్దు, ఆ తర్వాత కరోనా సంక్షోభం, ఉక్రెయిన్- రష్యా యుద్ధం, ముడి చమురు ఉత్పత్తిని తగ్గించాలన్న ఒపెక్ దేశాల నిర్ణయం రూపాయి విలువను కొంచెంకొంచెంగా తినేస్తూ వచ్చాయి. ఇది ఇక్కడితో ఆగుతుందనే గ్యారంటీ కూడా లేదు. మన దేశం ముడి చమురుతోపాటు అనేక వస్తువుల విషయంలో ఎక్కువగా దిగుమతుల మీదనే ఆధారపడింది. ప్రపంచంలో చమురు వినియోగించే దేశాల్లో మూడో స్థానంలో ఉన్న భారత్‌కు 85 శాతం చమురుకు దిగుమతులే దిక్కు. ఇదొక్కటే కాక ఫార్మా, స్టీల్, టెక్నాలజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, తదితర రంగాలకు అవసరమైన ముడి సరకులు, వంట నూనెలు, ఆహార ధాన్యాలు, పప్పులు, లోహాలను భారత్ దిగుమతి చేసుకుంటోంది. దిగుమతులన్నింటికీ చెల్లింపులు డాలర్లలోనే జరపాలి. అంటే రూపాయి విలువ తగ్గినప్పుడల్లా దిగుమతులకోసం చెల్లించాల్సిన మొత్తం పెరుగుతూ పోతుంది. అంతర్జాతీయంగా అనిశ్చితిఏర్పడి ధరలు పెరిగితే ఆ ప్రభావం మనపై అధికంగా ఉంటుంది. కొద్ది రోజులుగా చమురు ధరలు పడిపోతున్నా ఇతర కారణాలతో రూపాయి పడిపోవడంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు గత కొన్ని సంవత్సరాలుగా తగ్గలేదు. రూపాయి పతనానికి మరో ముఖ్య కారణం ఎగుమతులు, దిగుమతులు. విదేశాలకు ఎన్ని ఉత్పత్తులు, సేవలు ఎగుమతి అవుతున్నాయి, ఇతర దేశాల నుంచి ఏ స్థాయిలో దిగుమతి అవుతున్నాయనే వాటి మధ్య తేడానే వాణిజ్య లోటు. ప్రస్తుతం మన దేశ వాణిజ్య లోటు 20.78 బిలియన్ డాలర్లుగా ఉంది. వీటితో పాటుగా అమెరికన్ డాలర్ ప్రపంచ మంతా రిజర్వ్ కరెన్సీగా ఉంది. ఇటీవలి కాలంలో డాలర్ విలువ భారీగా పెరిగింది. దీంతో పరోక్షంగా రూపాయి మరింత బలహీనపడింది. భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపరులు నిధులను తరలించడం కూడా రూపాయి బలహీన పడేందుకు ఒక కారణమవుతోంది. ఇప్పటికే చుక్కలనంటుతున్న ధరలతో నానా అగచాట్లు పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు మరిన్ని అగచాట్లు పడతారు. వారి జీవనం అస్తవ్యస్తమవుతుంది. విదేశీ రుణాలు తలకుమించిన భారంకానున్నాయి. ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మరింత పన్నుల భారాన్ని మోపేందుకు ఏమాత్రం వెనుకాడదు. ఇప్పటికే భారీగా పెరిగిన ద్రవ్యోల్బణం మరింత పెరగటంతోపాటు వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం పడనుంది.

రానున్న రోజులలో రూపాయి విలువ మరింత క్షీణిస్తుందని విశ్లేషకుల అంచనా. రూపాయి విలువ పెరగాలంటే దిగుమతులపై ఆధారపడటం తగ్గించుకోవాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అలాగే చమురుకు ప్రత్యామ్నాయ ఇంధనవనరుల వాడకం పెంచాల్సిన అవశ్యకత ఉన్నది. ఈ రెండు చర్యలు తీసుకోవడం సాధ్యమైతే అంతర్జాతీయ పరిణామాల ప్రభావం రూపాయిపై తగ్గుతుందన్నది ఆర్థిక నిపుణుల అభిప్రాయం.

> 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు డాలర్‌తో రూపాయి మారకపు విలువ మూడు రూపాయల 30 పైసలు. 1948లో మూడున్నర రూపాయలుగా ఉన్న మారకపు విలువ ప్రస్తుతం దాదాపు 85 రూపాయలకు చేరింది. ముఖ్యంగా, ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత భారత రూపాయి విలువ పడుతూ లేస్తూ అన్నట్లుగానే సాగుతోంది.

మానవవాద విప్లవకారుడు ఎం.ఎన్.రాయ్

డాక్టర్ దేవరాజు మహారాజు

అలుపెరుగని సత్యాన్వేషి, కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు, ప్రపంచ మానవవాద విప్లవకారుడు ఎం.ఎన్.రాయ్. తీవ్ర జాతీయవాదం లోంచి, ప్రపంచ కమ్యూనిస్టు రాజకీయాలతో మమేకమై, తర్వాత కాలంలో రాడికల్ డెమోక్రటిక్ పార్టీ స్థాపకుడయ్యారు. ఒక వ్యక్తి శక్తిగా ఎలా మారగలడో తెలుసుకోవాలంటే ఎం.ఎన్.రాయ్ జీవితాన్ని అధ్యయనం చేయాలి. భారతీయుడైన రాయ్, మెక్సికన్ కమ్యూనిస్టు పార్టీ స్థాపకుడు (1917) కావడమేమిటీ? విచిత్రం? అని అనిపిస్తుంది. కానీ అది వాస్తవం. ఆయనలోని నిరంతర భావజాల సంఘర్షణ ఆయనని ఏదో ఒక ఆలోచనా ధోరణికి కట్టుబడి ఉండనివ్వలేదు. రాడికల్ డెమొక్రటిక్ పార్టీ స్థాపనతో పాటు భారత రాజ్యాంగ చిత్తు ప్రతిని కూడా తయారుచేసి, ప్రచురించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన సమయానికే ఆయన నూతన మానవవాదానికి మేనిఫెస్టోని (న్యూ హ్యూమనిస్ట్ మ్యానిఫెస్టో) రూపొందించి విడుదల చేశారు.

ఒక జీవితకాలంలో ఒక వ్యక్తి ఇన్ని పనులు ఎలా చేయగలిగారన్నది అంతుపట్టని విషయం. మహా మేధావి కావడం, నిరంతర కృషి చేస్తూ ఉండడం దేశం పట్ల, సమాజం పట్ల తనకు ఎంతో బాధ్యత ఉందనుకోవడం ఇలా ఎన్నెన్నో కారణాల కారణంగా ఆయన తన కలల్ని సాకారం చేసుకుంటూ వచ్చారు. లేకపోతే ఒకప్పటి నలంద, తక్షశిల వంటి బౌద్ధ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన పాత్రను తను స్వీకరించడమేమిటీ? తను స్థాపించిన ఇండియన్ రినైజాన్స్ ఇనిస్టిట్యూట్ ద్వారా దేశాన్నే కదలించడమేమిటి? డెహ్రాడూన్‌లో ఆయన నివాసమున్న చోటు నుంచే ఆ సంస్థను నిర్వహించారు. అది ఆ కాలంలో 'హూమనిస్టు హౌస్' గా పేరు పొందింది. ఉత్తర భారతదేశం నుంచే కాకుండా ఎంతోమంది దక్షిణాది రాష్ట్రాల నుంచి కూడా ఆయన అనుచరులు, అభిమానులు అక్కడికి తరలి వెళ్లారు. దేశంలోని హేతువాదులపై, మానవవాదులపై, ఉద్యమకారులపై, హక్కుల సంఘాల నేతలపై, సామాజిక ఆలోచనాపరులపై, బుద్ధిజీవులపై ఇంకా ఎంతోమందిపై యం.ఎన్.రాయ్ ప్రభావం ప్రత్యక్షంగా పరోక్షంగా ఆ రోజుల్లో చాలా బలంగా పడింది. భారతీయ సమాజంలో మనువాదుల ప్రభావంతో శతాబ్దాలుగా వేళ్లానుకుని ఉన్న మతతత్వ భావనకి వ్యతిరేకంగా పనిచేయడం తన సంస్థ ప్రథమ కర్తవ్యమన్నారు రాయ్. అందుకే 'ఎడ్యుకేట్ ది ఎడ్యుకేటెడ్'- విద్యావంతుల్ని వివేకవంతుల్ని చేద్దామన్న ఆలోచనని ఆయన దశదిశలా వ్యాప్తి చేశారు. ఆయన ఆ మాట చెప్పి 75 ఏళ్లు పూర్తి కావచ్చినా, ఆ నినాదానికి ఇంకా ఈ రోజుకు కూడా ప్రాముఖ్యముంది. దేశంలో నిరక్షరాస్యులైన మూర్ఖుల కన్నా విద్యావంతులైన మూర్ఖుల సంఖ్యే పెరిగిపోతూ ఉండడం మనం గమనిస్తున్నాం. వారితో సమాజం ఒకవైపు రోగగ్రస్థమౌతూ ఉంటే, మరోవైపు చదువులేని సన్యాసులు పరిపాలనా పగ్గాలు చేపడుతూ ఉండడం ఎంత ప్రమాదకరం! రాయ్ పుట్టినప్పుడు పెట్టిన పేరు నరేంద్రనాథ్ భట్టాచార్య. అయితే కాలిఫోర్నియాలో ఉండగా అక్కడి నిఘా విభాగాల దృష్టి మరల్చడానికి మానవేంద్రనాథ్‌రాయ్ (ఎం.ఎన్.రాయ్) గా పేరు మార్చుకున్నారు. అసలైతే నరేంద్రనాథ్ భట్టాచార్యగా 1887 మార్చి21న పశ్చిమ బెంగాల్ 24 ఉత్తర పరగణాలు: ఆర్బేలియాలో ఒక పూజారి కుటుంబంలో పుట్టారు. బాల్యంలో తండ్రి దీనబంధు భట్టాచార్య దగ్గరే సంస్కృతం, కొన్ని సనాతన శాస్త్రాలు చదువుకున్నారు. తండ్రితో పాటు మఠాలు, ఆశ్రమాలు తిరిగారు. అప్పుడే ఆయనలో కొత్త ఆలోచనలు ప్రారంభమయ్యాయి. 14 వ ఏట వెళ్లి అనుశీలన్ సమితిలో చేరారు. అది రహస్యంగా పనిచేసే ఒక విప్లవ సంఘం. కానీ, కొద్ది కాలానికే ఆ సంఘాన్ని నిషేధించారు. ఆ తర్వాత జతిన్ ముఖర్జీ నిర్వహణలో నడిచే జుగాంతర్ గ్రూపులో చేరారు. 'జతిన్ ముఖర్జీని కలవడమే తన జీవితంలో ఒక గొప్ప మలుపు'- అని తన గ్రంథం (చైనాలో నా అనుభవాలు) లో రాసుకున్నారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జుగాంతర్ సభ్యులు ఎన్నో కార్యక్రమాలు చేస్తుండేవారు. ఫలితంగా కొందరు శిక్షలు అనుభవించారు. ఒకతను ఉరితీయబడ్డాడు కూడా! 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. ఆ కాలంలో రాయ్ జర్మన్‌ల సహాయంతో ఇండోనేషియాకు వెళ్లి వస్తుండేవారు. ఆయుధాలు సమకూర్చుకుని, భారతదేశం నుంచి బ్రిటీష్ పాలకుల్ని తరిమికొట్టాలన్నది అప్పుడు ఆయన ఉద్దేశం.

ఆ మరుసటి సంవత్సరం 1916 లో రాయ్ అమెరికా చేరుకున్నారు. కాని, బ్రిటీష్ గూఢచారులు ఆయన కదలికల్ని గమనిస్తూనే ఉన్నారు. రాయ్ శాన్‌ఫ్రాన్సిస్కోలో అడుగు పెట్టగానే అక్కడి ప్రాంతీయ వార్తాపత్రికలో రాయ్ గురించి ఒక సంచలన వార్త ప్రచురితమై ఉంది. "ప్రఖ్యాత బ్రాహ్మణ విప్లవకారుడు, ప్రమాదకారి అయిన జర్మన్ గూఢచారి నరేంద్రనాథ్ భట్టాచార్య అమెరికాలో అడుగుపెట్టాడు"- అన్నది ఆ వార్త సారాంశం! దొరక్కుండా ఉండడానికి రాయ్ వెంటనే పాలో, ఆల్టో- కాలిఫోర్నియాకు వెళ్లిపోయారు. అక్కడ పేరు మార్చుకుని, మానవేంద్రనాథ్ రాయ్‌గా చలామణి అయ్యారు. అంటే తన 29 వ యేట తప్పనిసరై మార్చుకున్న ఆ పేరుతోనే మానవతావాదిగా ప్రపంచ ప్రసిద్ధి పొందారు. అక్కడ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ విద్యార్థిని ఎవిలిన్ ట్రెంట్‌తో స్నేహం పెరిగి పెండ్లి చేసుకున్నారు. మళ్లీ తప్పనిసరై కాలిఫోర్నియా నుంచి మెక్సికో చేరుకున్నారు. అక్కడ ఆయనకు తగిన భద్రత, గుర్తింపు లభించాయి. అనతి కాలంలోనే అక్కడి సోషలిస్టులకు రాయ్, ఒక మంచి స్నేహితుడయ్యారు. అందుకే ఆయన 'జ్ఞాపకాల పుస్తకం'లో- మెక్సికో తనకు ఒక కొత్త జన్మ నిచ్చిందని రాసుకున్నారు. అక్కడ ఉన్న రోజుల్లోనే మెక్సికన్ కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. ఆ తర్వాత మూడేళ్లకు 1920 లో మరో ఆరుగురు నాయకులతో కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపనకు ప్రయత్నాలు ప్రారంభించారు. మానవేంద్రనాథ్‌రాయ్ తర్వాత కాలంలో వ్లాదిమిర్ లెనిన్, జోసెఫ్ స్టాలిన్‌లను కలిసి కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌లో భాగస్వాములయ్యారు. 1926లో దాని విధి విధానాల రూపకల్పనలో పాలుపంచుకున్నారు. ఆ



విధి విధానాల్ని చైనా కమ్యూనిస్టు పార్టీ అవలంబించేట్లు ఒప్పించడానికి ఎం.ఎన్.రాయ్ 1927 లో చైనా వెళ్లారు. కానీ, ఆ ప్రయత్నం విఫలమైంది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ విధి విధానాల్ని చైనా ఒప్పుకోలేదు. రాయ్ ఒప్పించలేకపోయారని కాబోలు, 1929 లో ఆయనను కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నుంచి బహిష్కరించారు. 1930 లో రాయ్ భారతదేశానికి తిరిగిరాగానే, ఆయన కోసం గాలిస్తున్న బ్రిటీషు ప్రభుత్వం 1924 నాటి కాన్పూర్ బోల్షివిక్ కుట్ర కేసును వెలికితీసి- అరెస్ట్ చేసింది. ఆరేళ్లు జైలు శిక్ష విధించింది. అప్పుడు ఆయనతో పాటు ఎస్.ఎ.డాంగే, షౌకత్ ఉస్మానీ వంటి ఇతర నాయకులు ఉన్నారు. ఆ కాలంలోనే రాయ్ తొమ్మిది సంపుటాల "ప్రిజన్ డైరీలు" రాశారు. అందులో కొన్ని భాగాలు పుస్తకాలుగా అచ్చయినా, మొత్తానికి మొత్తంగా అవి అచ్చుకాలేదు. ఆ సంపుటాలు ఇప్పటికీ ఢిల్లీ- నెహ్రూ మెమోరియల్ మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి. జైలు నుంచి విడుదలై వచ్చాక రాయ్ నాలుగేళ్ల పాటు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో సభ్యుడిగా ఉండి బయటపడ్డారు. 1946 లో రాయ్ డెహ్రాడూన్‌లో (ఇండియన్ రినైజాన్స్ ఇనిస్టిట్యూట్) భారతీయ సాంస్కృతిక పునర్వికాస కేంద్రాన్ని స్థాపించారు. అది దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వమేనన్నది గమనించాలి. సుమారు డెబ్బయ్యారేళ్ల క్రితం ప్రారంభమైన ఆ సంస్థ ఆధునిక భౌతికశాస్త్ర దృక్కోణంలో మానవ వాదాన్ని ప్రచారం చేసింది. చార్వాక, లోకాయత, బౌద్ధ దర్శనాల అధ్యయనానికి వేదిక అయ్యింది. అంతేకాదు, ఉపనిషత్తుల, భక్తి ఉద్యమాలకు సంబంధించిన చర్చలు చేపట్టింది. రినైజాన్స్ ఇనిస్టిట్యూట్ పక్షాన పత్రికలు, పుస్తకాలు ముద్రించడం, సభలూ సమావేశాలే కాదు, కార్యశాలలు నిర్వహించడం నిరంతరం కొనసాగుతూ ఉండేవి. ఫలితంగానే బలమైన మానవవాద సాహిత్యం సృష్టించారు.

ఎంతోమంది కొత్త తరం బుద్ధిజీవులు మానవ వాదులుగా తయారవుతూ వచ్చారు. మానవవాద ఆలోచనా ధోరణి ఒక ఉద్యమ రూపం దాల్చింది. దేశ వ్యాప్తంగా సాంస్కృతిక, సామాజిక ఆలోచనాపరులంతా ఎం.ఎన్.రాయ్‌ని అభిమానించడం ప్రారంభించారు. ఆయన ఆలోచనల్ని సమాజంలోని మూల మూలలకు చేరవేయడానికి లక్షల సంఖ్యలో కార్యకర్తలు తయారయ్యారు. రాయ్ జీవితం నుంచి, ఆయన ప్రతిపాదించిన రాడికల్ హ్యూమనిజం నుంచి దేశంలోని సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌వాదులు, పార్టీ రహిత కార్యకర్తలు ఎంతోమంది ప్రేరణ పొందారు. వైజ్ఞానిక, సాంస్కృతిక ఉద్యమాలతో ఏ కొద్దిపాటి సంబంధం ఉన్నవారయినా సరే, ఎం.ఎన్.రాయ్‌ని అనుసరించారు. దేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వం, వచ్చిన తర్వాత కూడా వైజ్ఞానిక శాస్త్ర ప్రచారానికి సంస్థలేవీలేవు. రాయ్ నెలకొల్పిన ఇండియన్ రినైజాన్స్ ఇనిస్టిట్యూట్ ఒక్కటే- నిర్విరామంగా కృషి చేస్తూ వచ్చింది. ఆ సంస్థకు మెదడూ, వెన్నెముక అన్నీ రాయే అయ్యారు. అయితే ఆయన భార్య ఎలెన్‌రాయ్ కూడా సంస్థ నిర్వహణలో ఆయన వెన్నంటే ఉన్నారు. డెహ్రాడూన్‌లోనే కాక, ముస్సోరిలో కూడా ఈ సంస్థ శిక్షణా శిబిరాల్ని నిర్వహిస్తూ ఉండేది. రాయ్ అకాల మరణం తర్వాత ఎలెన్‌రాయ్ సంస్థను తన శక్తి మేరకు నడిపారు. అయితే ఆమె కొంత కాలానికి హత్యకు గురి కావడంతో కొందరు అనుచరులు పూనుకుని మరి కొంతకాలం సంస్థను నిర్వహించగలిగారు తర్వాత క్రమంగా అది కనుమరుగైపోయింది. మతతత్వాన్ని మట్టుబెట్టడానికి జీవితమంతా పోరాడిన రాయ్, 1954 జనవరి 25న 67 వ యేట, గుండెపోటుతో కన్నుమూశారు. ఆ తర్వాత ఇండియన్ రినైజాన్స్ సంస్థ ఆవరణలో ఉన్న ఆయన సమాధిని కూడా దుండగులు ధ్వంసం చేశారు. దేశంలోని ప్రగతిశీల, భావజాలం గల వ్యవస్థలేవీ రాయ్ ఆలోచనా ధోరణిని నిలుపుకోలేకపోయాయి. చాలాకాలం గడిచిపోయింది. అయితే ఇప్పుడు మతోన్మాదం దేశంలో కొత్తకొత్త రూపాల్లో పెచ్చరిల్లుతున్న నేటి తరుణంలో- ప్రగతిశీల, వైజ్ఞానిక, హేతువాద, బౌద్ధ, వామపక్ష వాదులంతా ఏకమై మానవవాద ఆలోచనా ధోరణిని బలోపేతం చేసుకోవాల్సి ఉంది. ఎగుడు దిగుళ్లు అవకతవకలు వ్యక్తుల జీవితాల్లోనైనా, సంస్థల, పార్టీల నిర్వహణల్లోన్నైనా సహజం! వాటిని పక్కకు నెట్టి తక్షణం వైజ్ఞానిక మానవ వాదాన్ని ముందుకు తీసుకుపోవాల్సి ఉంది. ఈ బాధ్యత దేశంలోని యువతరం చేపట్టాల్సి ఉంది.

కేంద్ర సాహిత్య అకాడెమీ విజేత

ఇండిగో విమానానికి తప్పిన ముప్పు

పాట్నా: పాట్నాలోని జయప్రకాశ్ నారాయణ విమానాశ్రయంలో ఇండిగో విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. రన్‌వేపై ట్రాక్టర్ మొరాయించడంతో ల్యాండ్ కావాల్సిన ఇండిగో విమానం దాదాపు 40 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టింది. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం జయప్రకాశ్ నారాయణ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేపై శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌తో గడ్డి కోస్తుండగా అది మొరాయించింది. ట్రాక్టర్ బురదలో కూరుకుపోవడంతో దానిని అక్కడి నుంచి తొలగించడానికి సిబ్బంది 20 నిమిషాల పాటు శ్రమించారు. ఆ సమయంలో కోల్‌కతా నుంచి పాట్నా వచ్చే విమానం ల్యాండ్ కావాల్సిఉంది. అయితే రన్‌వేకు సమీపంలో ట్రాక్టర్ ఉండడంతో విమానం 40 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టింది. దీనివల్ల ల్యాండింగ్ ఆలస్యమైంది. దీనిపై విమానాశ్రయం అధికారులు స్పందిస్తూ ప్రయాణికులకు కలిగిన ఆలస్యానికి, అసౌకర్యానికి క్షమాపణలు చెప్పారు.

యూపీలో రోడ్డు ప్రమాదం
ఏడుగురి దుర్మరణం

లక్నో: జాతీయ రహదారులపై పరిమితికి మించిన వేగంతో ప్రయాణిస్తూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం దేశంలో ఏదో మూల ఈ తరహా రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముందు వాహనాన్ని తప్పించి వెళ్లాలన్న అత్యుత్సాహంతో వేగాన్ని మరింత పెంచి ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో తాజాగా అదేతరహాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ దంపతులు సహా ఏడు గురు మృతిచెందారు. బిజ్నోర్ వద్ద డెహ్రాడూన్-నైనిటాల్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఓ కారు... ఆటోను ఓవర్‌టేక్ చేస్తుండగా ఢీకొంది. ఆ ధాటికి ఎగిరిపడిన ఆటో సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారు వేగంగా ఢీకొట్టడంతో... ఆటోలో ప్రయా ణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ అజాబ్ సింగ్‌ను ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గమ ధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. కారులో ప్రయా ణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. మృతదేహాలను పోస్టుమా ర్టమ్ నిమిత్తం ఆసుపత్రికి పంపినట్లు ఎస్పీ అభిషేక్ తెలిపారు.

దేశంలోనే తొలి మహిళా బస్ డిపో ప్రారంభం

న్యూఢిల్లీ: దేశంలోనే తొలి 'మహిళా' బస్ డిపోను రాష్ట్ర రవాణా మంత్రి కైలాశ్ గెహ్లోత్ దిల్లీలో ప్రారంభించారు. సరోజిని నగర్‌లో పూర్తిస్థాయి మహిళా సిబ్బందితో కూడిన ఈ డిపోకు సఖి డిపో అని పేరు పెట్టినట్లుగా పేర్కొన్నారు. ఇందులో డిపో మేనేజర్, డ్రైవర్లు, కండక్టర్లు ఇలా సిబ్బంది అందరూ మహిళలేనని... దీని కోసం 225 మంది సిబ్బందిని కేటాయించామని ఆయన తెలిపారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు రవాణా రంగంలోనూ తమ హక్కులు పొందాలనే ఉద్దేశంతో ఈ డిపో ప్రారంభించినట్లు మంత్రి చెప్పారు. ఇప్పటికే చాలామంది మహిళలు బస్ కండక్టర్లుగా, ఇతర సిబ్బందిగా సేవలు అందిస్తున్నారని... ఇకపై డ్రైవర్లుగానూ తమ ప్రతిభ చాటుకుంటారని అన్నారు. దేశంలో ఇది ఒక నూతన ఒరవడి సృష్టిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం రవాణా రంగంలో పని చేస్తున్న తమకు సరైన సౌకర్యాలు లేవని మహిళా ఉద్యోగులు మంత్రి ఎదుట నిరసన చేపట్టారు. న్యాయబద్ధ జీతం, శాశ్వత ఉద్యోగాలకు మంత్రి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధులకు హాజరు కావాలంటే ఉదయం ఆరు గంటలకే ఇంటి నుంచి బయల్దేరి... కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాలని, అయినా ఒక్కోసారి సమయానికి పని ప్రదేశానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మహిళా ఉద్యోగులతో మాట్లాడిన మంత్రి కైలాశ్ ... వారి డిమాండ్లు నెరవేరుస్తామని, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఎన్నికలకు మతం రంగు పులిమేందుకే...

బీజేపీ నేతల 'ఓట్ జిహాద్' వ్యాఖ్యలపై పవార్



సతారా: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మతం రంగు పులిమేందుకు ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, బీజేపీలోని ఆయన సహచరులు ప్రయత్నిస్తున్నారు కాబట్టే 'ఓట్ జిహాద్' వినిపిస్తోందని ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. ఆయన శనివారం పూనేలో విలేకరులతో మాట్లాడుతూ ఫడ్నవీస్, ఎన్‌సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ వ్యాఖ్యలపై ప్రశ్నలకు సమాధానమిచ్చారు. బీజేపీ నేతృత్వ మహాయుతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'ఓట్ జిహాద్'కు ఇస్లాం మతపెద్ద పిలుపుకు దీటుగా 'ఓట్లతో ధర్మయుద్ధం' చేద్దాంటూ ఫడ్నవీస్ పిలుపు ఇవ్వడంపై పవార్ స్పందించారు. లోక్‌సభ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో ప్రతిపక్ష మహా వికాస్ అగాఢీ (ఎంవీఏ) కూటమికి మైనారిటీలు అనుకూలంగా ఉండటాన్ని ఉద్దేశించి బీజేపీ నేత 'ఓట్ జిహాద్' వ్యాఖ్యలను తెర మీదకు తెచ్చారన్నారు. 'పూనేలోని ఒక ప్రాంతంలో హిందువులు ఎక్కువగా ఉండి అక్కడ బీజేపీకి ఓటేస్తే ఇలాంటి పరిణామాన్ని ఊహించవచ్చు. అది ఓట్ జిహాద్ కాబోదు. ఓట్ జిహాద్‌ను తెర మీదకు తెచ్చి ఎన్నికలకు మతం రంగు పులిమే ప్రయత్నాన్ని ఫడ్నవీస్ ఆయన సహచర బీజేపీ నేతలు చేస్తున్నారు. దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం' అని శరద్ పవార్ స్పష్టంచేశారు. సీనియర్ పవార్ తర్వాత మీ నాయకుడు ఎవరన్నది గుర్తు పెట్టుకోండి అని బారామతి ప్రజలకు అజిత్ పవార్ పిలుపు ఇవ్వడంపై ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత స్పందిస్తూ తమ భావి నాయకుడు ఎవరన్నది ప్రజలే నిర్ణయించుకుంటారని అన్నారు.

బారామతిలో ప'వార్'

- సొంత నియోజకవర్గంలో శరద్ విస్తృత ప్రచారం
- చావో రేవో తేల్చుకోనున్న అజిత్

బారామతి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బారామతి నియోజకవర్గం అత్యంత ఆసక్తికరంగా మారింది. ఇక్కడి ఓటర్లపై అజిత్ పవార్ అభివృద్ధి నినాదం... శరద్ పవార్ భావోద్వేగం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎందుకంటే చాలామంది ఓటర్లు ఇంతకు ముందెన్నడూ లేనివిధంగా విస్తృత ప్రచారం చూస్తున్నారు. ఇప్పుడు చిన్న పవార్‌కు ఈ నియోజకవర్గం యుద్ధభూమిగా మారింది. అజిత్ పవార్ ప్రత్యర్థిగా శరద్ పవార్ మేనల్లుడు యుగేంద్ర పవార్ బరిలో ఉన్నారు. అయితే శరద్ పవార్‌కు ఇక్కడి ప్రజల నుంచి విశేష మద్దతు ఉందని, ఆయన ఎక్కువ సమయం ప్రచారంలో గడపడానికి ఇబ్బంది పడరని, పెద్ద పవార్ గెలుపు ఖాయమని సందీప్ జగ్తాప్ (32) అనే రైతు చెప్పాడు. 'ఆయన ఇప్పుడు నవ్వుతూ నమస్కరిస్తున్నాడు. ముకుళిత హస్తాలతో మా ఓట్లు అడుగుతున్నారు' అని అన్నారు. యుగేంద్ర పవార్‌కు మద్దతుగా పవార్ వంశానికి చెందిన సభ్యులు ప్రచారంలో ఎక్కువగా పాల్గొంటున్నట్లు అతని స్నేహితుడు అమోల్ కులంగే చెప్పాడు. డిప్యూటీ సీఎంపై యుగేంద్రను ఎన్‌సీపీ (ఎస్‌పీ) అభ్యర్థిగా నిలబెట్టారు. గత ఎన్నికల్లో ఎక్కువగా కనిపించని శరద్ పవార్ భార్య ప్రతిభా పవార్‌తో పాటు కుటుంబంలోని మరికొందరు సభ్యులు కూడా ప్రచారంలో పాల్గొంటున్నారని కులంగే తెలిపారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయిన శరద్ పవార్‌కు పశ్చిమ మహారాష్ట్రలో బలమైన పట్టు ఉంది. ప్రజల్లో గౌరవం స్పష్టంగా ఉంది. 1991లో అజిత్ పవార్‌కు ఈ నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టడానికి ముందు సీనియర్ పవార్ ఆరు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించారు. కానీ సీనియర్ పవార్ నుంచి విడిపోయిన అజిత్ పవార్ ఇప్పుడు వరుసగా ఎనిమిదోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్నారు. 2023లో అప్పటి అవిభక్త పార్టీకి చెందిన 53 మంది ఎమ్మెల్యేలలో 40 మందితో పాటు తన మామ నుంచి విడిపోయిన తర్వాత బారామతి నుంచి మొదటిసారిగా అజిత్ ఎన్నికయ్యారు. కాగా, అజిత్ పార్టీ ఇప్పుడు నిజమైన ఎన్‌సీపీగా గుర్తింపు పొందేందుకు పోరాడుతోంది. పట్టణంలో శ్రీకృష్ణ బోర్కర్ అనే ఉపాధ్యాయుడు మాట్లాడుతూ ఇక్కడి అభివృద్ధి వెనుక అజిత్ పవార్ ఉన్నారని, వీవీ కళాశాలతో సహా ఎక్కడైనా కనిపించే విధంగా మౌలిక సదుపాయాలు ఉన్నాయని ఆయన అన్నారు. అయినప్పటికీ, పాత తరాల వారి మాటలను పరిశీలిస్తే... ఈ నియోజకవర్గంలో పరిస్థితి మరోలా ఉంది. అధికార బీజేపీతో చేతులు కలిపేందుకు అజిత్ పవార్ తన మామ పార్టీని 'పట్టుకున్నారని' ఒక వర్గం ప్రజలు విమర్శిస్తున్నారు. మోహన్ అఖాడే అనే 60 ఏళ్ల రైతు మాట్లాడుతూ ఎన్‌సీపీ ప్రధాన మద్దతుదారులు 'సాహెబ్'ను ఎప్పటికీ విడిచిపెట్టరని తెలిపారు. అజిత్ ఎమ్మెల్యేగా ఎన్నికవడానికి ముందు బారామతి అభివృద్ధికి నమూనాగా తీర్చిదిద్దింది శరద్ పవార్ అని ఆయన నొక్కి చెప్పారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో సుప్రియా సూలేపై అజిత్ భార్య సునేత్రా పవార్ ఓటమి చెందారు. ఈ అసెంబ్లీ ఎన్నికలలో యుగేంద్ర పవార్ ప్రస్తుత ఉప ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఎన్‌సీపీ (ఎస్‌పీ) అభ్యర్థి అయినప్పటికీ ఓటర్ల ఎంపిక అజిత్, శరద్ మధ్య అనే విషయంలో ఎవరికీ ఎటువంటి సందేహం లేదు. శరద్ పవార్ అతిపెద్ద రాజకీయ సంక్షోభాలలో ఒకదాన్ని ఎదుర్కొన్నప్పుడు ఓటర్లు లోక్‌సభ ఎన్నికలలో సుప్రియా సూలేకు ఓటు వేశారని, ఇప్పుడు అజిత్ పవార్ చేసిన అభివృద్ధికి గుర్తింపుగా మద్దతు ఇస్తారని చెప్పే వారు కూడా ఉన్నారు. పాలక మహాయుతి వర్సెస్ మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)కి బదులుగా పవార్ కుటుంబంలో చీలికతో రాజకీయ చర్చ మరుగునపడింది. ఈ పరిణామం బారామతి ప్రయోజనాలకు హానికరమని చాలామంది భావించారు. 'ఎవరైనా ఓడిపోతే నియోజకవర్గంపై ఆసక్తి తగ్గుతుంది. కుటుంబం ఐక్యంగా ఉండటమే మా ఆసక్తి' అని మెహుల్ షిండే చెప్పారు. నవంబరు 20న పోలింగ్‌కు ముందు ప్రచారానికి చివరి రోజు నవంబరు 18న బారామతిలో శరద్ పవార్ బహిరంగ సభ ప్రసంగంపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. శరద్ పవార్ అసాధారణమైన రీతిలో దూకుడు ప్రదర్శిస్తూ... ప్రభుత్వంలో చేరడానికి తనను విడిచిపెట్టిన వారిని 'ద్రోహులు' అని పేర్కొన్నారు. వారిని ఓడించాలని కోరారు. మరోవైపు అజిత్... సీనియర్ పవార్‌పై పదునైన విమర్శలు ఆపేశారు.

రాజ్యాంగం భారత్ డీఎన్ఏ

బీజేపీకి ఖాళీ పుస్తకం: రాహుల్

అమరావతి: రాజ్యాంగం దేశానికి డీఎన్ఏ అన్నది కాంగ్రెస్ భావన కానీ బీజేపీ ఉద్దేశంలో అది కేవలం ఒక ఖాళీ పుస్తకమని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ప్రచార సభల్లో కాంగ్రెస్ నేతలు ఖాళీ పుస్తకాలు చూపిస్తూ రాజ్యాంగం అంటున్నారని బీజేపీ విమర్శిస్తుండంతో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. మహారాష్ట్ర అమరావతిలో శనివారం ఎన్నికల సభలో కాంగ్రెస్ అగ్రనేత మాట్లాడుతూ బీజేపీని దుయ్యబట్టారు. మహారాష్ట్రలో జరిగినట్లు ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి ప్రభుత్వాలను కూల్చేయమనిగానీ బడా వ్యాపారవేత్తలకు రూ.16లక్షల కోట్ల రుణమాఫీ చేయమనిగానీ రాజ్యాంగంలో ఎక్కడా లేదని రాహుల్ అన్నారు. 'నేను లేవనెత్తే అంశాన్నే ప్రధాని మోదీ ఇటీవల తరచూ ప్రస్తావిస్తున్నట్లు నా సోదరి నాతో చెప్పారు. కులగణన జరిపించాలని, రిజర్వేషన్లపై 50శాతం పరిమితిని తొలగించాలని నేను ఆయనతో లోక్‌సభలో చెప్పాను. ఇప్పుడు ఆయన ఎన్నికల ప్రచార సభల్లో నా గురించి మాట్లాడుతూ నేను రిజర్వేషన్లకు వ్యతిరేకమంటున్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడి వలే ఈయనకూ జ్ఞాపకశక్తి తగ్గినట్లు ఉంది' అని రాహుల్ ఎద్దేవా చేశారు. ఇకపై రాహుల్ గాంధీ కులగణనకూ వ్యతిరేకమని ప్రచారం చేసినా ఆశ్చర్యంలేదన్నారు. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడతాను కాబట్టే నా ప్రతిష్ఠను దిగజార్చేందుకు అధికర పక్షం కోట్ల రూపాయలు వెచ్చించిందని రాహుల్ వ్యాఖ్యానించారు. రైతులు, చిరు వ్యాపారుల అంతానికి జీఎస్టీ, నోట్ల రద్దు అస్త్రాలయ్యాయని విమర్శించారు. నిరుద్యోగం తారస్థాయికి చేరిందని, సమాజంలో ద్వేషం పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. 'పారిశ్రామికవేత్తలు మిమ్మల్ని ప్రధానిగా ఎంపిక చేయలేదు... భారత ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నారని గ్రహించమని మోదీకి చెప్పాలనుంది. ఆయన కోసం పారిశ్రామికవేత్తలు మార్కెటింగ్ చేయడం వాస్తవమే' అని రాహుల్ అన్నారు. ధారావి ప్రాజెక్టు కోసం ఒప్పందం క్రమంలో ధన బలంతో మహారాష్ట్ర ప్రభుత్వం దోపిడీకి గురైందని విమర్శించారు.

రాహుల్ గాంధీ బ్యాగ్‌ల తనిఖీ

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రచారంలో పాల్గొనే నేతల బ్యాగులు, హెలికాప్టర్లలో తనిఖీల పరంపర కొనసాగుతోంది. తాజాగా అమరావతిలో ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బ్యాగులను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. శనివారం మధ్యాహ్నం అమరావతిలో ఆయన హెలికాప్టర్ ల్యాండ్ అవ్వగానే అధికారులు సోదా చేశారు. ఆయన వెంట తెచ్చుకున్న బ్యాగులతో పాటు హెలికాప్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ సమయంలో రాహుల్ తన పార్టీ నేతలతో మాట్లాడుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. మహారాష్ట్రలో ఈ 'ఎన్నికల తనిఖీలు' తాజాగా రాజకీయ దుమారానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఇటీవల మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే బ్యాగులను ఎన్నికల అధికారులు పదేపదే తనిఖీ చేయడం చర్చనీయాంశమైంది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకున్నారంటూ ఎన్నికల అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. ఆ తర్వాత కొంతమంది ప్రతిపక్ష నేతలు కూడా ఇదే అసహనం వ్యక్తం చేశారు. అయితే, ఎన్నికల వేళ ఇది సాధారణ ప్రక్రియే అంటూ ఈసీ స్పష్టతనిచ్చింది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్రమంత్రి అమిత్ షా తదితర ఎన్డీయే నేతల బ్యాగులనూ అధికారులు తనిఖీ చేశారు. తన హెలికాప్టర్‌ను ఈసీ బృందం పరిశీలిస్తున్న దృశ్యాలను స్వయంగా అమిత్ షా తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. కాగా... ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ రాహుల్ గాంధీ హెలికాప్టర్‌ను ఈసీ అధికారులు తనిఖీ చేసిన సంగతి తెలిసిందే.

మణిపూర్ శాంతిభద్రతలు
పునరుద్ధరిస్తాం

కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ : మణిపూర్‌లో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలో మోహరించిన అన్ని భద్రతా బలగాలను ఆదేశించినట్లు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. గత కొన్ని రోజులుగా మణిపూర్‌లో భద్రతా పరిస్థితులు అత్యంత దిగజారిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని జిరిబామ్ జిల్లాలో అత్యాధునిక ఆయుధాలతో పోలీసు స్టేషన్‌పైన, దానికి ఆనుకుని ఉన్న సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడికి పాల్పడిన 11 మంది అనుమానిత ఉగ్రవాదులు ఎదురుకాల్పుల్లో మరణించిన తర్వాత గత సోమవారం తాజా హింసాకాండ చెలరేగింది. ఒక రోజు తర్వాత... అదే జిల్లా నుంచి సాయుధ ఉగ్రవాదులు మహిళలు, పిల్లలతో సహా ఆరుగురు పౌరులను అపహరించారు. 'మణిపూర్‌లో కొన్ని రోజులుగా భద్రతా పరిస్థితి దిగజారింది. సంఘర్షణలో ఉన్న రెండు వర్గాలకు చెందిన సాయుధ దుర్మార్గులు హింసకు పాల్పడుతున్నారు. ఇది ప్రాణనష్టం, ప్రజా కార్యకలాపాలకు విఘాతం కలిగిస్తుంది' అని మంత్రిత్వ శాఖ పేర్కొంది. హింసాత్మక చర్యలకు, విఘాతం కలిగించే కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సమర్థవంతమైన దర్యాప్తు కోసం ముఖ్యమైన కేసులను ఎన్ఐఏకు అప్పగించినట్లు తెలిపింది. వదంతులను నమ్మవద్దని, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు భద్రతా బలగాలకు సహకరించాలని ప్రజలను అభ్యర్థించింది. కాగా హింసాత్మకంగా దెబ్బతిన్న జిరిబామ్‌తో సహ మణిపూర్‌లోని ఆరు పోలీసు స్టేషన్ల పరిధిలో సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టాన్ని కేంద్రం గురువారం అమలు చేసింది. మణిపూర్ ప్రభుత్వం అక్టోబరు 1న మొత్తం రాష్ట్రంలో ఏఎఫ్ఎస్‌పీఏను విధించిన తర్వాత ఈ ఆరు పోలీస్ స్టేషన్ ప్రాంతాలను మినహాయించి తాజా ఉత్తర్వు వచ్చింది. భద్రతా పరిస్థితి దిగజారిన ప్రాంతాల్లో పనిచేస్తున్న సాయుధ దళాలకు 'ప్రజా శాంతి నిర్వహణ' కోసం అవసరమని భావిస్తే శోధించడానికి, అరెస్టు చేయడానికి, కాల్పులు జరపడానికి ఏఎఫ్ఎస్‌పీఏ విస్తృత అధికారాలను ఇస్తుంది. కాగా ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో సెక్మాయ్, లాంసాంగ్, ఇంఫాల్ తూర్పు జిల్లాలో లామ్‌లై, జిరిబామ్ జిల్లాలోని జిరిబామ్, కాంగ్‌పోక్పిలోని లీమాఖోంగ్, విష్ణుపూర్‌లోని మోయిరాంగ్‌లో ఈ చట్టాన్ని తిరిగి అమలు చేసింది. గత సంవత్సరం మే నెల నుంచి ఇంఫాల్ లోయకు చెందిన మైతేయి, పక్కనే పర్వత ప్రాంతాల్లో నివసించే కుకీ వర్గం మధ్య జరిగిన జాతి హింసలో 200 మందికి పైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

మేమంటే చిన్నచూపా?

రిజర్వుడ్ ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లోకి అనుమతి లేదా
ప్రధాని కోసం టాయిలెట్ రిజర్వు చేస్తారా: ఖడ్గే



రాంచీ: ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అంటే అధికార పక్షానికి, ప్రధాని మోదీకి చిన్నచూపా అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే ప్రశ్నించారు. కేబినెట్ మంత్రి ర్యాంకులో ఉన్నాగానీ రిజర్వ్‌డ్ ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లోకి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అనుమతివ్వకపోవడంపై మండిపడ్డారు. ప్రధాని కోసమైతే టాయిలెట్ రిజర్వు చేస్తారా అంటూ నిలదీ శారు. జార్ఖండ్‌లో తనతో పాటు రాహుల్ గాంధీ హెలికాప్టర్ల జాప్యానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఖడ్గే నిందించారు. జార్ఖండ్‌లో ఎన్నికల ర్యాలీ తర్వాత గొడ్డా జిల్లాలోని మహాగమ నుంచి రాహుల్ గాంధీని తీసుకెళ్లాల్సిన హెలికాప్టర్‌ను శుక్రవారం రెండు గంటలు ఎగరనివ్వలేదు. దీంతో ఇది రాజకీయ ప్రేరేపిత జాప్యమ ంటూ కాంగ్రెస్ విమర్శించింది. అటు నోఫ్లై జోన్ కారణంగా డియోఘర్ ఎయిర్‌పోర్టులో మోదీ విమానం దాదాపు రెండు గంటలు నిలిచిపోయింది. సమస్య పరిష్కారం తర్వాతే ఆయన అక్కడ నుంచి కదిలినట్లు అధికారులు చెప్పారు. ఖడ్గే మాట్లాడుతూ 'ప్రధాని విమానంలో కూర్చొని ఉన్నారు కాబట్టి మా నాయకుడు రాహుల్ గాంధీ హెలికాప్టర్‌ను ఉద్దేశపూర్వకంగా రెండు గంటలు ఆపేశారు. ఈ రోజు అమిత్‌షా విమానం దిగుతుండటం వల్ల నా చాపర్ 20 నిమిషాలు ఆలస్యమైంది. ఆయన దారి, నా దారి వేర్వేరు. రాహుల్ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు. కేబినెట్ మంత్రి హోదాలో ఉన్నారు కానీ ఎయిర్‌పోర్టు రిజర్వ్‌డ్ లాంజ్‌లోకి ఆయనకు అనుమతి లేదు. అది ప్రధాని మోదీ కోసమని అధికారులు అంటారు. ప్రధాని కోసం టాయిలెట్ కూడా రిజర్వు చేస్తారా అని వారిని ప్రశ్నిస్తున్నా' అని ఎయిర్‌పోర్టు పేరును ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు. చొరబాట్లను అడ్డుకునే అధికారం ఉండి కూడా దానిని బూచీగా చూపి ప్రజలను భయపెట్టేందుకు మోదీ-షా ప్రయత్నిస్తున్నారని ఖడ్గే దుయ్యబట్టారు. 'ప్రధాని మోదీ, అమిత్ షా నిద్రపోతున్నారా? అధికారంలో ఉండి చొరబాట్లను ఎందుకు కట్టడి చేయలేకపో తున్నారు? హెలికాప్టర్‌ను ఆపగలి గినప్పుడు చొరబాట్లను ఎందుకు ఆపలేరు?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు, దాని మిత్రపక్షాలకు మద్దతిచ్చే వారిపై ఈడీ, సీబీఐ, ఐటీని కేంద్రం ప్రయోగిస్తోందని ఆరోపించారు. 'విభజితులమైతే నామరూపాలు లేకుండా పోతామని (బటేంగేతో కటేంగే) వారు (బీజేపీ) అంటారు కానీ నేను భయపడితే చచ్చిపోతారని (డర్‌గయేతో మర్‌గయే) అంటాను' అని ఖడ్గే ఉద్ఘాటించారు.

ట్రంప్ ఎన్నికతో అమెరికా అభివృద్ధి: జై శంకర్

న్యూఢిల్లీ: అమెరికాకు అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ పాలనలో అమెరికా మరింత అభివృద్ధి చెందుతుందని కేంద్ర విదేశాంగమంత్రి జై శంకర్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ ఎన్నికతో అమెరికా ఆర్థిక, తయారీ రంగాల్లో మరిన్ని ప్రయోజనాలు పొందుతుందని తెలిపారు. ప్రపంచీకరణ అంశంపై ఓటర్లలో ఉన్న అసంతృప్తి అమెరికా ఎన్నికల్లో కనిపించిందన్నారు. హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సులో జైశంకర్ శనివారం ప్రసంగించారు. ప్రపంచీకరణ వల్ల చైనా ఇతర దేశాల కంటే అధికంగా లబ్ధి పొందుతుందని ఆయన అన్నారు. క్లింటన్ పరిపాలనలో మొదట దీనిని అవలంబించారని, అప్పట్లో దీనివల్ల అమెరికా, భారత్ సహా ఇతర దేశాల్లో అనిశ్చితి నెలకొందని వెల్లడించారు. అమెరికా ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశమైనప్పటికీ... దానికి ప్రపంచ భాగస్వామ్య దేశాల మద్దతు అవసరమని పేర్కొన్నారు. దేశ భద్రత గురించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికత, జాతీయ భద్రతను విభజించలేమని, డిజిటల్, ఏఐ విప్లవంలో ఇది భాగమని అన్నారు. భారతదేశ ఆర్థికవ్యవస్థ వైపు ప్రపంచం చూస్తోందని జైశంకర్ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ప్రపంచంలోని చాలా దేశాలు రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటున్నాయని, ఈ సమయంలో భారత్‌లో ఉన్న రాజకీయ సుస్థిరతను అవి గమనిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో మళ్లీ ఎన్నికవడం అంత సులభం కాదని, అయినా తమ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలు మూడోసారీ ఎన్డీఏకు పట్టం కట్టారని, ఇది మామూలు విషయం కాదన్నారు. 7-8 శాతం వృద్ధి రేటు కొనసాగించడం ఇతర దేశాలకు సవాలుగా మారిందని జైశంకర్ చెప్పారు. దీంతో ప్రపంచదేశాలు భారతదేశ ఆర్థికవ్యవస్థ వైపు చూస్తున్నాయని, భారత్‌లో వ్యాపారాలు చేయడానికి, పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయన్నారు.

ఉగ్రవాదులకు కాలం చెల్లింది

విపక్షాల ఓటు బ్యాంకు రాజకీయాలు: మోదీ

న్యూఢిల్లీ: గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే పాలసీలు తీసుకొచ్చాయని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాకే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించామని చెప్పారు. శనివారం జరిగిన హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సులో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం, తదితర అంశాలను ప్రస్తావించారు. సదస్సు ప్రాంగణంలో ప్రదర్శించిన 26/11 ముంబై పేలుళ్ల కథనాలను మోదీ వీక్షించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ 'ఆ సమయంలో భారత ప్రజలు సురక్షితంగా లేరని చెప్పేందుకు కొందరు ఉగ్రవాదాన్ని ఉపయోగించేవారు. కానీ కాలం మారింది. ఇప్పుడు ఉగ్రవాదులు వారి సొంతగడ్డపైనే అభద్రతాభావంతో ఉంటున్నారు. భయంభయంగా బతుకుతున్నారు. ఇక, వారు మనల్ని భయపెట్టలేరు' అని మోదీ అన్నారు. విపక్షాలపైనా మోదీ ఎదురుదాడికి దిగారు. 'ఇప్పుడు ప్రపంచంలోని చాలా దేశాల్లో ఎన్నికల తర్వాత ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ, ఈ దేశ ప్రజలు మమ్మల్ని నమ్మి మూడోసారి అవకాశమిచ్చారు. గత ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పాలసీలు తీసుకొచ్చాయి. ఆ పరిస్థితిని మేం పోగొట్టాం. ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాం. మా విధానాలతో ప్రజలను ఆశావహ దృక్పథం వైపు నడిపిస్తున్నాం. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే అనే మంత్రంతో మా ప్రభుత్వం ముందుకుసాగుతోంది. ప్రజల కోసం ఎక్కువగా ఖర్చు చేయాలి. ప్రజల కోసం ఎక్కువగా పొదుపు చేయాలనేదే మా విధానం' అని మోదీ వివరించారు.

175 సీట్లు గెలుస్తాం

అజిత్ పవార్ ధీమా

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార 'మహాయుతి' కూటమి గెలుపు తథ్యమని, మూడు పార్టీలు కనీస ఉమ్మడి కార్యక్రమంతో రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాయని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చెప్పారు. నవంబర్ 20న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి 175 సీట్లు గెలుచుకుంటుందని శనివారం ఇక్కడ ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. బారామతి నియోజకవర్గం నుంచి తాను కనీసం లక్ష ఓట్ల అధిక్యంతో గెలుస్తానని ఎన్‌సీపీ అధినేత ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాది రాజకీయాలు, దక్షిణాది రాజకీయాలు భిన్నంగా ఉంటాయని, మహారాష్ట్ర ఎన్నికలు పూర్తిగా భిన్నమైనవని అజిత్ చెప్పారు. 1985 నుంచి మహారాష్ట్రలో ఏ ఒక్క పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించలేదని, ఈసారి కూడా ఇదే పరిస్థితి ఉంటుందని అన్నారు. మహారాష్ట్రలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఎవరో ఒకరి సహాయం తీసుకోక తప్పదని అన్నారు. నవాబ్ మాలిక్‌కు టికెట్‌పై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ అది తన ఒక్కడి నిర్ణయం కాదని, కూటమి కలిసికట్టుగా టికెట్లు ఇచ్చిందని అజిత్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో 400 ప్లస్ సీట్లపై ఇచ్చిన నినాదంపై 'మహా వికాస్ అఘాడి' తప్పుడు ప్రచారం చేసిందని, ఇదే జరిగితే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లు ఆపేస్తారని, దేశాన్ని హిందూ దేశంగా ప్రకటిస్తారని తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేసిందని తప్పుపట్టారు. ఇలాంటివేవీ ఈ దేశంలో జరిగే ప్రసక్తే లేదన్నారు. పవార్ కుటుంబంలో చిచ్చుపై మాట్లాడుతూ ప్రభుత్వంలోకి వెళ్తామని ఎన్నోసార్లు శరద్ పవార్‌తో తమ ఎమ్మెల్యేలు చెప్పారని, ఆ సమయంలో ఆయన తన రిటైర్‌మెంట్ ప్రకటించి మళ్లీ వెనక్కి తీసుకున్నారని చెప్పారు. శరద్ పవార్ మనసులో ఏముందో ఎవరూ చెప్పలేరని, చివరకు సుప్రియా సూలే కూడా చెప్పలేరని అన్నారు. తాను వంచకుడినికాదని, తాను పార్టీలోనే ఉన్నానని, పార్టీ గుర్తు కూడా తనతోనే ఉందని, అసెంబ్లీ స్పీకర్ తమకు గుర్తు కేటాయించారని, ప్రస్తుతం ఇది సుప్రీంకోర్టు ముందు ఉందని అజిత్ పవార్ వివరణ ఇచ్చారు.

అంతర్జాతీయ సరిహద్దు వద్ద 16 డ్రోన్లు స్వాధీనం

చండీగఢ్ : పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద 16 డ్రోన్లను బోర్డర్ సెక్యూర్టీ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. గడిచిన వారం రోజులుగా ఆ డ్రోన్లను సీజ్ చేశారు. 16 కిలోల మత్తుపదార్థాలను కూడా బీఎస్ఎఫ్ దళాలు పట్టుకున్నాయి. ఆ దొంగ వ్యాపారం కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 15వ తేదీ వరకు 16 డ్రోన్లను కూల్చివేసినట్లు అధికారులు చెప్పారు. అమృత్‌సర్, తార్న్ తరన్, గురుదాస్‌పూర్ సెక్టార్లలో ఆ డ్రోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ ఏడాది 216 డ్రోన్లను స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ భూభాగం నుంచి ఎగురుతున్న ఆ డ్రోన్లతో నార్కోటిక్ పదార్థాలు, ఆయుధాలు, నకిలీ కరెన్సీ సరఫరా చేస్తున్నారు.

సుఖ్‌బీర్ సింగ్ బాదల్ రాజీనామా

చండీగఢ్: శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్ష పదవికి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ రాజీనామా చేసినట్టు ఆ పార్టీ ప్రతినిధి డాక్టర్ దల్జీత్ సింగ్ చీమా వెల్లడించారు. ఇటీవల సిక్కు మత పెద్దలు సుఖ్‌బీర్‌ను టంకయ్యాగా నిర్ధారించారు. సిక్కు మత సూత్రాలు ఉల్లంఘించిన వారిని టంకయ్యాగా పేర్కొంటారు. ఆ కేసులో దోషిగా తేలిస్తే, ఆ మత ఆచారం ప్రకారం శిక్ష వేస్తారు. ఇటీవల సుఖ్‌బీర్ కుడి పాదానికి సర్జరీ కూడా జరిగింది. పార్టీ వర్కింగ్ కమిటీకి సుఖ్‌బీర్ సింగ్ రాజీనామా సమర్పించినట్లు దల్జీత్ సింగ్ తెలిపారు. దీంతో కొత్త అధ్యక్షుడి ఎన్నికకు మార్గం సుగమం అయినట్లు ఆయన చెప్పారు. తన నాయకత్వంపై నమ్మకం ఉంచిన పార్టీ నేతలకు, కార్యకర్తలకు సుఖ్‌బీర్ ధన్యవాదాలు చెప్పినట్లు తన ఎక్స్ ఖాతాలో దల్జీత్ వెల్లడించారు.

కాంగ్రెస్ గూటికి కేరళ బీజేపీ నేత

పలక్కాడ్: కేరళ బీజేపీ సీనియర్ నేత సందీప్ వారియర్ శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయన బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉన్నారు. బీజేపీలో సరైన గుర్తింపు, గౌరవం దక్కలేదన్న కారణంతోనే ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు. అయితే పలక్కాడ్ ఉప ఎన్నిక (నవంబర్ 20) నాలుగు రోజుల ముందే సందీప్ కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయంగా ఆసక్తి నెలకొంది. సందీప్ వారియర్ కాంగ్రెస్‌లో చేరడం పట్ల పీసీసీ అధ్యక్షుడు కె. సుధాకరన్, మరో కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ హర్షం వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఇక సిల్ట్ ఛాంబర్లు తప్పనిసరి...!

వాణిజ్య భవనాలతోపాటు నివాస సముదాయలకు సైతం

బహుళ అంతస్తు భవంతుల సీవరేజీపై జలమండలి దృష్టి

సీవరేజ్ పైపు లైన్ల అప్ గ్రేడ్‌కు సూచన

పైప్ లైన్‌లలో కరగని వ్యర్థాలు లేకుండా మురుగు పరుగెత్తాల్సిందే!

90 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్లో జలమండలి సరికొత్త ప్రయోగం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరిస్తున్న హైదరాబాద్ మహా నగరంలో భారీగా ఉత్పన్నం అవుతున్న మురుగు నీరు డ్రైనేజీ పైప్లైన్ల ద్వారా కరగని వ్యర్థాలు లేకుండా సాఫీగా పరుగెత్తించేందుకు జలమండలి శక్తి యుక్తులు ఒడ్డుతోంది. బోర్డు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజులు సీవరేజీ స్పెషల్ డ్రైవ్లో భాగంగా మ్యాన్హోల్ టు మ్యాన్హోల్ డీ-సిల్టింగ్లో డ్రైనేజీ పైప్లైన్ల నుంచి బయటపడుతున్న కరగని వ్యర్థాలు మురుగు ప్రవాహానికి అడ్డుపడి అవి ఓవర్ఫ్లో అవుతున్నట్లు జలమండలి గుర్తించింది. మురుగు నీటిలో కరగని వ్యర్థాలను ఎక్కడికక్కడే కట్టడి చేసేందుకు చర్యలకు ఉపక్రమిస్తోంది. ప్రధానంగా మురుగునీరు అధికంగా ఉత్పన్నమయ్యే హెటల్స్, రెస్టారెంట్స్, హాస్టల్స్, హాస్పటల్స్, మాల్స్, బేకరీలు తదితర బహుళ అంతస్తుల భవనాలతో పాటు.. బహుళ నివాస సముదాయాల సీవరేజీ కనెక్షన్లపై దృష్టి సారించింది. బహుళ అంతస్తుల భవన సముదాయంలో ఉత్పన్నయ్యే మురుగు నీరంతా ముందుగా సిల్ట్ ఛాంబర్లో చేరుతుంది. అందులో ఏవైనా ఘనపదార్థాలుంటే..

అక్కడ పడబోతతో అవి అక్కడే నిలిచి కేవలం మురుగు నీరు మాత్రమే డ్రై నేజీ పైప్లైన్లోకి కలుస్తుంది. ఇలా అయితే.. డ్రైనేజీలో మురుగు ప్రవాహానికి ఎలాంటి ఆటంకం ఉండదని బోర్డు భావిస్తోంది. ఇందుకోసం మురుగు అధికంగా ఉత్పన్నమయ్యే బహుళ అంతస్తులు, వాణిజ్య భవనాల సీవరేజ్ కనెక్షన్లకు సిల్ట్ ఛాంబర్లు తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. బహుళ అంతస్తు భవనాల వినియోగదారులు మురుగు కనెక్షన్లకు సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోకుంటే కఠినంగా వ్యవహరించాలని జలమండలి యోచిస్తోంది. ప్రధానంగా వాణిజ్య, బహుళ అంతస్తుల భవన సముదాయాల సీవరేజీ ట్రాప్ లైన్లలోనే అధికంగా మురుగులో కరగని వ్యర్థాలైన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, కొబ్బరి బొండాలు, బట్టలు, నాప్కిన్స్, డైపర్స్, ఇతర ప్లాస్టిక్ ఉత్పత్తులు మ్యాన్ హెూళ్లలో ఉండటం జలమండలి గుర్తించి.. దీన్ని తీవ్రంగా పరిగణించింది. అలాంటివి రాకుండా.. వాటిని సిల్ట్ ఛాంబర్లకే పరిమితం చేసి, మురుగు నీరు మాత్రమే పైప్లైన్లో కలిసే విధంగా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా హైదరాబాద్ను తీర్చిదిద్దే యజ్ఞంలో నగర వాసులందరూ భాగస్వాములు వాలి. మురుగు నీటిలో కరగని వ్యర్థాలను వేయకూడదు. ఆసుపత్రులు, హెూటళ్లు, బేకరీలు, మాల్స్, తదితర వాణిజ్య, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు సిల్ట్ చాంబర్లు ఏర్పాటు చేసుకొని వాటిద్వారా సీవరేజ్ కనెక్షన్లను ప్రధాన డ్రై నేజీ పైప్లైన్లకు అనుసంధానం చేసుకోవాలి. పైప్లైన్లలో కరగని వ్యర్థాలు చేరకపోతే మురుగు నీటి ప్రవాహం సాఫీగా ఉంటుంది. హైదరాబాద్ మనందరి సిటీ. అలాంటి నగరంలో డ్రైనేజీ ఓవర్ ఫ్లో కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సైతం నగరవాసులపై ఉంది.

సీవరెజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్ లో ఇప్పటి వరకు 65 వేల మ్యాన్ హెూల్స్ శుభ్రం చేశారు. దీంతో పాటు 8 వేల ప్రాంతాల్లో 930 కిలో మీటర్ల మేర సీవరెజ్ పైపు లైన్ ను డీ-సిల్టింగ్ పనులు నిర్వహించారు. ఈ ఘనత సాధించినందుకు అధికారులు, సిబ్బందిని ఎండీ అశోక్ రెడ్డి అభినందించారు. ఇదే స్ఫూర్తిని స్పెషల్ డ్రైవ్ ముగింపు వరకు కొనసాగించాలని సూచించారు.

ఇసుక కొరత లేకుండా చూడాలి : ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం జిల్లా కలెక్టర్, మైనింగ్ ఎడి, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు, ఇంటి నిర్మాణాలకు సంబంధించి ప్రస్తుతం ఇసుక కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత మీ పైన ఉందని రెవెన్యూ మున్సిపల్, మైనింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, మైనింగ్ ఎడి సంజీవ్ కుమార్, మున్సిపల్ డిఇ బస్వరాజు పాల్గొన్నారు.

సచివాలయంలో ఫైర్ సర్వీసెస్ మాక్ డ్రిల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించడంతో పాటు, అగ్నిప్రమాదంపై అవగాహన పెంచేందుకు సచివాలయంలోని ఫైర్ సర్వీసెస్ డిపార్ట్ మెంట్ శనివారం డా.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఎస్పీఎఫ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. గతంలో తెలంగాణ స్పెషల్ పోలీసుల రక్షణలో ఉన్న సచివాలయం భద్రతను ఇటీవల ఎస్పీఎఫ్‌కి అప్పగించబడింది. జీవి.ప్రసాద్, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జన్య, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎ.యాదయ్య, ప్రాథమిక అగ్నిమాపక అవగాహన, ఫైర్ ఎక్స్ టింగ్విషర్లు, ఫిక్స్‌డ్ ఫైర్ ఇన్‌స్టాలేషన్‌లను ఎలా ఉపయోగించాలనె అంశాన్ని వివరించారు. ఫైర్ సేఫ్టీ నివారణతో సహా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ప్రజలను తరలించే విధానాల గురించి అగ్నిమాపక అధికారులు ఎస్పీఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. బ్రొంటో స్కై లిఫ్ట్ ద్వారా టెర్రస్ నుండి ఎలా రక్షించాలో, శ్వాస వ్యాయామాలు, కృత్రిమ శ్వాసక్రియతో కూడిన పద్ధతిని ఎస్పీఎఫ్ సిబ్బందికి ప్రదర్శన ద్వారా వివరించడం జరిగింది.కార్యక్రమంలో సచివాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేవదాస్, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ జనరల్ బాడీ కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ శేరిలింగంపల్లి కార్యాలయంలో కే చందు యాదవ్ అధ్యక్షతన సిపిఐ శేరిలింగంపల్లి మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్‌లో ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. శేరిలింగంపల్లిలో ఇల్లు లేని నిరుపేదలు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కి 1200 మంది కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అప్లికేషన్లు చేసుకున్నారు. వారికి ఇండ్లు వచ్చేవరకు పోరాడుతామని అన్నారు. నియోజకవర్గం లో ఉన్నటువంటి ప్రతి ఒక్కరికి సొంతింటి కలలను నెరవేర్చే వరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఎప్పటికప్పుడు పోరాటాలూ చేస్తా ఉంటామని, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ శేర్లింగంపల్లి నియోజకవర్గం. వచ్చే స్థానిక కార్పొరేటర్ ఎలక్షన్‌లో పది కార్పొరేటర్ స్థానాల్లో పోటీ చేస్తామని అన్నారు. సిపిఐ నాయకులు సిద్ధంగా ఉండాలని చెప్పారు స్థానిక కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి సెలబ్రేషన్ జరుపుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత కుల పోరాట సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటస్వామి కమిటీ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి సహాయ నిధి అనే పథకం నిరుపేదలకు గొప్ప వరం లాంటిదని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కొలన్ హన్మంత్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజూరైన బాధితులకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 60,000ల ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించారు. 125,126,131 డివిజన్‌లకు చెందిన వాసులు మలరావు, కర్రీ సత్యనారాయణ, వీణ, లక్ష్మమ్మ రూ.60,000 సహాయనిధి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారందరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని, పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, బోయిని వెంకటేష్, డివిజన్ అధ్యక్షులు లాయక్, గణేష్, నాయకులు జీవన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, బుచ్చి రెడ్డి వేణు గౌడ్, గఫ్ఫార్, మధుసూదన్ రెడ్డి, అజయ్, అరుణ్, ప్రశాంత్ రెడ్డి, శ్యామల, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల (సమగ్ర ఇంటింటి కుటుంబ) సర్వేకు సజావుగా సాగుతుందని, ప్రజలందరూ సృహద్భావంతో సహకరిస్తున్నారని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం బేగంపేట్ లోని మయూర్ మార్గ్ వీధిలోని కట్ట జయరాం బాబురావు, కట్ట మారమ్మ ఇంటిలో నిర్వహించిన ఇంటింటి సర్వే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సర్వేకు సంబంధించిన రికార్డులను, ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి సర్వే ముఖ్య ఉద్దేశం ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు ఇతర బలహీన వర్గాల అభ్యున్నతికై వివిధ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు తయారు చేయడం వాటిని అమలం చేయదు కోసం ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తుందన్నారు. సర్వేకు ప్రజలందరూ సృహద్భావంతో సహకరిస్తున్నారని, సర్వే ప్రశాంతంగా జరుగుతుందని. అన్నారు. సర్వే క్వాలిటీగా జరగాలని అధికారులను కలెక్టర్ సూచించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డిఓ సాయిరాం, జిహెచ్ఎంసి బేగంపేట్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, సూపర్వైజర్ ఎస్ ఎన్రిక్, ఎస్ ఎఫ్ ఓ సాయినాథ్, సి ఓ దయాకర్, వార్డ్ అధికారి అండాలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సెప్టెంబర్ 17, 18న జరగనున్న టీజీపీఎస్సీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినవని, అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో గ్రూప్-3 పరీక్షను తేది 17.11.2024 నఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం12.30 గంటల వరకు పేపర్ 1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష ఉంటుందని (పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారు) అదేవిదంగా సాయంత్రం 3.00 గంటల నుండి 5.30 గంటల వరకు పేపర్ -2 హిస్టరీ, పోలిటి అండ్ సొసైటీ పరీక్ష ఉంటుందని అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు సకాలంలో హాజరు కావాలని తెలిపారు. 18న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్మెంట్ పరీక్ష ఉన్నందున పరీక్షకు హాజరు అయ్యే అభ్యర్థులు సకాలంలో రావాలని తెలిపారు. అభ్యర్థులు అందరు ఉదయం 8:30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అలాగే హాల్ టికెట్స్, ఒరిజినల్ ఐడి గుర్తింపు కార్డులు తప్పక వెంట తెచ్చుకోవాలని, సెల్ ఫోన్స్, క్యాలిక్యులేటర్‌తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రం జారీ ప్రక్రియ సులభతరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నూతన భవన నిర్మాణదారులకు జలమండలి శుభవార్త చెప్పింది. కొత్తగా భవనాలు నిర్మించుకునే వారు జీహెచ్ఎంసీ అనుమతుల కోసం సమర్పించాల్సిన వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే ప్రక్రియను జలమండలి సులభతరం చేసింది. గ్రేటర్ పరిధిలోని నూతన భవనం నిర్మించాలంటే జీహెచ్ఎంసీ పర్మిషన్ తప్పనిసరి. ఆ పర్మిషన్ కోసం భవన యజమానులు విద్యుత్ ఫీజబిలిటీ తో పాటు జలమండలి జారీ చేసే వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రం సమర్పించాలి. గతంలో ఈ సర్టిఫికెట్స్ పొందాలంటే జలమండలి సర్కిల్ కార్యాలయాల్లో సీజీఎం జారీ చేసేవారు. వివిధ కారణాల రీత్యా ఈ ప్రక్రియలో జాప్యం జరిగేది. దీన్ని నివారించి, ఆ ప్రక్రియను సులభతరం చేయడానికి ధ్రువపత్రాల జారీని జలమండలి కేంద్ర కార్యాలయం నుంచే చేపట్టేలా మార్పులు చేశారు. ఇందుకోసం వాటర్ ఫీజబిలిటి ధ్రువపత్రాలు జారీ చేయడానికి జలమండలి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వినియోగదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ధ్రువపత్రాలు జారీ చేస్తుంది. ఈ ధ్రువపత్రాల కోసం వినియోగదారులు ముందుగా సంబంధిత తమ దగ్గర్లోని సీజీఎంలకు దరఖాస్తులు సమర్పించాలి. వారు 6 రోజుల పాటు వాటిని పరిశీలించి.. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఉన్న కమిటీకి పంపిస్తుంది. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వినియోగదారులు 30 రోజుల్లోగా సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుల్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నిర్దేశిత 5 రోజుల్లో (పని దినాలు) రెవెన్యూ విభాగ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ధ్రువపత్రాల్ని జారీ చేస్తారు. దీనివల్ల భవనాలు నిర్మించుకునే వాళ్లకు పని, ధ్రుపత్రాల విషయంలో ఆలస్యం జరగకుండా ఉంటుంది. ఈ కమిటీ ద్వారా ఈ నెలలో ఇప్పటికే 19 వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రాల్ని జారీ చేశారు.

మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ తెలంగాణ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.మండ సదాలక్ష్మి, భారత జాతీయ మహిళా సమాఖ్య కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కిన్నెర మల్లవ్వ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో పశ్య పద్మ, డాక్టర్ సదాలక్ష్మి, కొట్టె అంజలి, గరిగే శారదలు మాట్లాడారు. పశ్య పద్మ మాట్లాడుతూ మహిళలకు రాష్ట్ర శాసనసభల్లో, పార్లమెంట్ ఉభయ సభల్లో 50% రిజర్వేషన్ కల్పించాలని భారతదేశ మహిళలు 27 సంవత్సరాలకు పైగా పోరాడి సాధించుకున్నారు. కేంద్ర బిజెపి పాలకుల నిర్లక్ష్యాన్ని సవాల్ చేస్తూ భారత జాతీయ మహిళా సమాఖ్య సుప్రీంకోర్టులో కేసు నమోదు చేసింది. దేశవ్యాపిత మహిళా ఉద్యమాలు పోరాటాలు పాలకులపై ఉంచిన ఒత్తిడి, సుప్రీంకోర్టులో నమోదైన కేసు ప్రభావం పార్లమెంటులో చట్టం చేయక తప్పని పరిస్థితి అయింది. మహిళా రిజర్వేషన్ల చట్టం 2023ను అమలు చేయటానికి కేంద్ర పాలకులు జనగణన, నియోజకవర్గాల పునర్విభజన చేయాలంటూ కుంటి సాకులు చెప్తున్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టం 2023 అమలు చేయడంలో కేంద్ర పాలకులు పెట్టిన రెండు షరతులను ఉపసంహరించుకో వాలని పశ్యపద్మ డిమాండ్ చేశారు. సమావేశ ప్రారంభంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జెండాను డాక్టర్ సదా లక్ష్మీ ఎగురు వేశారు. కేంద్ర పాలకులు పెట్టిన షరతులను తొలగించేంత వరకు పోరాటాలను ఉధృతం చేయాలని డాక్టర్ సదాలక్ష్మి పిలుపునిచ్చారు. సెమినార్ అనంతరం జరిగిన నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో 9 మండలాల నుంచి పాల్గొన్న నాయకులు మహిళా సమాఖ్య సభ్యత్వం, గ్రామ మండల కమిటీల ఏర్పాటు గురించి చర్చ చేశారు. జిల్లా కమిటీలోకి నూతనంగా కమిటీ సభ్యులను తీసుకోవడం జరిగింది. గత కమిటీలో ఉన్న అధ్యక్ష కార్యదర్శులతో పాటు శారదను జిల్లా కార్యదర్శిగా పట్టణ కార్యదర్శిగా ఎలిసెట్టి స్వప్నను ఎన్నుకోవడం జరిగింది. అధిక సంఖ్యలో పాల్గొన్న యువ మహిళలను జిల్లా కమిటీలోకి తీసుకోవటం జరిగింది. డిసెంబర్ 14 15 తారీకులలో రాజకీయ శిక్షణ తరగతులను కరీంనగర్లో నిర్వహించటానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది.

సిఎం నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్ ఎస్వీ నగర్ కాలనీలో సిఎం నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయి. ఉప్పల్ కాంగ్రెస్ ఇంఛార్జి మందుముల పరమేశ్వర రెడ్డి సహకారంతో, గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనీల్ కుమార్ చొరవ తీసుకొని సిఎం నిధులతో పనులు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాల ప్రజలకి అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు అందించేందుకు పని చేస్తుందని నెమలి అనీల్ అన్నారు. శనివారం ఎస్వి నగర్ కాలనీ అధ్యక్షులు నెమలి రవి కుమార్‌తో కలిసి సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు నెమలి అనీల్ కుమార్ పరిశీలించారు. గత కొద్ది సంవత్సరాలుగా దారి నిర్మాణ పనులు చేపట్టాలని కాలనీ వాసులు విన్నపం మేరకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాలనీ సమస్యల పరిష్కారానికై కృషి చేయలని కాప్రా ఈఈ నాగేందర్‌ని ఈ సందర్భంగా కోరడం జరిగింది. జిహెచ్ఎంసి వర్కింగ్ ఇన్స్పెక్టర్ బిక్షపతి, కాంట్రాక్టర్ సదానంద్, రాజేష్, శ్రీనివాస్, యాదగిరి, కిషోర్, గాంధీ, హరి, వెంకట్, స్థానికులు పాల్గొన్నారు.

సర్వే ప్రొఫార్మాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రతిరోజు ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను ట్రంకు పెట్టెలలో పెట్టి గ్రామ పంచాయతీ, మండల కార్యాలయాలలో భద్రపరచాలని, ప్రొఫార్మల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యాన్ని సహించేది లేదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు ఎంపిడిఓలను ఆదేశించారు. శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా మేడ్చెల్ మండలంలోని రాజబొల్లారం, పూడురులలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబాల వివరాల సేకరణను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఏరోజుకారోజు ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను ఎన్యుమరేటర్ల వారిగా ట్రంకు పెట్టెలలో పెట్టి గ్రామపంచాయతీ, మండల కార్యాలయాలలో భద్రపరచాలని అన్నారు. ప్రొఫార్మల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేసారు. ఎన్యుమరేటర్ల నమోదు ప్రక్రియ పూర్తైన వెంటనే ఆపరేటర్ల ద్వారా కంప్యూటర్లలో అప్ లోడ్ చేయించాలని ఎంపిడిఓలకు సూచించారు. ఎన్యుమరేటర్లు దగ్గరుండి ఆపరేటర్ల ద్వారా తప్పులు జరుగకుండా జాగ్రత్తగా అప్ లోడ్ చేయించాలని కలెక్టర్ తెలిపారు. ప్రొఫార్మాల నమోదులో ఏలాంటి తప్పులు జరుగకుండా చూసుకోవాలని, ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను సూపర్ వైజర్లు, నోడల్ అధికారులు తప్పకుండా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చెల్ తహసీల్దారు శైలజ, ఎంపిడిఓ, సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : నేరేడ్ మెట్ డివిజన్ యాప్రాల్ ప్రాంతంలోని పటేల్ ఎంక్లేవ్ వాసులు సి.సి.రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతూ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో మాట్లాడి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి బల్దియా కమిషనర్‌కి పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరదరాజన్, హెచ్.వి.రావు, కేశవ రెడ్డి, శ్యాం, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీక్స్ నుండి సొంపు కలర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్ట్రీక్స్, హైజీనిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి కొత్తగా సొంపు కలర్ ను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని డైనమిక్ సౌత్ ఇండియన్ మార్కెట్‌లు తెలంగాణ, కర్ణాటకలో ప్రవేశ పెట్టడానికి ఉత్సాహంగా ఉందని సంస్థ ఎండి.సీఈఓ దిరజ్ అరోరా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెయిర్ కలర్ సెగ్మెంట్‌లో వృద్ధికి దక్షిణ భారతదేశం కీలకమైన డ్రైవర్‌గా ఎదుగుతోందన్నారు. కేవలం రూ.10కి వినియోగదారులకు అనుకూలమైన, సహేతుకమైన ధరకే హెయిర్ కలర్ సొల్యూషన్‌ను అందించడం ద్వారా మార్కెట్‌ను మెరుగుపరిచేందుకు మేము సంతోషిస్తున్నామన్నారు. సంస్థ వైస్ ప్రెసిడెంట ప్రియాంక పూరి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని కస్టమర్‌లకు వినూత్నమైన హెయిర్ కలర్ ను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని మేము ఆశిస్తున్నామన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: 38వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ క్యోరుజి 13వ పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 పోటీలను ప్రారంభించిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేన రెడ్డి, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 16 నుండి రేపు 17వ తేదీ వరకు నిర్వహించనున్న 38వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ క్యోరుజి 13వ పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివ సేన రెడ్డి, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తైక్వాండో, కరాటే, కుంపు, లాంటి క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని, అలాగే స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంచుతాయని అన్నారు. ముఖ్యంగా ఆడ పిల్లల తలిదండ్రులు ఇలాంటి క్రీడలు నేర్చుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. పాల్గొన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల రెండవ మహాసభ నేడు

విశాలాంధ్ర - కొత్తూరు : శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో నేడు (ఆదివారం) ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల మొదటి మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి శనివారం పిలుపునిచ్చారు. ఈ మహాసభ ఏర్పాట్ల విషయమై శంషాబాద్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పామిడి శేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దత్తు నాయక్, జిల్లా కార్యదర్శులు కే చంద్ర యాదవ్, వడ్ల సత్యనారాయణ, ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర నాయకురాలు జే పద్మ, జిల్లా కార్యవర్గ సభ్యుడు సక్రు నాయక్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ ఏఎన్ఎంలు రాష్ట్రంలో సుమారు 7000 మంది ఉంటారు. వీరిని 18 సంవత్సరాలుగా వారితో పనులు చేయించుకొని ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేయకపోవడం బాధాకరమని ఆయన విమర్శించారు. ఏఎన్ఎంలు చేస్తున్న శ్రమతో ప్రభుత్వాలకు అనేక రకాల అవార్డులు వస్తున్నాయి కానీ వీరికి మాత్రం ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎన్ఎంల సమస్యలు ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభకు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి ఏఎన్ఎం ప్రతినిధులు హాజరవుతారని, ఈ మహాసభకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొటారని వారు పేర్కొన్నారు.

రామ్మూర్తి నాయుడు మృతికి సంతాపం

విశాలాంధ్ర - అమనగల్లు : ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి పట్ల టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి అండే కార్ యాదిలాల్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ప్రజల సంక్షేమం కోసం రామ్మూర్తి నాయుడు చేసిన కృషి చిరస్మరణీయమని యాదిలాల్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా చంద్రగిరి నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివి అన్నారు.

పుప్పాలగూడలో భారీ అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మణికొండ పరిధిలోని పుప్పాలగూడలో శనివారం తెల్లవారు జామున 3.30 గంటల ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గోల్డెన్ ఓరియో అపార్ట్‌మెంట్‌లోని మూడో అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటలు ఒక్కసారిగా ఎగిసిపడటంతో అపార్ట్‌మెంట్ వాసులు భయంతో పరుగులు పెట్టారు. మంటల కారణంగా అపార్ట్‌మెంట్‌లోని వంటగదిలో ఉన్న సిలీండర్ సైతం పేలడంతో మంటల తీవ్రత మరింత పెరిగింది. ఫ్లాట్‌లోని ఐదుగురు కుటుంబ సభ్యులు బయటకు వచ్చి ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ ఘటనలో ఫ్లాట్ పూర్తిగా దగ్ధమైనట్లు తెలుస్తోంది. భారీ మొత్తంలో ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం. అపార్ట్‌మెంట్‌లో మంటలు వ్యాపించిన వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మూడు అగ్నిమాపక శకటాలతో వారు వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అయితే, అపార్ట్ మెంట్ వద్ద ఫైర్ ఇంజిన్ పోవడానికి దారి లేకపోవటంతో గంటసేపు అగ్నిమాపక సిబ్బంది శ్రమించారు. నిబంధనలకు విరుద్ధంగా అపార్టుమెంట్ నిర్మాణం ఉండటంతోనే ఫైర్ ఇంజిన్లు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని స్థానికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది తమ ప్రయత్నాలు చేసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అపార్ట్‌మెంట్‌లో దాచుకున్న డబ్బులు, దుస్తులు, విలువైన సామాగ్రి కాలి బూడిదయ్యాయి. పోలీసులు ఘటన స్థలంకు చేరుకొని దర్యాప్తు చేప్టటారు. ఫ్లాట్‌లో షార్ట్ షర్క్యూట్ కారణంగానే మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది.

కొత్త ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ఏర్పాటుపై దృష్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలో సభ్యత్వం లేని అర్హులైన మహిళలను గుర్తించి కొత్త ఎస్.హెచ్.జి గ్రూపులను ఏర్పాటు చేయాలని తెలిపారు. శనివారం ఎం ఏ యు డి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన జిహెచ్ఎంసి, మెప్మా అధికారులతో స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ టార్గెట్, లక్ష్యసాధన, కొత్త గ్రూపుల ఏర్పాటు, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ కార్యకలాపాల అభివృద్ధి తదితరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త మహిళా సంఘాల ఏర్పాటుతో పాటు పాత సంఘాలను పటిష్ట పరిచేందుకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేరడానికి ప్రోత్సహించాలని, ఇప్పటికీ సభ్యులుగా లేని మహిళలను గుర్తించాలని తెలిపారు. డిసి లు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశాలు నిర్వహించి కొత్త ఎస్.హెచ్.జి లను ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధించడంలో మహిళల భాగస్వామ్యం కీలకమని, స్వయం సహాయక సంఘాల ఏర్పాటుతో మహిళా ఆర్థిక స్వావలంబనకు, మహిళల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. టి.ఎం.సిలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్.పి లు, జిహెచ్ఎంసి పి.డి లు, మెప్మా ప్రాజెక్ట్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ నిర్వహించాలన్నారు. డిసెంబర్, 2024 మాసాంతానికి కొత్త ఎస్.హెచ్.జిలను ఏర్పాటు చేసి కొత్త సభ్యుల నమోదు పూర్తి చేయాలన్నారు. కొత్త ఎస్.హెచ్.జిలను ఏరియా లెవల్ ఫెడరేషన్లు, టౌన్ ఫెడరేషన్లకు అటాచ్ చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు నిర్దేశిత లక్ష్యాల మేరకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించాలని కోరారు. లక్ష్య సాధనకు నెల వారీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, జీహెచ్ఎంసీ బ్యాంకు లింకేజీ ద్వారా నెలకు కనీసం 200 కోట్ల రూపాయల రుణాలు అందించాలన్నారు. మెచ్యూరిటీ ఎస్ హెచ్ జి గ్రూపులలో బిజినెస్ ఓరియంటేషన్ తీసుకురావాలని, మహిళలను వ్యాపారాల వైపు దృష్టి సారించేలా ప్రోత్సహించాలని సూచించారు. బ్యాంకర్స్‌తో వర్క్ షాప్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అభివృద్ధికి స్థానిక ఎన్.జి.ఓ లను, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్‌లను గుర్తించాలన్నారు. డి.సి, పి.డి ల స్థాయిలో ఎన్.జి.ఓ ల మ్యాపింగ్ జరగాలని తెలిపారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, సి.ఎస్.ఓ లు, ఎన్.జి.ఓ లు, బ్యాంకర్లు, ఏ.సి.ఎల్.బి లు, పి.డి లకు వర్క్ షాప్ నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ 7, 8, 9వ తేదీలలో ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించే

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లేడు, చౌదరి గూడెం, కొందుర్గ్, కేశంపెట్, ఫరూఖ్ నగర్, షాద్ నగర్ టౌన్ 117 మంది లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ పథకం నుండి 35 లక్షల 38 వేల 500 రూపాయల విలువ చెక్కులను నందిగామ మండలంనికి 26 మందికి కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ రూ. 26 లక్షల 3,116 విలువగల చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిలుస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సీఎంఆర్ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ వాటిని కూడా మంజూరు చేశామని అన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరఫున బాధ్యతగా నేరుగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో పార్టీలకు అతీతంగా పంపిణీ చేసామని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండల పార్టీ అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం కొత్తూరులో :

నిరుపేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్ నగర్ క్యాంపు కార్యాలయంలో నందిగామ, కొత్తూరు మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేద ప్రజలకు ఒక గొప్ప వరమని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. విడుతలవారిగా సంక్షేమ పథకాలను అమలుపరిచి గత పాలకుల చేతుల్లో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రజల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నా రని కొనియాడారు. నందిగామ తహసిల్దార్ రాజేశ్వర్, ఆర్ఐ శ్రీనివాస్ గౌడ్, కొత్తూరు ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ నందిగామ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహ యాదవ్, మాజీ ఎంపిటిసిలు కుమారస్వామి గౌడ్, కొమ్ము కృష్ణ, సీనియర్ నాయకులు బాబర్ ఖాన్, నరసింహ, శంకరయ్య, బుచ్చయ్య, రవీందర్ గౌడ్, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేద స్పెషాలిటీ ఆయుర్వేదిక్ హాస్పిటల్ వార్షికోత్సవం

విశాలాంధ్ర - మేడిపల్లి : ఆయుర్వేదం అంటే కేవలం వైద్య పద్ధతి కాదు, ఇది మన జీవనశైలిని మార్చే మార్గం అని బీఆర్ఎస్ నాయకులు జక్క వెంకట్ రెడ్డి అన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఆయుర్వేద వైద్యం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన వేద స్పెషాలిటీ ఆయుర్వేదిక్ ఆసుపత్రి 4వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉదయం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్ శ్రీ సాయి నగర్ కమ్యూనిటీ హాల్ నందు ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ప్రారంభించారు. హెల్త్ క్యాంప్‌లో జనరల్ మెడిసిన్స్, బీపి, మధుమేహం, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, గ్యాస్ట్రో, ఎంటిరాలజీ, ఈ.ఎన్.టి పరీక్షలు, 150 మందికి 2000రూ,, విలువ గల బిఎండిలు నిర్వహించి 200 మందికి ఉచిత ఆయుర్వేద మందులను పంపిణీ చేసారు. బీఆర్ఎస్ నాయకులు జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ద్వారా పంచకర్మ ఆయుర్వేద వైద్య పద్ధతుల గురించి తెలుసుకోవచ్చు, ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందవచ్చు. ఆయుర్వేదం అనేది శరీరాన్ని, మనసును, ఆత్మను సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది. నిత్యం ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి, లేదా శక్తి తగ్గుదల వంటి సమస్యలను తగ్గించి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు అవసరమైన ప్రత్యేకమైన చికిత్సలు, ఆయుర్వేదిక ఔషధాలతో జీవనశైలిలో మార్పులు పొందగలుగుతారన్నారు. డా. కే.అంజిరెడ్డి మాట్లాడుతూ అనవసరంగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకోవడం కంటే, ఆయుర్వేద వైద్యాన్ని అవలంబించడం ద్వారా మన ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవచ్చు. మన చుట్టూ ఉన్న అనేక రోగాల నుంచి ఉపశమనం పొందాలంటే, ఆయుర్వేద వైద్యాన్ని నమ్మండి. ఇది మనకు ఆరోగ్యంగా ఉండటానికి, ఆనందంగా జీవించటానికి సహాయపడుతుంది. ఈ కార్యక్రమంలో డివిజన్ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు రవీంద్ర చారి, హరిందర్ యాదవ్, రవీందర్ రెడ్డి, విజయ్, మధుసూదన్, మోహన్ రెడ్డి, రాజు, వేద హాస్పిటల్ చైర్మన్ కృష్ణ రెడ్డి వైద్యులు డా. జయచందర్, డా.ఎస్.అజయ్ దుర్గ ప్రసాద్, డా.బి.శివ, డా.విరాజిత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకులు దుర్భరంగా మార్చిన కాంగ్రెస్ : ఈటెల

విశాలాంధ్ర - జవహర్ నగర్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారులకు వచ్చిన తర్వాత పేదల బతుకులు దుర్భరంగా మారుస్తుందని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. శనివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెన్నాపురం చౌరస్తా బిజెఆర్ నగర్ వరకు 100 ఫీట్ల రోడ్డు విస్తరణలో ఇంటి స్థలాల భూములు నష్టపోయిన బాధితులను కలిసిన ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చే రూపాయి కూడా పెట్టి స్థలాలు కొనుక్కొని ఇల్లు కట్టుకుంటే ప్రభుత్వం, దుర్మార్గులు ఎప్పుడు వచ్చి కూల్చివేస్తారో, ఎక్కడ ఇబ్బంది పెడతారో అని, జీవో నెంబర్ 58, 59 కింద అనేకమంది డబ్బులు కట్టి రెగ్యులరైజ్ చేసుకున్నారు. ఆయన ఇప్పటికీ ప్రభుత్వం వారిని ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా మేము కూల్చి వేస్తాం దిక్కున్న చోట చెప్పకో అని అహంకారపూరితంగా అధికారులు మాట్లాడుతున్నారని, ఇప్పటికే హైడ్రా, మూసినది ప్రక్షాళన పేరిట పేదల ఇల్లు కులగొట్టారు. రేవంత్ రెడ్డి పేదల ఇల్లు కూలగొట్టే ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నాడు అని ఈటల అన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బిజెపి నాయకులు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న బాధితులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పునరుద్ధరణకు భూమిపూజ

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : నీటి నాణ్యతను మెరుగుపరచడం, జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'లేక్స్ ఆఫ్ హ్యాపీనెస్' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్లో రెండు చెరువుల పునరుద్ధరణకు పనులు ప్రారంభించారు. శేరిలింగంపల్లి దగ్గర మియాపూర్ టౌన్‌లో ఉన్న గురునాథ్ చెరువు, హఫీజ్‌పేట్‌లో ఉన్న ఖైదామా కుంట చెరువు పునరుద్ధరణకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెరువుల పునరుద్ధరణతో అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. కార్పొరేట్ సంస్థలు సేవా కార్యక్రమాలలో నిమగ్నం కావడం సంతోషదాయకం అన్నారు. ఈ సందర్భంగా నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ జయేన్ నాయక్ మాట్లాడుతూ నెక్సస్ 'లేక్స్ ఆఫ్ హ్యాపీనెస్' కార్యక్రమంలో భాగంగా చెరువుల పునరుద్ధరణను 2021లో ప్రారంభించిందన్నారు. పది చెరువులను పునరుద్ధరించాలన్న లక్ష్యాన్ని నెక్సస్ సెలెక్ట్ మాల్ నిర్దేశించుకుందని తెలిపారు. ఇప్పటి వరకు బెంగుళూరు, చెన్నై, మహారాష్ట్రలో ఎనిమిది చెరువులను విజయవంతంగా పునరుద్ధరించిందన్నారు. ఈ కొత్త ప్రాజెక్ట్‌తో 'లేక్స్ ఆఫ్ హ్యాపీనెస్' పది చెరువులకు విస్తరించబడిందన్నారు. ఇది లక్ష మందికి పైగా ప్రజల జీవన అభ్యున్నతికి, జంతువుల సంరక్షణకు, రైతుల జీవితాలలో మార్పునకు దోహదపడుతుందని ఆశిస్తున్నామన్నారు. ప్రజలు, ప్రకృతి శ్రేయస్సుకు సహకరిస్తూ, ఆరోగ్యకరమైన జీవనాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

కొత్త రకం వరి విత్తనం శ్రీఅన్నపూర్ణ

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : వ్యవసాయ రంగంలో ఐదు దశాబ్దాల పరిశోధన అనుభవం కలిగిన నూజివీడు సీడ్స్ లిమిటెడ్ సంస్థ కొత్తగా ఆవిష్కరించిన వరి విత్తనం ఎన్‌పి 7373 ఎన్ఎస్ఎల్ అన్నపూర్ణ'కు తెలంగాణ రైతులు జేజేలు పలుకుతున్నారు. ఈ కొత్త వరి వంగడంతో సాగై, నిండుగా ఉన్న వరికంకులను చూసి సంబరపడుతున్నారు. నూజివీడు సీడ్స్ సంస్థ, నల్గొండ జిల్లా పల్లి మండలం కోదండపురం గ్రామంలో రైతు వెంకటయ్యకు ఎన్‌పి 7373 ఎన్ఎస్ఎల్ శ్రీ అన్నపూర్ణ వరి విత్తనాలను శాంపిల్‌గా ఇచ్చి సాగు చేయించింది. ఆ పైరు ఇప్పుడు కోతకు వచ్చింది. బరువైన, పొడవాటి వరి కంకులతో చేను కనులనిండుగా కనిపిస్తోంది. ఆ పొలాన్ని రైతు సోదరులందరికీ చూపించేందుకు, నూజివీడు సీడ్స్ కంపెనీ కోదండపురం గ్రామంలో శనివారం 'మెగా ఫీల్డ్ విజిట్' నిర్వహించింది. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కొత్త వరి విత్తనం పనితీరును, ఫలితాలను ప్రత్యక్షంగా తిలకించారు. ఎన్‌పి 7373 ఎన్ఎస్ఎల్ శ్రీ అన్నపూర్ణ విత్తనం ఇంత అద్భుతంగా పండుతుందని తాను అస్సలు ఊహించలేదని, ఈ విత్తనాన్ని ప్రయోగాత్మకంగా సాగు చేసిన రైతు వెంకటయ్య చెప్పారు. శాంపిల్‌గా ఇచ్చిన ఆరు కేజీల విత్తనాలను ఆయన ఎకరం పొలంలో వేశారు. ఇప్పుడు, కోతకు వచ్చిన చేలో ఏపుగా, బలంగా, గొలుసుల్లా వేలాడుతున్న కంకులను చూసి వెంకటయ్య చాలా ఆనందంగా ఉన్నారు. ఎంత తక్కువ లెక్కించినా, ఎకరానికి 40 బస్తాలకు తక్కువ కాకుండా తీస్తానని ధీమాగా చెబుతున్నారు.

రాజ్యాంగ విలువలను పరిరక్షించడం న్యాయవాదుల కర్తవ్యం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేటి ఆందోళనకర పరిస్థితుల్లో భారత దేశ రాజ్యాంగ విలువలను పరిరక్షించడం న్యాయవాదుల కర్తవ్యం అని తెలంగాణ హైకోర్టు ప్రముఖ న్యాయవాది, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో న్యాయవాదులు విశేష కృషి చేశారని, భారతీయ సమాజం యొక్క చిత్రాన్ని స్థాపించడంలో ముఖ్యమైన పాత్ర పోషించిన న్యాయవాదులు భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో స్వాతంత్ర్య ఉద్యమానికి దోహదపడ్డారని గుర్తు చేసారు. హైదరాబాద్, సైఫాబాద్, హాంప్షైర్ హోటల్‌లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ గ్రేటర్ హైదరాబాద్ నగర 7వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల వివిధ కోర్టుల నుండి దాదాపు 300 న్యాయవాదులు ఈ మహాసభకు ప్రతినిధులుగా హాజరయ్యారు. ఐఏఎల్ గ్రేటర్ హైదరాబాద్ నగర అధ్యక్షులు ఏ.వి. కృష్ణ రావు అధ్యక్షత వహించగా మాజీ జిల్లా జడ్జి నడింపల్లి ఆనంద్‌రావు ముఖ్యఅతిథిగా హాజరుకాగా, బొమ్మగాని ప్రభాకర్ మహాసభను ప్రారంభించి ప్రసంగిస్తూ దేశంలోని ప్రజలకు మార్గనిర్దేశం చేసే భారత రాజ్యాంగం ఉపోద్ఘాతం న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వంతో పాటు దేశ సమగ్రత నేడు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేసారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్దన్, తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ అధ్యక్షులు వై. కొండల్ రెడ్డి, కుకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.గోవర్ధన్ రెడ్డి, సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.వసంత్ కుమార్, నాంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి. రాజవర్ధన్ రెడ్డి, సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి. హర్షవర్ధన్, కెవిఎల్, ప్రధాన కార్యదర్శి డి.జయశ్రీనివాస్, పాల్గొన్నారు.

లింకు రోడ్ల నిర్మాణంతో తగ్గనున్న ట్రాఫిక్ రద్దీ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుండిగల్: లింకు రోడ్ల నిర్మాణంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నియంత్రణతో పాటు రద్దీని తగ్గించవచ్చని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ పేర్కొన్నారు. హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ లింక్ రోడ్ల నిర్మాణంలో భాగంగా 29 కోట్ల రూపాయలతో చేపడుతున్న ఫాక్స్ సాగర్ - రాంరెడ్డి నగర్ ఇండస్ట్రియల్ ఏరియా లింక్ రోడ్డు పనులను ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హెచ్ఆర్డీసీఎల్ అధికారులతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ లింకు రోడ్ల నిర్మాణంతో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ తగ్గడంతో పాటు సమీప ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయి. ఈ లింకు రోడ్ల పనులలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, స్థానిక నాయకులు ఇస్మాయిల్, హెచ్ఆర్డిసిఎల్ సీఈ శ్రీనివాస్, ఈఈ విజయ్ కుమార్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి సురేందర్ రెడ్డి, న్యాక్ ఇంజనీర్ జయశ్రీ, విజయ్ కుమార్, విట్టలయ్య, హెచ్ఆర్డిసిఎల్ అధికారులు జెరెమయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అందరి దృష్టిని ఆకర్షించిన కామిక్ కాన్ ఈవెంట్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఫేమస్ లాజిస్టిక్స్, కామిక్ లవర్స్, కామిక్ సూపర్ హీరోస్ అభిమానులతో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ నిండి పోయింది. నగరంలో మరో అధునా తన ఫెస్టివల్ సంస్కృతికి కామిక్ కాన్ నిదర్శనంగా నిలిచింది. నగరంలోని శుక్రవారం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిం చిన అతిపెద్ద పాప్ కల్చర్ "హైదరాబాద్ కామిక్ కాన్ ఈవెంట్ అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇందులో భాగంగా పలువురు కాస్ ప్లేయర్లు విభిన్న కామిక్ రూపాల్లో దర్శనమిచ్చి వాన్ హైదరాబాద్ అనిపించారు. ఈ ఫెస్టో మొదటి రోజు కామిక్ బుక్స్, టీవీ, ఫిల్మ్స్ మాంగా, యానిమే, గేమింగ్, యానిమేషన్ కార్యక్రమాలు, వాటిని ప్రదర్శించే స్టాల్స్తో సందడి నెలకొంది. ఇందులో భాగంగా మారుతి సుజీకి ఎరీనా, వేదికలుగా హైదరాబాద్ కామిక్ థాన్ కాస్ ప్లే కాం టెస్టులు, కామిక్ బుక్ టీ రోల్ ఆవిష్కరణలు, ఇతర గేమింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఫెస్ట్ భాగంగా కామెడీ షోకేస్ స్టేజ్ ప్రద ర్శనలు యువతను నవ్వులతో ముంచెత్తాయి. కామిక్ స్టార్లను ప్రతిబింబించే దుస్తుల్లో డిజైన్ వేర్తో కాస్ ప్లేయర్లు హైలెట్‌గా నిలిచాయి. ట్రెండ్గా మారుతున్న ఈ ఈవెంట్లో దాదాపు రెండు వేలకు పైగా నగరవాసులు, కామిక్ లవర్స్ పాల్గొన్నారు. ఈ సందడి మరో 2 రోజులు కొనసాగనుంది. విజేతలకు 2 లక్షల ప్రైజ్ మనీ ఉండటం మరో విశేషం.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మేడిపల్లి : మేడిపల్లి మండలం పరిధిలో ఉన్న ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని శనివారం ఉదయం మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. మేడిపల్లి మండల పరిధిలో ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలనీ, ప్రభుత్వ అనుమతులు లేని విద్యాసంస్థల పేర్లు బహిర్గతం చేయాలనీ, ఆదివారం నాడు కూడా అనేక విద్యాసంస్థలు సెలవు యివ్వకుండా విద్యా సంస్థలను నడుపుతున్నారు. కొన్ని విద్యాసంస్థలు ఫీజులు చెల్లించని విద్యార్థులను పరీక్షలు రాయనివ్వకుండా అనేక యిబ్బందులకు గురి చేస్తున్నారు. కావున ఇటువంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు హరీష్ పాల్గొన్నారు.

మోటారు వాహనాల చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : కొత్త చట్టాల ప్రకారం లైసెన్సు లేకుండా ఇన్సూరెన్స్ లేకుండా మద్యం త్రాగి వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైన డ్రైవర్ తో పాటుగా వాహన యజమానికి పదేళ్ళ జైలు శిక్ష ఉంటుందనీ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎసిపి ఎన్ సిహెచ్ రంగస్వామి తెలిపారు. పట్టణంలోని బుగ్గారెడ్డి ఫంక్షన్ హాల్ ఆవరణలో ఎసిపి రంగస్వామి అధ్వర్యంలో పట్టణం లోని ప్రైవేటు టాక్సీ, ఆటో డ్రైవర్లకు కొత్తగా వచ్చిన బిఎన్ ఎస్ చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు పలు అంశాలపై సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలకు సంబందించి ఇన్సూరెన్స్ ప్రాధాన్యత, ఇన్సూరెన్స్ వలన కలిగే ప్రయోజనాలు, అదేవిధంగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రయోజనాల గురించి వారికి వివరించారు. కెపాసిటీకి మించి వాహనంలో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా వ్యక్తులు తారసపడినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ విజయ్ కుమార్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంవిఐ వాసు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్,పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి భారీ విరాళం

విశాలాంధ్ర - కొత్తూరు : షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం సితిలావస్థకు చేరడంతో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీసుకున్న గొప్ప నిర్ణయమని, భవన పునర్నిర్మాణానికి నేను సైతం అంటూ కొత్తూరు, నందిగామ ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్ ముందుకు వచ్చి రూ. లక్షల చెక్కుని శనివారం ఎమ్మెల్యే శంకర్‌కు అందజేశారు. విద్యార్థులకు అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, ఆయనకు తోడ్పాటునందిచడం సంతోశంగ ఉందని శివశంకర్ అన్నారు. గత పాలకులకు ఎవైన విరాళాలు వస్తే తప్పుదోవ పట్టాయని, ఎమ్మెల్యే శంకర్ నిర్ణయాలు అందరికి నచ్చి స్వయంగ దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ నందిగామ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు యాదవ్, నాయకులు శంకరయ్య గౌడ్, కుమారస్వామి గౌడ్, కొమ్ము కృష్ణ, కావలి కృష్ణ, జమ్రుద్ ఖాన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

నర్సు నిర్లక్ష్యంతోనే ఘోరం

- ప్రత్యక్ష సాక్షి ఆరోపణ
- యూపీ ఘటనపై దుమారం
- ఎన్ఐసీయూలో 10 మంది శిశువుల సజీవ దహనం
- మరో 17 మంది పిల్లల పరిస్థితి విషమం

ఝాన్సీ/లక్నో: ఉత్తరప్రదేశ్ ఝాన్సీలోని మహారాణి లక్ష్మీబాయి వైద్య కళాశాలలోని ఎన్ఐసీయూలో జరిగిన అగ్ని ప్రమాదంలో 10 మంది చిన్నారులు సజీవ దహనం కాగా మరో 17 మంది మృత్యువుతో పోరాడుతుండటం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. చిన్నారుల తల్లిదండ్రుల ఆక్రందనతో ఆసుపత్రి వద్ద విషాదం నెలకొంది. శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. సమాచారం అందిన వెంటనే ఆసుపత్రి యంత్రాంగం స్పందించి రెస్క్యూ సిబ్బందిని, అగ్నిమాపక దళాన్ని పిలిపించింది. వారు ఘటనాస్థలానికి చేరుకొనేసరికి మంటలు ఎగిసి పడుతుండటంతో కిటీల అద్దాల ధ్వంసం చేసి పిల్లలను కాపాడే ప్రయత్నాన్ని సిబ్బంది చేశారు. అయితే ఈ ఘోరానికి ఒక నర్సు నిర్లక్ష్యమే కారణమన్న ప్రత్యక్ష సాక్షి ఆరోపణ దుమారం రేపుతోంది. ఆసుపత్రి ఎన్ఐసీయూలో జరిగిన అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు ప్రాథమికంగా భావించారు కానీ వాస్తవం అది కాదని ప్రత్యక్ష సాక్షి చెప్పడం సర్వత్రా చర్చకు దారితీసింది. నర్సు ఐసీయూలో అగ్గిపుల్ల వెలిగించడంతోనే ఇంతటి విపత్తు సంభవించినట్లు ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న భగవాన్ దాస్ ఆరోపించారు. ఒక నర్సు ఆక్సిజన్ సిలిండర్‌కు పైప్ బిగిస్తున్న సమయంలో పక్కనే ఉన్న మరొక నర్సు అగ్గిపుల్ల వెలిగించినట్లు చెప్పారు. ఈ ప్రమాదానికి ఆమె నిర్లక్ష్యమే కారణమన్నారు. క్షణాల్లో మంటలు వ్యాపించాయని, తన కండువా కప్పి నలుగురు పిల్లలను కాపాడానని దాస్ తెలిపారు. ఇతరుల సాయంతో మరికొంత మంది చిన్నారులను కూడా కాపాడినట్లు వెల్లడించారు. మంటలు వ్యాపించి పొగ దట్టంగా కమ్ముకోవడంతో రోగులు, బంధువులు ప్రాణ భయంతో పరుగులు తీశారని, దీంతో తొక్కిసలాట జరిగి అనేక మందికి గాయాలయ్యాయన్నారు. సేఫ్టీ అలారాలు మోగలేదని, కాలం చెల్లిన అగ్నిమాపక పరికరాలు ఉండటంతో పసి ప్రాణాలు అగ్గికి ఆహుతయ్యాయని భగవాన్ దాస్ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. తన కుమారుడి కోసం ఆ సమయంలో తాను అక్కడే ఉన్నట్లు చెప్పారు.

పరిహారం ప్రకటించిన మోదీ, యోగి

బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం ప్రకటించాయి. మృతులకు రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు చొప్పున సీఎం యోగి ఆతిద్యనాథ్ ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోదీ కూడా పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు చొప్పున ప్రకటించారు.

మూడెంచల దర్యాప్తునకు యోగి సర్కార్ ఆదేశం

దోషులను ఉపేక్షించేది లేదని యూపీ ప్రభుత్వం తెలిపింది. ఈ ఘటనపై మూడెంచల దర్యాప్తునకు ఆదేశించింది. పరిస్థితులను ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఝాన్సీ డివిజనల్ కమిషనర్‌కు, డీఐజీ నుంచి నివేదికను కోరినట్లు చెప్పారు. మూడు స్థాయిల్లో దర్యాప్తు జరుతుందని, మొదట ప్రభుత్వ స్థాయిలో ఆరోగ్య శాఖ అధ్వర్యంలో; రెండవ దర్యాప్తు... పోలీసులు, అగ్నిమాపక దళం, జిల్లా యంత్రాంగం స్థాయిలో; మూడవది మెజిస్ట్రేరియల్ స్థాయిలో జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి బ్రిజేశ్ పాథక్ వెల్లడించారు. నిర్లక్ష్యం జరిగిందని తెలితే నిలదీస్తామని... ఎవరినీ వదిలిపెట్టమని చెప్పారు. చనిపోయిన 10 మందిలో ఏడుగురిని గుర్తించినట్లు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉన్న 17 మంది శిశువులను నాలుగు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించామన్నారు. వాత్సల్యాకు నలుగురు, మాతృత్వకు ముగ్గురు... లలిత్‌పూర్, మౌరాణిపూర్ ఆసుపత్రులకు ఒక్కొక్కరు చొప్పున పంపగా, మరో ఆరుగురు తమ తల్లులతో పాటు ఇదే ఆసుపత్రిలో ఉన్నారని బ్రిజేశ్ వెల్లడించారు. గుర్తుపట్టలేని మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఆసుపత్రి వద్ద విషాదం

పుట్టిన మూడు రోజులకు ఇంతటి భయానక పరిస్థితుల్లో తన మేనల్లుడు చనిపోవడాన్ని తట్టుకోలేకపోతున్నానని పవన్ రాజ్‌పుత్ అనే వ్యక్తి కన్నీటి పర్యంతమయ్యారు. పిల్లల తల్లిదండ్రుల రోదనలతో అక్కడ విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) సచిన్ మహార్ స్పందించారు. 'ఎన్ఐసీయూ వార్డులో మొత్తం 54 మంది చిన్నారులు ఉండగా వారిలో 10 మంది చనిపోయారు. మిగతా వారిని కాపాడగలిగాం. వారికి అత్యవసర చికిత్స అందుతోంది' అని చెప్పారు.

దోషులను కఠినంగా శిక్షించాలి: రాహుల్ గాంధీ

చిన్నారుల మరణాలపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. దోషులను ఉపేక్షించరాదని, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ వార్త కలిచి వేసిందని, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానంటూ ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఉత్తరప్రదేశ్‌లో ఒకదాని తర్వాత ఒకటిగా ఇలాంటి ఘటనలు జరుగుతుండటం అనేక ప్రశ్నలకు తావిస్తున్నాయి. ప్రభుత్వం, యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

యూపీ ప్రభుత్వ వైఫల్యమే...

ఎన్ఐసీయూలో శిశువుల సజీవ దహనంపై డి.రాజా

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ ఝాన్సీ మెడికల్ కాలేజీలో అగ్ని ప్రమాదం జరిగిన పది మంది నవజాత శిశువులు సజీవ దహనం కావడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా శనివారం విమర్శించారు. 'ఇది ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ వైఫల్యం. ఈ ఘోరానికి యూపీ సర్కార్‌దే బాధ్యత. ఇలాంటి ఘటనలు ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతాయి' అని రాజా వ్యాఖ్యానించారు. నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేస్తూ బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. దోషులను ఉపేక్షించరాదని రాజా అన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరు

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-మంగళగిరి: గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరుపేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ అన్నారు. శనివారం మంగళగిరి పట్టణంలోని నాలుగో వార్డు జెండా చెట్టు సెంటర్ వద్ద నిరుపేదల నుంచి నివేశ స్థలాల కోసం అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణానికి సిమెంటు, ఇసుక, ఇనుము, కంకరను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని జంగాల కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలం పేదల నివాసానికి ఏమాత్రం సరిపోదని చెప్పినా మొండిగా ముందుకెళ్లిందని తెలిపారు. ఇంటి నిర్మాణానికిచ్చే ఆర్థిక సాయం కూడా కేవలం రూ.1.80 లక్షలే ప్రకటించడంతో పునాదులు కూడా పూర్తి చేయలేమని పేదలెవ్వరూ ఇంటి నిర్మాణం చేపట్టలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు, పట్టాలు నిరుపయోగంగా మారాయని అన్నారు. కూటమి ప్రభుత్వం పట్టణాల్లో, గ్రామాలలో నివాసయోగ్యంగా, గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాలలో స్థలాలు గుర్తించి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, నాలుగో వార్డు శాఖ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ముక్కంటి, దొడ్డి ఈశ్వరరావు, దేవర వెంకటేశ్వర్లు, తోట శివశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నటి జెత్వానీ కేసులో విద్యాసాగర్‌కు బెయిల్ తిరస్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బాలీవుడ్ నటి కాదంబరి జెత్వానీ కేసులో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌కు సీఐడీ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బెయిల్ మంజూరునకు కోర్టు తిరస్కరించింది. గత ప్రభుత్వ హయాంలో తప్పుడు ఆరోపణలతో కేసు నమోదు చేయించి ఇబ్బందులకు గురి చేశారంటూ నటి జెత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కుక్కల విద్యాసాగర్‌పై కొద్ది రోజుల క్రితం కేసు నమోదు చేశారు. ఈ కేసులో సీనియర్ పోలీసు అధికారులు సస్పెండ్ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితుడైన కుక్కల విద్యాసాగర్ పరారవడంతో డెహ్రాడూన్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేసి తీసుకువచ్చారు. అతన్ని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి బదిలీ చేసింది. విద్యాసాగర్ బెయిల్ కోరుతూ సీఐడీ కోర్టును ఆశ్రయించగా, ఇటీవల రెండు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం బెయిల్ తిరస్కరించింది.

సాయుధ పోరాట యోధురాలు రాధమ్మ కన్నుమూత

భౌతికకాయంపై ఎర్రజెండా కప్పిన పువ్వాడ

విశాలాంధ్ర-ఖమ్మం: భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకురాలు, తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు పాటిబండ్ల రాధమ్మ (96) అనారోగ్యంతో పండితాపురంలో శనివారం కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. భారత మహిళా సమాఖ్య వ్యవస్థాపక సభ్యులలో ఆమె ఒకరు. సోదరుడు బోదేపూడి రామకోటేశ్వరరావు ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. వివాహం కాంగ్రెస్ పార్టీకి చెందిన పాటిబండ్ల రామలింగయ్యతో జరిగినా... తుదిశ్వాస వరకు ఆమె కమ్యూనిస్టుగానే జీవించారు. తన భౌతికకాయంపై ఎర్రజెండా ఉండాలనేదే ఆమె చివరి కోరిక. 26 ఏళ్ల క్రితం అనారోగ్యానికి గురై కోలుకున్న తర్వాత ఆమె ఎర్రజెండాను తన సొంత డబ్బులతో కొనుగోలు చేసి విలువైన వస్తువులతో పాటు భద్రపరుచుకున్నారు. ఎక్కడ ఉన్నా పువ్వాడ నాగేశ్వరరావు వచ్చి తన పార్థివదేహంపై ఎర్రజెండా కప్పిన తర్వాతే తన అంతిమ సంస్కారాలు నిర్వహించాలని కోరడంతో పాటు ఈ విషయాన్ని ఆయనకు కూడా తెలియజేసింది. తుదిశ్వాస విడిచారన్న విషయం తెలిసిన పువ్వాడ... పండితాపురం వెళ్లి ఆమె మృతదేహంపై ఎర్రజెండా ఉంచి నివాళులర్పించారు. రాధమ్మ మృతితో విప్లవోద్యమం ఓ చైతన్యవంతురాలిని కోల్పోయిందన్నారు. రాధమ్మ వ్యక్తిత్వం భావితరాలకు స్ఫూర్తి అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూల లతాదేవి, మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, సీపీఐ మండల నాయకులు ఎస్కే సలీం, శతకోటి సత్యనారాయణ, బిలుకూరు ప్రభాకర్రావు, జగ్గయ్య నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

రామ్మూర్తి నాయుడు మృతి

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం రద్దు చేసుకున్న చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు, సినీ నటుడు నారా రోహిత్ తండ్రి రామ్మూర్తి నాయుడు (72) మృతి చెందారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. 1994లో టీడీపీ నుంచి చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రామ్మూర్తి నాయుడికి భార్య ఇందిర, కుమారులు నారా రోహిత్, గిరీశ్ ఉన్నారు. ఢిల్లీలో ఉన్న చంద్రబాబు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనాల్సి ఉంది. ఈ వార్త తెలియగానే మహారాష్ట్ర పర్యటనను రద్దు చేసుకుని హైదరాబాద్ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. చంద్రబాబు వెంట కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ, ఎమ్మెల్సీ టీడీ జనార్థన్ ఉన్నారు. మరోపక్క చిన్నాన్న ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ తన కార్యక్రమాలను రద్దు చేసుకొని శనివారం ఉదయమే హైదరాబాద్ చేరుకున్నారు. ఆదివారం నారావారిపల్లెలో రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

తమ్ముడి ఆత్మకు శాంతి కలగాలి: చంద్రబాబు

'నా తమ్ముడు, చంద్రగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మమ్మల్ని విడిచి వెళ్లిపోయాడని బాధాతప్త హృదయంతో తెలియజేస్తున్నాను. రామ్మూర్తి నాయుడు ప్రజా జీవితంలో పరిపూర్ణ మనసుతో ప్రజలకు సేవలు అందించిన నాయకుడు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను' అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

పిన్ని... తమ్ముళ్లు ధైర్యంగా ఉండాలి: లోకేశ్

'చిన్నాన్న రామ్మూర్తి నాయుడు మృతి తీవ్ర విషాదం నింపింది. ఆయనతో నా చిన్ననాటి అనుబంధం కళ్ల ముందు కదలాడుతోంది. కన్నీటితో నివాళులు అర్పిస్తున్నా. ఇన్నాళ్లూ ఆయన మాకు కనిపించే ధైర్యం. ఇకపై చిరకాల జ్ఞాపకం. ఆయన ఆత్మకు శాంతి కలగాలి. అంతులేని దుఃఖంలో ఉన్న నా సోదరులు, పిన్ని ధైర్యంగా ఉండాలని కోరుతున్నాను' అని లోకేశ్ ట్వీట్ చేశారు.

నారాయణ, రామకృష్ణ సంతాపం

మాజీ ఎమ్మెల్యే, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం వేర్వేరు ప్రకటనల్లో ప్రగాఢ సంతాపం తెలిపారు. రామ్మూర్తి నాయుడు తనతో సన్నిహితంగా ఉండేవారని, నిర్మొహమాటంగా మాట్లాడేవారని నారాయణ అన్నారు. స్నేహానికి విలువిచ్చే రామ్మూర్తి మరణం పట్ల ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కాగా, 1994లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన రామ్మూర్తినాయుడు, అనంతపురం నియోజకవర్గం నుంచి ఎన్నికైన తాను అసెంబ్లీలో సహచరులుగా ఉండేవాళ్లమని, ఆయన ఎంతో అభిమానం, ఆప్యాయతతో పలుకరించేవారని రామకృష్ణ గుర్తు చేసుకున్నారు.

మళ్లీ విదేశాలకు మోదీ

నైజీరియా, బ్రెజిల్, గయానా దేశాల్లో ఐదు రోజుల పర్యటన

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ మరోమారు విదేశాలకు వెళ్లారు. ఆయన ఐదు రోజుల పాటు నైజీరియా, బ్రెజిల్, గయానా దేశాల్లో పర్యటిస్తారు. బ్రెజిల్ రాజధాని రియో డి జనేరియాలో జరిగే 19వ జీ20కి టోయికా సభ్యునిగా హాజరవుతారు. గయానా, జార్జ్‌టౌన్‌లోని భారత్-కారికోమ్ రెండవ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. నైజీరియా అధ్యక్షుడు బొలా అహ్మద్ తినుబు ఆహ్వానం మేరకు ఆ దేశానికి వెళుతున్నానని, అక్కడకు వెళ్లడం ఇదే మొదటిసారని శనివారం విదేశాలకు వెళ్లే ముందు మోదీ తెలిపారు. ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తన ఈ పర్యటన దోహదం కాగలదన్నారు. అలాగే వివిధ దేశాలతో ద్వైపాక్షిక సహకారాన్ని మరింతగా పెంచుకోవడంపై జీ20 సందర్భంగా దృష్టి పెడతానని చెప్పారు. అధ్యక్షుడు మహమ్మద్ ఇర్ఫాన్ అలీ ఆహ్వానంతో గయానాలో పర్యటిస్తానని మోదీ తెలిపారు. కాగా, గత 50ఏళ్లలో ఈ దక్షిణ అమెరికా దేశానికి వెళ్లే మొదటి ప్రధానిగా ఆయన నిలుస్తారు.

19న వయనాడ్‌లో ఎల్‌డీఎఫ్ హర్తాళ్

వయనాడ్: ముండక్కై-చురల్‌మల కొండచరియల విపత్తు బాధితులకు కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేసిందని ఎల్‌డీఎఫ్ వ్యాఖ్యానించింది. కొండచరియలు విరిగిపడిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న కేరళ డిమాండ్‌ను తిరస్కరించడంపై అసహనం వ్యక్తంచేసింది. అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ, ప్రత్యేక సహాయ నిరాకరణకు నిరసనగా ఈనెల 19న హర్తాళ్‌కు పిలుపునిచ్చింది. వయనాడ్‌లో మంగళవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు హర్తాళ్ జరగనుంది. దుకాణాలు, వ్యాపార సముదాయాలు, వ్యవస్థలను స్వచ్ఛందంగా మూసివేసి హర్తాళ్‌ను విజయవంతం చేయాలని ఎల్‌డీఎఫ్ జిల్లా కన్వీనర్ సీకే శశీంద్రన్ పిలుపునిచ్చారు. ఇదిలావుంటే, వయనాడ్ విషయంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు నిరసనగా అదే రోజు హర్తాళ్‌కు యూడీఎఫ్ కూడా పిలుపునిచ్చింది.

చిన్నారులు చనిపోతే... డిప్యూటీ సీఎంకు రాచమర్యాదలా

విపక్షాల మండిపాటు

ఝాన్సీ: ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లా మహారాణీ లక్ష్మీబాయి వైద్య కళాశాల ఆస్పత్రిలో జరిగిన ఘోర ప్రమాదం కలకలం రేపింది. ఈ విషాదం వేళ ఆస్పత్రి వర్గాలు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్ రాకకు ముందు ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేసి, సున్నం చల్లడంపై కాంగ్రెస్ పార్టీ అధికార బీజేపీపై విమర్శలు గుప్పించింది. సంబంధిత వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'అగ్నిప్రమాదంలో చిన్నారులు మృత్యువాత పడి... బాధిత కుటుంబాలు గుండెలవిసేలా రోధిస్తుంటే... డిప్యూటీ సీఎం రాక కోసం సాదర స్వాగతం పలికేందుకు రోడ్లు శుభ్రం చేసి, సున్నం చల్లుతున్నారు' అంటూ కాంగ్రెస్ సంబంధిత వీడియోను పోస్ట్ చేసింది. అప్పటి వరకు మురికి కూపంలా ఉన్న ఆస్పత్రి ఆవరణను డిప్యూటీ సీఎం రాక వేళ శుభ్రం చేశారని స్థానికులు పేర్కొన్నట్లు తెలిపింది. విషాదం వేళ ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఇదీ అంటూ మండిపడింది. చిన్నారుల మరణం కంటే తన ప్రతిష్ఠను కాపాడుకోవడానికే ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని మండిపడింది. యూపీలోని ప్రభుత్వ ఆస్పత్రులు అవినీతికి, నిర్లక్ష్యానికి నిలయాలుగా మారాయని సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది. చిన్నారులను రక్షించడానికి ఆస్పత్రిలో ఎలాంటి ఏర్పాట్లూ లేవని మండిపడింది. ప్రజలు చనిపోతున్నా ఆ పార్టీకి ఏమీ పట్టదంటూ ఆ పార్టీ అధికార ప్రతినిధి జూహీ సింగ్ విమర్శించారు.

యూపీలో బీజేపీ నిజాయతీగా ఉంటే 'ఇండియా'కు 60కు పైగా స్థానాలొచ్చేవి

హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో అఖిలేశ్

న్యూఢిల్లీ: బీజేపీ నిజాయతీగా ఉండివుంటే ఉత్తరప్రదేశ్‌లో 'ఇండియా'కు 60కుపైగా స్థానాలు వచ్చేవని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. విడిపోతే నామ రూపాలు లేకుండా పోతామన్న యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నినాదం ప్రతికూలమైనదని, మిత్రపక్షాలను దూరం చేస్తోందని వ్యాఖ్యానించారు. బటేంగేతో కటేంగే వంటి ప్రతికూలమైన నినాదం ఏ నాయకుడు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అఖిలేశ్ శనివారం హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో మాట్లాడుతూ బీజేపీ తీరును విమర్శించారు. 'లోక్‌సభ ఎన్నికలప్పుడు ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ నిజాయతీగా ఉంటే 'ఇండియా' 60-70 స్థానాల్లో గెలిచేది. అమేథి, రాయ్‌బరేలీలో ఎస్‌పీ, కాంగ్రెస్ పొత్తుతో బీజేపీ సీనియర్ నేతలు అనేక మంది చిత్తయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో ఆర్ఎస్ఎస్ చేయగలిగినదంతా చేసింది కానీ ఇక్కడి ప్రజలకు రాజ్యాంగంపై ఉన్న గౌరవం దృష్ట్యా దాని ప్రయత్నాలు ఫలించలేదు' అని అఖిలేశ్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా ఐక్య సంఘటన గెలుపు తథ్యమని విశ్వాసంగా చెప్పారు. ఎగ్జిట్ పోల్స్‌ను బీజేపీ ప్రభావితం చేయొచ్చన్నారు. ఉత్తరప్రదేశ్‌లో అభివృద్ధి గురించి యోగి ప్రభుత్వాన్ని నిలదీశారు. 'ఉత్తరప్రదేశ్‌లో ప్రతిష్ఠాత్మక వ్యవస్థలు, ప్రధాన రహదారుల కల్పనలో బీజేపీ విఫలమైంది. రాష్ట్రంలో రెండుసార్లు అధికారాన్ని చేపట్టినప్పటికీ నిరుద్యోగం, పేపర్ లీక్‌ల వంటి సమస్యల నుంచి యువతకు రక్షణ కల్పించలేకపోయింది' అని అఖిలేశ్ దుయ్యబట్టారు. భారత్ కంటే అఫ్ఘనిస్థాన్ వృద్ధి మెరుగ్గా ఉండటం వంటి అంశాల దృష్ట్యా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రాణించలేకపోయిందని అన్నారు. ఢిల్లీ వాయు కాలుష్యాన్ని ప్రస్తావిస్తూ దేశ రాజధాని నగరంలో శ్వాస ఎలా తీసుకోవాలన్నది ప్రధాన సమస్య అని ఆందోళన వ్యక్తంచేశారు. పర్యావరణ విభాగంలో కొంత కాలం గడిపిన నేపథ్యంలో రాజకీయాల్లో కాలుష్య ప్రక్షాళనపై దృష్టిని కేంద్రీకరించినట్లు చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో ఈ పని విజయవంతంగా జరుగుతున్నట్లు అఖిలేశ్ వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నిక తేదీ మార్పును ప్రస్తవిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం ఎందుకు మారిందని అఖిలేశ్ ప్రశ్నించారు. తాము గెలవడం లేదని బీజేపీకి తెలుసు కాబట్టే తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల తేదీ మారిందని వ్యాఖ్యానించారు. పీడీఏ (వెనుకబడిన, దళిత, మైనారిటీ) వర్గాల గురించి ఈ పార్టీ ప్రతినిధుల మాటలను బట్టి బీజేపీని ఓడించడంలో అణగారిన వర్గాల బలమేంటో అర్థం చేసుకోవచ్చని అఖిలేశ్ యాదవ్ అన్నారు.

ఆ నైతిక అర్హత టీడీపీ నేతలకు లేదు

కొమ్మూరి కనకారావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసెంబ్లీలో టిడ్కో ఇళ్లపై చర్చ సందర్భంగా మంత్రి నారాయణ అవాస్తవాలు చెప్పారని, దానిపై మాట్లాడే నైతిక అర్హత టీడీపీ నేతలకు లేదని వైసీపీ అధికార ప్రతినిధి కొమ్మూరి కనకారావు విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడ్కో ఇళ్లలో చంద్రబాబు వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, మౌలిక వసతులు కల్పించకుండా పేదలపై చంద్రబాబు భారం మోపితే జగన్ ప్రభుత్వం సకల హంగులు కల్పించి ఉచితంగా (రూ.1 కే) అందించిందని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు 2016-17లో రాష్ట్రంలో లేనంత అధికంగా నిర్మాణ వ్యయాన్ని చూపి లబ్ధిదారులను దోచుకున్నారని అన్నారు. ఈ అక్రమాలను గుర్తించిన జగన్ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ద్వారా నిర్మాణ వ్యయాన్ని రూ.2,840 కోట్లకు తగ్గించిందన్నారు. జగన్ సర్కార్‌లో పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తూ 30.75 లక్షల ఇళ్ల పట్టాలను ఉచితంగా అందజేయగా, 21.76 లక్షల ఇళ్ల నిర్మాణాలు జరిగాయని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.